
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 250
గురువారం 25-5-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



ముంబై ఆనందం.. 'ఆకాశ'మంత
లక్నోపై ముంబై విజయం.. 5 పరుగులిచ్చి 5 వికెట్లు తీసిన ఆకాశ్ - 12లో



సజావుగా ఉపసంహరణ
రూ.2 వేల నోట్లపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్ - 13లో



బంధాన్ని భంగపరిస్తే సహించం
ఖలిస్తాన్ వేర్పాటువాద మూకలు ఆస్ట్రేలియాలో ఆలయాలపై దాడులకు తెగబడటాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు.
వివరాలు 6లో ▸



పాస్‌పోర్టుకు ఎన్‌ఓసీ ఇవ్వండి
సాధారణ పాస్‌పోర్టు పొందడం కోసం నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఢిల్లీ కోర్టును కాంగ్రెస్ నేత రాహుల్ కోరారు.
వివరాలు 6లో ▸



మా పోరాటానికి మద్దతివ్వండి
పాలనాధికారాలపై కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా చేస్తున్న పోరుకు మద్దతివ్వాలని శివసేన నేత ఠాక్రేను ఆప్ చీఫ్ కేజ్రీవాల్ కోరారు.
వివరాలు 6లో ▸



మేం రాం రాం..
పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు 19 విపక్ష పార్టీలు ప్రకటించాయి.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పోర్టు, హార్బర్‌తో అభివృద్ధి పరుగులు

మూలపేట పోర్టు, బుడగట్లపాలెం హార్బర్ ఏర్పాటుతో శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మారనున్నాయని మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
వివరాలు 5లో ▸

అట్టహాసంగా టిడ్కో గృహ ప్రవేశాలు

గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ పరిధిలోని నిడుబ్రోలులో మొదటి విడతగా 1,660 టిడ్కో గృహాలను, పల్నాడు జిల్లా నరసరావుపేట కేసానుపల్లి పరిధిలో తొలి దశలో నిర్మించిన 500 టిడ్కో గృహాలను పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రారంభించారు.
వివరాలు 5లో ▸

గ్రామీణాభివృద్ధి శాఖకు మరో స్కోచ్ అవార్డు

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మరో స్కోచ్ అవార్డును సొంతం చేసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటిని నిల్వ చేయడానికి చెరువులు తవ్వినందుకు గానూ స్కోచ్ సిల్వర్ అవార్డుకు ఎంపికయ్యింది.
వివరాలు 5లో ▸

బఖ్‌ముత్‌లో 20 వేల మందిని కోల్పోయాం

తూర్పు ఉక్రెయిన్‌లోని బఖ్‌ముత్ నగరంలో తమకు భారీ నష్టం వాటిల్లిందని రష్యా ప్రైవేట్ సైన్యమైన 'వాగ్నర్' చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ వెల్లడించారు. ఉక్రెయిన్ సేనలతో జరిగిన పోరాటంలో 20,000 మందికిపైగా సైనికులను కోల్పోయామని చెప్పారు.
వివరాలు 6లో ▸


తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన సభకు హాజరైన విద్యార్థులు, అశేష జన సందోహంలో ఓ భాగం

రానున్నది కురుక్షేత్రం..

మీ బిడ్డకు అండగా ఉండండి

జగనన్న విద్యా దీవెన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

మీరు పెద్ద చదువులు చదవండి.. ఫీజు ఎంతైనా మేం చెల్లిస్తాం

- విద్యార్థులపై చేస్తున్న ఖర్చు హ్యూమన్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్
- ఇంగిత జ్ఞానం లేని ప్రతిపక్షాలు ఈ విషయం గ్రహించాలి
- ఈ నాలుగేళ్లలో అక్కచెల్లెమ్మలకు రూ.3 లక్షల కోట్లు లబ్ధి
- రాష్ట్ర అప్పుల గ్రోత్ రేట్ గతంలో కంటే ఇప్పుడే తక్కువ
- అప్పుడూ, ఇప్పుడూ అదే బడ్జెట్.. అప్పుడెందుకు ఈ పథకాల్లేవ్?
- గతంలో ఏ ముఖ్యమంత్రీ పేదల గురించి ఇంతగా ఆలోచించ లేదు
- మీ ఇంట్లో మేలు జరిగి ఉంటేనే నాకు మద్దతు ఇవ్వండి

2లో

"నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, నిరుపేద వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా గట్టిగా నిలబడాలంటే వారి పట్ల ఉన్న వివక్ష సంకెళ్లు తెంచుకోవాలి. అందుకు చదువు ఒక్కటే మార్గమని అంబేడ్కర్, సావిత్రీబాయి పూలే, అబుల్ కలాం ఆజాద్ వంటి గొప్పవాళ్లు చెప్పారు. అందుకే మీ బిడ్డగా, మీ తమ్ముడిగా, మీ వాడిగా నాలుగేళ్లుగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాను. - సీఎం వైఎస్ జగన్


విద్యార్థిని దివ్యను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పెద్ద చదువులు పేదల హక్కు
- వివక్ష పోవాలంటే చదువే అస్త్రం.. ఈ నాలుగేళ్లుగా అదే యజ్ఞం
- 9.95 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన నిధులు రూ.703 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ

2లో

వివేకాను హత్య చేసిన వాళ్లు బయట తిరుగుతున్నారు

వాళ్లను వదిలి అవినాశ్‌ను టార్గెట్ చేయటం బాధాకరం

వైఎస్ సోదరి విమలమ్మ ఆవేదన
- సునీత వెనకాల కొన్ని దుష్టశక్తులున్నాయి
- గతంలో హత్య వెనక కుటుంబీకులు లేరని ఆమె చెప్పింది
- మరిప్పుడు మాట ఎందుకు మార్చిందో తెలియటం లేదు
- ఇది తప్పని చెప్పినా... ఆమె ఏమీ మాట్లాడటం లేదు
- టీవీ చానెళ్లలో అన్యాయంగా మాట్లాడుతున్నారు
- అవినాశ్ తల్లి ఈ వ్యవహారంతో తల్లడిల్లిపోతోంది.. ఆస్పత్రిలో శ్రీలక్ష్మికి విమలమ్మ పరామర్శ



కర్నూలు(రాజ్‌విహార్): ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల కారణంగా తమ కుటుంబం పరిస్థితి భయంకరంగా తయారయిందని, తన సోదరుడు వైఎస్ వివేకానందరెడ్డిని చంపిన వారు మాత్రం బయట విచ్చలవిడిగా తిరుగుతున్నారని వైఎస్ వివేకా సోదరి వైఎస్ విమలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఏ తప్పు చేయలేదనే వాళ్లు మాత్రం జైలులో ఉన్నారంటూ... ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సీబీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తుండటం బాధ కలిగిస్తోందన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్ అవినాశ్ రెడ్డి తల్లి శ్రీలక్ష్మిని ఆమె పరామర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ''శ్రీ లక్ష్మిని పరామర్శించా. ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉంది. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థించా. వైఎస్ భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్నారు. అవినాశ్‌ను కూడా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. సీబీఐ వ్యవహారంతో ఒక తల్లిగా శ్రీలక్ష్మి తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తల్లడిల్లిపోతున్న ఆమెను చూసి దేవుడిని ప్రార్థించేందుకు ఆసుపత్రికి వచ్చా'' అని వ్యాఖ్యానించారు. శ్రీలక్ష్మి ఒక దశలో డెత్ స్టేజీకి వెళ్లి బయటకు వచ్చారని, చాలా సార్లు నాతో దైవసేవకు కూడా వచ్చారని వైఎస్ విమలమ్మ తెలియజేశారు.

చానెల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు..
అవినాశ్‌ను టార్గెట్ చేసి సీబీఐ అధికారులు వెళ్తున్నట్లు అనిపిస్తోందని, టీవీ చానల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని
మిగతా 14వ పేజీలో ▸

పోలవరం తొలిదశ సవరించిన అంచనాలపై

నేడు ఢిల్లీలో కీలక భేటీ

- తొలిదశ పూర్తికి రూ.16,952.07 కోట్లతో సవరించిన వ్యయ ప్రతిపాదన పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- దీనిపై పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ సమీక్ష
- సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేసి కేంద్ర మంత్రిమండలికి పంపనున్న జల్‌శక్తి శాఖ
- కేంద్ర మంత్రిమండలి ఆమోద ముద్ర వేస్తే పోలవరానికి నిధుల విడుదలకు మార్గం సుగమం



- చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేస్తూ పోలవరాన్ని పూర్తిచేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అడుగులు

14లో

జూన్ మొదటి వారం వరకూ మంటలే!

రాష్ట్రంలో మండిపోతున్న ఎండలు

రుతుపవనాలు నెమ్మదిగా కదలడమే కారణం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎండల తీవ్రత జూన్ మొదటి వారం వరకూ కొనసాగనుంది. నైరుతి రుతు పవనాలు నెమ్మదిగా కదులుతుండటమే దీనికి కారణమని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. రుతుపవనాలు గత మూడు రోజుల నుంచి బంగాళాఖాతంలో నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ సమయానికి బంగాళాఖాతంలో ఎక్కువ ప్రాంతాలకు విస్తరించి అండమాన్ నికోబార్ దీవులను తాకాల్సి ఉంది. కానీ ఇంకా అవి బంగాళాఖాతంలోనే నెమ్మదిగా కదులుతుండడంతో నెలాఖరుకు కేరళను తాకే అవకాశం తక్కువేనంటున్నారు. వాతావరణం అనుకూలించి రెండు, మూడు రోజుల్లో రుతు పవనాలు ముందుకు కదిలితే వచ్చే 3, 4 తేదీల్లో కేరళలో ప్రవేశించి.. ఆ తర్వాత జూన్ రెండో వారానికి రాష్ట్రాన్ని తాకే మిగతా 2వ పేజీలో ▸



అన్నదాతల్లో 'ధర'హాసం


అంబేడ్కర్ కోనసీమ జిల్లా పలివెలలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న కూలీలు

- తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- నూక ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలింపు
- రైతులు ఎక్కడా నష్టపోకుండా పటిష్ట చర్యలు
- ప్రభుత్వమే కొనుగోళ్లు జరపడంతో జయ రకం ధాన్యానికి పెరిగిన రేటు
- మార్కెట్‌లో 75 కేజీలు రూ.1,500 నుంచి రూ.1,700 పలుకుతున్న వైనం
- మండలానికో మొబైల్ రైస్ మిల్ ఏర్పాటు

3లో

బైడెన్‌ను హత్య చేసి అధ్యక్షుడినవుతా!



మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉందో, లేదో గానీ అమెరికాలో తెలుగు సంతతి యువకుడు కందుల సాయి వర్షిత్ ఏకంగా ఆ దేశ అధ్యక్షుడు బైడెన్ హత్యకు పన్నాగం పన్ని, కలకలం సృష్టించాడు. వైట్‌హౌజ్ కంచెను ట్రక్కుతో ఢీకొట్టాడు. దీంతో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. బైడెన్‌ను హత్య చేసి అధ్యక్ష పదవిని దక్కించుకోవడమే తన లక్ష్యమని చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు.
- వివరాలు 14లో

రామప్పపై ఏఎస్ఐ మంట!

ఆలయానికి ఐదు కి.మీ. దూరంలోనే బొగ్గు గనులకు సింగరేణి ప్రతిపాదనలు

- ఎన్‌ఓసీ జారీకి అభ్యంతరం లేదన్న ఏఎస్ఐ.. ఈ తీరుపై పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ ఆగ్రహం
- గనులతో రామప్ప ఆలయానికి ప్రమాదం తప్పదని హెచ్చరిక
- యునెస్కో గుర్తింపు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన
- సాంకేతిక నివేదిక కోసం ఎన్‌జీఆర్ఐ, జీఎస్ఐలకు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ సమీపంలో సింగరేణి సంస్థ ప్రతిపాదించిన 'పీవీ నరసింహారావు భూఉపరితల గనుల (ఓపెన్ కాస్ట్ మైన్స్)' అంశం వివాదానికి కారణమైంది. ఇప్పటికే ప్రతిపాదిత గనులతో అక్కడికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి ముప్పు వస్తుందన్న అభ్యంతరాలు ఉన్నాయి. అలాంటిది బొగ్గు గనుల ఏర్పాటు కోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీపై కేంద్ర పురావస్తుశాఖ సానుకూల నిర్ణయం తీసుకోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



యునెస్కో గుర్తింపు పొందిన కట్టడం
రామప్ప దేవాలయం ఇటీవలే యునెస్కో నుంచి ప్రపంచ వారసత్వ సంపద హోదా గుర్తింపు దక్కించుకున్న విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో ఆ ఘనత సాధించిన తొలి కట్టడంగా రామప్ప ఆలయం రికార్డు సృష్టించింది. దీనికి సమీపంలోనే సింగరేణి బొగ్గు గనుల తవ్వకాలకు ప్రతిపాదనలు వచ్చాయి. దీనికి సంబంధించి బెంగళూరులోని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ప్రాంతీయ కార్యాలయం ఎన్‌ఓసీ జారీకి సానుకూలత వ్యక్తం చేసింది. నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైనింగ్ ఇంజనీరింగ్‌లను సంప్రదించి.. సింగరేణి హామీల ఆధారంగా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు పేర్కొంది. కానీ దీనిపై రామప్ప ఆలయ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్న 'ది పాలంపేట ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' విస్మయం వ్యక్తం చేసింది. ప్రతిష్టాత్మకమైన యునెస్కో గుర్తింపు సాధించిన తరుణంలో, దానికి విఘాతం కలిగించే ఏ చిన్న చర్యను కూడా ఉపేక్షించకుండా అభ్యంతరం చెప్పాల్సిన ఏఎస్ఐ.. అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమిటని మండిపడింది. ఈ అథారిటీలో కీలక సభ్యత్వమున్న కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. మరోవైపు బొగ్గు గనులు ప్రారంభమైతే రామప్ప ఆలయానికి జరిగే నష్టం ఏమిటో తేల్చాలని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లను పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ కోరింది. దీనితోపాటు బొగ్గు గనులతో జీవావరణం, సామాజిక, ఆర్థిక ప్రభావంపై అధ్యయనం చేయాలని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్‌ను కోరాలని నిర్ణయించింది. ఈ సంస్థలు తేల్చే అంశాల ఆధారంగా బొగ్గు గనుల తవ్వకం ఆధారపడి ఉంది.

51,392 మంది

పేదలకు 'పట్టా'భిషేకం రేపు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా వెంకటాయపాలెంలో పట్టాల పంపిణీ

- సీఆర్డీఏ పరిధిలో 1,402.58 ఎకరాల్లో సిద్ధమైన 25 లేఅవుట్లు
- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో నిరుపేదలకు స్థలాలు.. ఇదే వేదికపై 5,024 టిడ్కో ఇళ్లు పంపిణీ
- పేదలకు పట్టాలివ్వకుండా అడుగడుగునా అడ్డుకున్న టీడీపీ అండ్ కో
- సెంటు స్థలం సమాధులకు సరిపోతుందంటూ బాబు చులకన వ్యాఖ్యలు
- సీఆర్డీఏ పరిధిలో నిరసనలు, కోర్టుల్లో కేసులు.. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించిన కోర్టులు.. 144వ సెక్షన్ ఉన్నా నిరసన పేరుతో డ్రామాలు
- తగ్గని సర్కార్.. పట్టాల పంపిణీకి సిద్ధం


గుంటూరు జిల్లా వెంకటాయపాలెంలో పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల లే అవుట్

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఒకటీ రెండూ కాదు.. వందా ఐదు వందలూ అసలే కాదు.. అక్షరాలా 51,392 నిరుపేదల కుటుంబాలు.. ప్రభుత్వం చొరవతో సొంతింటికి హక్కుదారులు అవుతున్నాయి. శుక్రవారం ఉదయం తుళ్లూరు మండలం వెంకటాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఈ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లబ్ధిదారులకు అందజేయనున్నారు. సీఆర్డీఏ పరిధిలోని నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, యర్రబాలెం, పిచ్చుకలపాలెం, బోరుపాలెం..
మిగతా 3వ పేజీలో ▸

ఇదండీ జగత్


ఇక ఆగొద్దు సార్! సీబీఐ డ్రెస్‌లో మనమే వెళ్లి అరెస్టు చేద్దాం!!

క్లుప్తంగా...

ప్రధాని మోదీకి సీఎం అభినందనలు

- ట్వీట్ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పార్లమెంట్ నూతన భవనాన్ని జాతికి అంకితం చేయబోతున్న ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. 'పార్లమెంట్ అనేది ప్రజాస్వామ్య దేవాలయం. అది మన దేశం ఆత్మను ప్రతిబింబిస్తుంది. అది మన దేశ ప్రజలందరికీ, అన్ని రాజకీయ పార్టీలకు చెందినది. ఇలాంటి శుభకార్యక్రమాన్ని బహిష్కరించడం నిజమైన ప్రజాస్వామ్యస్ఫూర్తి కాదు. రాజకీయ విభేదాలన్నింటినీ పక్కనపెట్టి ఈ మహత్తర కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు హాజరుకావాలని కోరుతున్నాను. నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ హాజరవుతుంది..' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

నిరుపేద వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు మంజూరు

- మానవత్వం చాటుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సీఎం జగన్‌కు సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గుండె సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తి పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వంతో స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన ఇసుకపట్ల సత్యనారాయణది నిరుపేద కుటుంబం. 57 ఏళ్ల వయసున్న ఆయన 20 సంవత్సరాలుగా గుండె సమస్యతో బాధపడుతున్నాడు. గుండె సమస్యకు వాడుతున్న మందుల ప్రభావంతో రెండు కిడ్నీలూ పాడైపోయాయి. సత్యనారాయణ సమస్యను ఇటీవల అప్పనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దృష్టికి సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు నీలిమలు తీసుకువెళ్లారు. గుండె, కిడ్నీ సమస్యలతో సత్యనారాయణకు ప్రతి నెలా వైద్య ఖర్చులు రూ.15 వేలు అవుతున్నాయని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పర్యటనకు బుధవారం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సత్యనారాయణ సమస్యను ఎమ్మెల్యే చిట్టిబాబు వివరించారు. దీనిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి, బాధితుడి వైద్య ఖర్చులకు వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేయించి.. మానవత్వాన్ని చాటుకున్నారు.

జూన్ మొదటి వారం వరకూ

మంటలే!

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశముంటుందని భావిస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితుల వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. దీన్నిబట్టి జూన్ 8వ తేదీ వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతుందని చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో అక్కడక్కడా కురుస్తున్న వర్షాలకు కారణం అరేబియన్ సముద్రం నుంచి వస్తున్న గాలులేనని వాతావరణ శాఖ చెబుతోంది.

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అన్ని జిల్లాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో 44.7, ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం జువ్విగుంటలో 44.5, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులో 44.4, బాపట్ల జిల్లా బల్లికురువు మండలం కొప్పెరపాడులో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామ, పెనుగంచిప్రోలు, గుంటూరు జిల్లా గుంటూరు, దుగ్గిరాల, మంగళగిరి, మేడికొండూరు, పెదకాకాని, తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు, పల్నాడు జిల్లా అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు.

ప్రధాన కేంద్రాల్లో బుధవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.7	30.4
రాజమహేంద్రవరం	42.5	29.0
గుంటూరు	42.0	29.0
కర్నూలు	41.8	28.8
విజయవాడ	41.0	29.0
నెల్లూరు	40.9	29.0
కడప	39.8	28.3
తిరుపతి	39.0	28.0
శ్రీకాకుళం	38.0	26.0
విజయనగరం	37.0	30.0
విశాఖపట్నం	35.6	28.0

రానున్నది కురుక్షేత్రం..
మీ బిడ్డకు అండగా ఉండండి

జగనన్న విద్యా దీవెన సభలో సీఎం వైఎస్ జగన్



కొవ్వూరు నుంచి సాక్షి ప్రతినిధి: 'పేదల తల రాత మార్చేందుకు ఈ నాలుగేళ్లలో విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. చరిత్రలో ఇదివరకెన్నడూ లేని విధంగా పేదల బాగు కోసం మనందరి ప్రభుత్వం ఎంతగానో పరితపిస్తూ అడుగులు ముందుకు వేస్తోంటే గత పాలకులు రాష్ట్రం దివాలా తీస్తోందని దుష్ప్రచారం చేస్తున్నారు. వారంతా గజదొంగల ముఠాగా ఏర్పడి తోడేళ్ల గుంపు మాదిరిగా మీ బిడ్డపైకి వస్తున్నారు. పేదల ప్రతినిధిగా ఉన్న నాపైకి ఈ పెత్తందారులంతా రాబోయే రోజుల్లో మరిన్ని అబద్ధాలు చెబుతూ.. మరింతగా దుష్ప్రచారం చేస్తూ వస్తారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. రాబోయే రోజుల్లో వారితో జరిగే కురుక్షేత్ర మహా సంగ్రామంలో మీరంతా మీ బిడ్డకు అండగా నిలవాలని కోరారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు సత్యవతినగర్‌లో బుధవారం 'జగనన్న విద్యా దీవెన' జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించిన నిధులను లబ్ధిదారుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదవాడికి ఏం చెయ్యాలి.. పేదరికం పోవాలంటే ఆ పేదవాడిని ఎలా ఆదుకోవాలి.. ఎలా తోడుగా నిలబడాలని గత ప్రభుత్వ పెద్దలు ఏ రోజూ ఆలోచించలేదని చెప్పారు. గతంలో ఒక చంద్రబాబు, ఒక ఈనాడు, ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ–5 వీళ్లందరికీ తోడు ఒక దత్తపుత్రుడు.. అంతా ఒక గజ దొంగల ముఠాగా ఏర్పడ్డారన్నారు. వాళ్ల రాజకీయం, వాళ్ల ఆలోచన అంతా దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం అన్నట్టుగా సాగిందని తెలిపారు. 'అందుకే దీని గురించి ఏ పేపర్‌లో రాయరు.. ఏ టీవీలో డిబేట్‌లు పెట్టరు.. ప్రశ్నిస్తాను అన్న ఏ ఒక్కరూ ప్రశ్నించరు.. కాలేజీలో చదువుతున్న పిల్లలపై చేస్తోన్న ఖర్చుతో రాష్ట్రం దివాలా తీస్తుందని నిస్సిగ్గుగా మాట్లాడే ప్రతిపక్ష నాయకుడిని, చెడిపోయిన మీడియా వ్యవస్థను చూస్తున్నాం' అని అన్నారు. పేద పిల్లలు పెద్ద చదువులు చదవాలని, ఫీజు ఎంతైనా ప్రభుత్వం చూసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఇంగిత జ్ఞానం లేని కొందరికి చదువు విలువ తెలియదు

- భావితరాల తలరాతలు మార్చేలా విద్యార్థులపై హ్యూమన్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా ఖర్చు చేస్తున్నాం. ఈ హ్యూమన్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ రాష్ట్రం, దేశం.. దశ, దిశ మారుస్తుంది. ఈ రోజు రాష్ట్రంలో ప్రతి విద్యార్థి మంచి ఇంజినీర్‌గా, డాక్టర్‌గా బయటకు వస్తే భావితరాలకు స్కిల్డ్ మేన్ పవర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్ర రాష్ట్రం నిలుస్తుంది.
- దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి విప్లవాత్మక మార్పులు విద్యా వ్యవస్థలో తీసుకువచ్చాం. ప్రభుత్వ బడి మారింది. చదువులు మారుతున్నాయి. ఇంగ్లిష్ మీడియం వచ్చింది. సీబీఎస్‌ఈ సిలబస్ కూడా వచ్చింది. బైలింగ్వల్ టెక్స్ట్ బుక్స్ కూడా తీసుకువచ్చాం. దీని ద్వారా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో విద్యను అభ్యసించే అవకాశం లభించింది. పౌష్టికాహారం ఇచ్చే విషయంలో ఎక్కడా రాజీపడటం లేదు.
- గత ప్రభుత్వం సంవత్సరానికి కేవలం రూ.400 కోట్లు ఖర్చు చేస్తే మన ప్రభుత్వంలో ఈ ఒక్క పథకానికి దాదాపు రూ.2 వేలు కోట్లు ఖర్చు చేస్తున్నాం. పిల్లలకు యూనిఫాం నుంచి బుక్స్ వరకు ఎప్పుడు పాఠశాలలు తెరిచినా వారికి అందేట్టుగా విద్యాకానుక అందిస్తున్న ప్రభుత్వం మనదే. చదువుల విప్లవమే తీసుకువచ్చాం.
- పేదరికం సంకెళ్ల నుంచి బయటపడాలంటే విద్య ఒక్కటే పాశుపతాస్త్రం. మీ ఇంటిలో అందరినీ చదివించండి. మీ వెంట నేనుంటా. వివక్ష పోవాలంటే ఉన్నత చదువులతోనే సాధ్యమవుతుంది. విద్యపై పెట్టేది హ్యూమన్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ అనే విషయం ఇంగిత జ్ఞానం లేని కొందరు ప్రతిపక్ష నేతలకు తెలియడం లేదు.

ఇది క్లాస్ వార్

- ➤ గతానికి ఇప్పటికీ తేడా చూడమని అడుగుతున్నా. ఈ నాలుగేళ్లలో జరిగిన మంచిని జీర్ణించుకోలేని వారందరూ కలిసి కట్టుగా ఒక్క జగన్‌ను ఎదుర్కోవడానికి వస్తామంటున్నారు. మీ జగన్‌కు వాళ్ల మాదిరిగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడి మద్దతు ఉండకపోవచ్చు.
- ➤ ఈ రోజు జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు.. క్లాస్ వార్ జరుగుతోంది. పేద వాళ్లంతా ఒక వైపు ఉంటే మరో వైపు పెత్తందార్లు ఉన్నారు. మనందరి ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే మీ బిడ్డకు అండగా సైనికులుగా నిలబడండి. నా బలం, నా నమ్మకం మీరే. దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనలనే నమ్ముకున్నా.

ప్రతి కుటుంబం నుంచి సత్య నాదెళ్ల రావాలి

- మన రాష్ట్రంలో ప్రతి కుంటుంబం నుంచి ఒక సత్య నాదెళ్ల రావాలి. ఆ దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం మనది అని చెప్పడానికి గర్వపడుతున్నా. స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్‌లో సీటు వచ్చినా ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థులు.. ప్రతిభ మీరు చూపించండి, మీ ప్రతిభకు తోడుగా మీ జగనన్న ఉంటాడని మళ్లీ చెబుతున్నా.
- షాదీ తోఫా, కళ్యాణమస్తు వంటి పథకాలకు చదువుతో ముడిపెట్టి ప్రతి ఇంట్లో కూడా పెద్ద చదువులు చదివేలా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం మన ప్రభుత్వం అని చెప్పడానికి గర్వపడుతున్నా. మన పిల్లలు బాగా చదవాలని, పేద పిల్లలు పేదరికం నుంచి బయటకు రావాలంటే చదువు ఒక్కటే మార్గమని మనసా వాచా కర్మణా నమ్మి వాళ్ల తరఫున మనందరి ప్రభుత్వం చదువుల కోసం ఇంతగా తాపత్రయపడుతోంది.

విమర్శకులారా ఆలోచించండి

- ఇంతకు ముందెప్పుడైనా ఇలా బటన్‌లు నొక్కి ఎవరికీ లంచాలు ఇవ్వకుండా, వివక్ష చూపకుండా నేరుగా తల్లుల ఖాతాల్లోకి పథకాల లబ్ధి నేరుగా చేర్చే పరిస్థితి ఉందా? మనందరి ప్రభుత్వాన్ని విమర్శించే వారు, విద్యాదీవెన అందుకుంటున్న ప్రతి తల్లి, ప్రతి విద్యార్థి ఒక్కసారి ఆలోచించాలని కోరుతున్నా.
- జగనన్న అమ్మ ఒడి దగ్గర మొదలు పెడితే విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత ఇలా ఏ పథకం చూసినా ఎక్కడా లంచాలు లేకుండా, వివక్ష లేకుండా నేరుగా ప్రజల ఖాతాల్లోకి ఏ విధంగా వస్తోందో ఆలోచించండి.
- ఇంతకు ముందు కూడా ఇదే బడ్జెట్, ఇదే రాష్ట్రం. అప్పుల గ్రోత్ రేటు గతం కన్నా ఇప్పుడు మీ బిడ్డ ప్రభుత్వంలోనే తక్కువ. అదే రాష్ట్రం అయినప్పుడు, అదే బడ్జెట్ ఉన్నప్పుడు కేవలం మార్పు ఒక్క ముఖ్యమంత్రి మాత్రమే. ఒక్క ముఖ్యమంత్రి మారడంతో ఈ రోజు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి రూ.2.10 లక్షలు కోట్లు నేరుగా (డీబీటీ) వెళ్లింది. దీనికి ఇంటి స్థలాలు.. ఒక్కో స్థలం విలువ రూ.2.50 లక్షలు వేసుకున్నా రూ.75 వేల కోట్లు నాన్ డీబీటీ కింద కలుపుకుని మొత్తంగా రూ.3 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మలకు అందజేశాం. ఇదంతా ఈ నాలుగేళ్లలోనే జరిగింది. ఇది గతంలో ఎందుకు జరగలేదు? ఇప్పుడు ఎందుకు జరుగుతుందో ఆలోచించండి.



జగనన్నే మా భవిష్యత్తు.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పేదల కోసం పుట్టిన రారాజువన్నా..



ఇప్పటి వరకు ఎంత ఏడ్చినా మా కన్నీళ్లు ఆగవనుకున్నా. మీ చిరునవ్వుతో ఆ కన్నీళ్లు కాస్తా మాకు ఆనంద భాష్పాలుగా మారాయి. మాలాంటి పేద ప్రజల కోసం పుట్టిన రాజు, రారాజు మీరు. సంక్షేమ బాటసారివి. అధికార పీఠానికి కొత్త భాష్యం పలికి ఆదర్శమూర్తిగా నిలిచారన్నా. నా తల్లిదండ్రులు వికలాంగులు. వారికి మేము ఇద్దరం ఆడ పిల్లలం. నాన్న ఆకుకూరలు అమ్ముతుండగా అనుకోకుండా ఆయనకు పక్షవాతం వచ్చి బాగా నీరసించిపోయాడు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇప్పిస్తూ.. మా కుటుంబాన్ని ఆదుకుంటున్న మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నా. మీ వల్లే నేను కార్పొరేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నా. మేము చదువుకున్నప్పటి స్కూళ్లు, ఇప్పటి స్కూళ్లు చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నా. మళ్లీ స్కూలుకు వెళ్లి చదువుకోవాలనిపిస్తోందన్నా. మాకు అన్న లేని లోటు మీ వల్ల తీరుతోందన్నా. తరానికి ఒక్కడు, యుగానికి ఒక్కడు అంటుంటారే.. అది మీరేనన్నా.

– దివ్య, బీకాం థర్డ్ ఇయర్, కొండవీటి డిగ్రీ కళాశాల, గోపాలపురం

ఉద్యోగావకాశాలు మీ చలవే



నేను పేద మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడిని. నా తల్లి గృహిణి, తండ్రి రైతు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం రూ.35 వేలు మాత్రమే వచ్చేది. ఈ రోజు నేను చాలా అదృష్టవంతుడిని. నాకు జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది. ఒక సాధారణ నాయకుడిలా మీరు మోసపూరిత హామీలు ఇవ్వలేదు. ఎన్ని కష్టాలున్నా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు. మీరు ఉన్నత విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు చాలా ఉపయోగకరం. దేశంలో నూతన విద్యా విధానం తీసుకువచ్చిన తొలి రాష్ట్రం మనదే. మన విద్యా విధానంలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఉండటంతో ఎన్నో ఉద్యోగావకాశాలు పొందుతున్నాము. గతంలో మా కళాశాలలో కేవలం 30 – 40 శాతం మందికి ఉద్యోగావకాశాలు ఉండేవి. మీరు వచ్చాక అది 90 శాతానికి పెరిగింది. మా కాలేజ్ నుంచి ఓ విద్యార్థికి రూ.44 లక్షల ప్యాకేజీతో అమేజాన్‌లో ఉద్యోగం లభించిందంటే అది మీరు తీసుకువచ్చిన మార్పే. మీరే శాశ్వత సీఎంగా ఉండాలి.

– రాపర్ల ప్రసన్నకుమార్, బీటెక్ థర్డ్ ఇయర్, తాడేపల్లిగూడెం

పెద్ద చదువులు పేదల హక్కు

జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- జూన్ నుంచి 15,750 స్కూళ్లలో డిజిటల్ విద్యా బోధన
- ఇప్పటి వరకు విద్యా దీవెన, వసతి దీవెనలకు రూ.14,912 కోట్లు
- నాలుగేళ్ల జాబ్ ఓరియెంటెడ్ డిగ్రీలకు శ్రీకారం
- కరిక్యులంలో మైక్రోసాఫ్ట్, అమెజాన్‌లకు భాగస్వామ్యం



జగనన్న విద్యా దీవెన చెక్కుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కొవ్వూరు నుంచి సాక్షి ప్రతినిధి: 'పెద్ద చదువులు అనేవి పేదల హక్కుగా భావించి గత నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాం. వివక్ష పోవాలంటే ఉన్నత చదువులతోనే సాధ్యమవుతుంది. ఈ దిశగా ఈ కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా ఓ యజ్ఞంలా చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చిన్నప్పటి నుంచే విద్యకు బాటలు వేస్తూ 'అమ్మ ఒడి' పథకం అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు సత్యవతినగర్‌లో బుధవారం 'జగనన్న విద్యా దీవెన' జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించి 9.95 లక్షల మంది విద్యార్థులకు రూ.703 కోట్లను విడుదల చేశారు. కంప్యూటర్‌లో బటన్ నొక్కి 8,91,150 మంది తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదరికంతో రాష్ట్రంలో ఏ ఒక్క విద్యార్థి చదువు ఆగకూడదన్నదే తన లక్ష్యమన్నారు. సమాజంలో తరతరాలుగా పేదరికంలో మగ్గిపోతున్న కుటుంబాల తలరాతలు మారాలన్నా, ఆ కుటుంబాలు వెలుగులోకి రావాలన్నా.. ప్రతి కుటుంబం నుంచి ఇంజనీర్, డాక్టర్, కలెక్టర్ వంటి పెద్ద పెద్ద చదువులతో మన పిల్లలు రాణించాలన్నారు. అప్పుడే పేదరికం అనే సంకెళ్లను తెంచుకోవచ్చని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మేనమామగా నేను తోడుంటా

- ఒక్క జగనన్న విద్యా దీవెనకే రూ.10,636 కోట్లు ఇచ్చాం. ఈ పథకం ద్వారా 26,98,000 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. గత నాలుగేళ్లలో కేవలం విద్యార్థుల ఉన్నత చదువుల కోసమే విద్యా దీవెన, వసతి దీవెనల కోసం రూ.14,912 కోట్లు ఖర్చు చేశాం. గత చంద్రబాబు ప్రభుత్వం 2018లో చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన ఫీజులు రూ.1,778 కోట్లు చిరునవ్వుతో చెల్లించాం.
- జగనన్న వసతి దీవెన కార్యక్రమం చేపట్టి ఐటీఐ చదువుతున్న పిల్లలకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. తద్వారా 25,17,000 మంది పిల్లలకు మంచి చేస్తూ నాలుగేళ్లలో రూ.4,232 కోట్లు ఖర్చు చేశాం.
- గతంలో చంద్రబాబు హయాంలో ఫీజులు ఇచ్చామంటే ఇచ్చామని చెప్పేవారు. కేవలం రూ.35 వేలు ముష్టి వేసినట్టు కొంత మందికే ఇచ్చేవారు. మన ప్రభుత్వంలో మీ పిల్లలకు తోడుగా నేనుంటానని, మేనమామగా అండగా ఉంటానని ఫీజు ఎంతైనా చెల్లిస్తున్నాం.

జాబ్ ఓరియెంటెడ్ కరిక్యులం

- కరిక్యులంలో పూర్తిగా మార్పు తీసుకువచ్చాం. జాబ్ ఓరియెంటెడ్ కరిక్యులంతో ప్రస్తుత అవసరాలకు తగ్గట్లు మార్పులు చేసి 25 మార్కెట్ ఓరియెంటెడ్ కోర్సులతో పాటు 67 బిజినెస్ ఒకేషనల్ కోర్సులు భాగం చేశాం. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టాం.
- స్కిల్ ఓరియెంటెడ్‌గా పిల్లలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు కూడా ఈ రోజు మన ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నాయి. వారిచేత కోర్సులు చెప్పించి, వారిచ్చే సర్టిఫికెట్‌లు కరిక్యులంలో భాగంగా చేసి మెరుగైన ఉద్యోగాలు వచ్చేలా అడుగులు వేస్తున్నాం.
- ఒక మైక్రోసాఫ్టే కాకుండా అమెజాన్ వంటి ఎన్నో సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అనుసంధానమై ఈ కరిక్యులంలో భాగస్వామ్యం అయ్యాయి. జగనన్న విదేశీ విద్య ద్వారా ప్రపంచంలోనే టాప్ కళాశాలల్లో సీటు తెచ్చుకున్న విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు పూర్తిగా ఫీజు చెల్లించే కార్యక్రమం మన ప్రభుత్వంలోనే జరుగుతోంది.
- ఈ సభలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎంపీలు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మార్గాని భరత్ రామ్, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఉన్నత విద్య చైర్మన్ హేమచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే.. అంటూ యువత కేరింతలు

ప్రభుత్వ బడులతో పోటీ పడే పరిస్థితి

- ఇంతగా పిల్లల మీద ధ్యాస పెట్టి పిల్లలను చదివించడానికి అడుగులు వేస్తున్న ప్రభుత్వం మనదే. సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ తీసుకువచ్చాం. ఎనిమిదవ తరగతిలోకి వచ్చే పిల్లలకు బైజూస్ కంటెంట్ లోడ్ చేసిన ట్యాబ్ ఇస్తున్నాం. మనబడి నాడు–నేడు మొదటి దశలో 15,750 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. 6వ తరగతి నుంచి డిజిటల్ క్లాస్ రూంలు తీసుకువచ్చి డిజిటల్ బోధన తీసుకొస్తున్నాం. తద్వారా ప్రైవేటు బడులు ప్రభుత్వ బడులతో పోటీ పడే పరిస్థితి వస్తుంది.
- ఈరోజు విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. 2017–18లో ప్రభుత్వ బడుల్లో 35 లక్షల మంది విద్యార్థులు ఉంటే ఈ రోజు ఆ సంఖ్య 40 లక్షలు దాటింది. ప్రభుత్వ బడులపై నమ్మకం పెరగడంతో డ్రాపవుట్స్ గణనీయంగా తగ్గుతున్నాయి.
- 12వ తరగతి తర్వాత డిగ్రీలో చేరకుండా 2018–19లో 81,810 మంది ఉంటే ఈ నాలుగేళ్లలో ఈ సంఖ్య 22,380కి తగ్గింది. ఈ సంఖ్యను మరింత తగ్గించేలా అడుగులు వేస్తున్నాం. ఇంజనీరింగ్ చదువుతున్న పిల్లలు 2018–19లో 87 వేలు మంది ఉంటే.. 2022–23లో 1.25 లక్షలు మంది ఉన్నారు. దాదాపు 50 శాతం పెరుగుదల ఇక్కడే కనిపిస్తోంది.

ఉప్పొంగిన జన గోదావరి

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన విద్యా దీవెన సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థులు, తల్లిదండ్రులు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ప్రజలు పూలవర్షం కురిపించారు. సీఎం ప్రత్యేక బస్సులో ఆర్టీసీ బస్టాండ్, అక్కయ్యమ్మ కాలనీ, ఎన్టీఆర్‌క్రీడా మైదానం మీదుగా సత్యవతినగర్‌లో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. రెండు కిలోమీటర్లకు పైగా రోడ్‌షో సాగింది. ఇరువైపులా జనం జైజగన్ అంటూ పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు. సభా స్థలి వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించిన సీఎం.. విద్యార్థులు, వారి తల్లులతో కొద్దిసేపు మాట్లాడారు. వారితో కలిసి గ్రూపు ఫొటో తీయించుకున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి విద్యార్థులు, వారి తల్లులు, ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో చాలా మంది బయటే ఉండిపోయారు. 'ప్రతిభ మీది.. ఉన్నత విద్య బాధ్యత నాది.. నేను విన్నాను.. నేను ఉన్నాను' అని సీఎం అన్నప్పుడు విద్యార్థుల ఈలలు, కేకలతో సభా ప్రాంగణం హోరెత్తిపోయింది. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వరాల జల్లు కురిపించారు. హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి మేరకు డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి రూ.30 కోట్లతో పాటు 3 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, కొవ్వాడ కెనాల్ వద్ద కల్వర్ట్, మూడు మండలాల్లో మూడు అంబేడ్కర్ భవనాలు, ముస్లింలకు షాదీఖానా, ఎస్సీలకు కమ్యూనిటీ హాలు, కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి సీఎం హామీ ఇచ్చారు.

ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

- ఏపీని ఫోకస్డ్ స్టేట్‌గా పరిగణిస్తున్నాం
- భారత్‌లో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్ వెల్లడి
- సీఎం జగన్‌ను కలిసిన కుచ్లర్
- రాష్ట్రంలోని పెట్టుబడులకు గల అవకాశాలను వివరించిన సీఎం
- అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టీకరణ



సీఎం వైఎస్ జగన్‌తో మైకేలా కుచ్లర్

సాక్షి, అమరావతి: వివిధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని భారత్‌లో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్ చెప్పారు. బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలను, పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను సీఎం జగన్ వివరించారు. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎలాంటి సహకారం అవసరమైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మైకేలా కుచ్లర్ మాట్లాడుతూ.. మాన్యుఫాక్చరింగ్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, రెన్యువబుల్ ఎనర్జీ అండ్ సస్టెయినబిలిటీ, సస్టెయినబుల్ ప్రాక్టీసెస్, ఆటోమోటివ్ అండ్ ఇంజినీరింగ్, జాయింట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఐటీ అండ్ డిజిటలైజేషన్, స్టార్టప్ ఎకో సిస్టమ్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ తదితర రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏపీని ఫోకస్డ్ స్టేట్‌గా పరిగణిస్తున్నట్లు సీఎంకు తెలిపారు. ఈ సమావేశంలో సీఎం స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, జర్మనీ రాయబార కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పరవాడ ఫార్మాసిటీలో ఐటీ దాడులు

సాక్షి, విశాఖపట్నం: పరవాడ ఫార్మాసిటీలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఫార్మాసిటీలోని నాలుగు ఫార్మా కంపెనీలలో బుధవారం ఉదయం నుంచి ఐటీ శాఖ సోదాలు ప్రారంభించింది. నాలుగు కంపెనీలపై 15 బృందాలతో విశాఖలోని 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. డీ3 ప్రైమ్ ప్రైవేట్ లిమిటెడ్, శోధన లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-2లోనూ, హైగ్రో కెమికల్స్ ఫార్మాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-3లోనూ, విజయశ్రీ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో సాయంత్రం వరకూ సోదాలు జరిగాయి. ఆయా సంస్థలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, ఆదాయపు పన్నుకు సంబంధించి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ సహా.. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఈ ఫార్మా కంపెనీల బ్రాంచ్‌లు, ప్రధాన కార్యాలయాల్లోనూ దాడులు జరిగినట్లు సమాచారం.

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీల్లో ఈడీ సోదాలు

కీలక ఆధారాలు సేకరణ

సాక్షి, అమరావతి: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దేశవ్యాప్తంగా 25 చోట్ల ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీల కార్యాలయాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. ఢిల్లీలో 25, గుజరాత్‌లో 7, మహారాష్ట్రలో 4, మధ్యప్రదేశ్‌లో 2 కంపెనీలతోపాటు ఏపీలోని ఓ కంపెనీలో సోదాలు నిర్వహించినట్టు ఈడీ తెలిపింది. విదేశాల్లో ఉంటూ భారత్‌లో ఏజెంట్ల ద్వారా చట్టవిరుద్ధంగా ఈ కంపెనీలు ఆన్‌లైన్ గేమింగ్‌ను నిర్వహిస్తున్నాయి. బెట్టింగులు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయి. వందల సంఖ్యలో కంపెనీలను ఏర్పాటు చేసి ఫెమా చట్టాన్ని ఉల్లంఘిస్తూ హవాలా మార్గంలో ఏటా రూ.4,000 కోట్లను అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నాయని ఈడీ కేసు నమోదు చేసింది. మారుపేర్లు, ఫేక్ ఆధార్ కార్డులు, పాన్‌కార్డులతో దందా నిర్వహిస్తున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఈ దందాలో కీలకంగా ఉన్న హవాలా ఆపరేటర్లు ఆశిష్ కక్కర్, నీరజ్ బేడీ, అర్జున్ అశ్విన్‌భాయ్ అధికారి, అభిజీత్ ఖోత్ తదితరుల కార్యాలయాలు, వారి అనుబంధ కంపెనీల కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి కీలక ఆధారాలను సేకరించింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ వెల్లడించింది.

ప్రభుత్వ జోక్యంతో పెరిగిన మొక్కజొన్న ధర

ధరలు తగ్గడంతో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ కింద కొనుగోలు

1,548 కేంద్రాల ద్వారా 24,871 మంది రైతులు నమోదు

- రూ. 65.14 కోట్ల విలువైన 33,199 టన్నుల పంట కొనుగోలు
- కనీస మద్దతు ధరకు కొనుగోలు..వారం రోజుల్లోనే చెల్లింపులు
- ప్రభుత్వ జోక్యంతో క్వింటాల్ రూ.2 వేలకు పెరిగిన ధర
- ఎమ్మెస్పీ కంటే తక్కువకు అమ్ముకోవద్దని రైతులకు సూచన



సాక్షి, అమరావతి: మార్కెట్‌లో పంటల ధరలు పతనమైన ప్రతిసారీ రైతన్నను ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తోంది. వ్యాపారులతో పోటీ పడి పంటలను కొంటూ ధరల పెరుగుదలకు కృషి చేస్తోంది. తాజాగా మొక్కజొన్న విషయంలోనూ ప్రభుత్వ చొరవ ఫలించింది. కనీస మద్దతు ధరకంటే తక్కువ పలికిన మొక్కజొన్న ధర ప్రభుత్వ జోక్యంతో తిరిగి రూ.2 వేలకు పైగా పలుకుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది..

గత మూడేళ్లుగా మంచి ధరలు పలికిన మొక్కజొన్న కొద్ది రోజుల క్రితం కనీస మద్దతు ధరకంటే తక్కువ ధర పలకడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద పంట కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. 20 రోజులు కూడా తిరక్కుండానే ధరలు పెరిగాయి. మొక్కజొన్న మద్దతు ధర క్వింటాలుకు రూ.1,962 కాగా, రెండు నెలల క్రితం వరకు రూ.2 వేలకు పైగా పలికింది. కొద్ది రోజుల క్రితం అనూహ్యంగా ధర తగ్గుతున్నట్లు ధరలను రోజూ సమీక్షించే సీఎం యాప్ ద్వారా గుర్తించారు. అకాల వర్షాలు, ఇతర కారణాలను బూచిగా చూపించి మొక్కజొన్నను కనీస మద్దతు ధరకంటే తక్కువకు కొంటున్నట్లు గుర్తించారు. దీంతో సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగింది. 66 వేల టన్నుల మొక్కజొన్నను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కనీస మద్దతు ధరకు కొనుగోలు ప్రారంభించింది. పంట అధికంగా సాగయ్యే గుంటూరు, ఎన్టీఆర్, అనంతపురం, తూర్పు గోదావరి, కృష్ణా, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, బాపట్ల, పల్నాడు, శ్రీ సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో 1,548 ఆర్బీకేల పరిధిలో ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 24,871 మంది రైతులు నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు 4,500 మంది రైతుల నుంచి రూ.65.14 కోట్ల విలువైన 33,199 టన్నుల మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు కొన్నారు. వారం రోజుల్లోనే చెల్లింపులు కూడా చేస్తున్నారు. ఇప్పటికే రూ.20.59 కోట్లు చెల్లించారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలవడంతో వ్యాపారులు సైతం ధర పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ప్రస్తుతం రూ.2 వేల వరకు చెల్లించి కళ్లాల వద్దే కొంటున్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మార్కెట్‌లో ధరలు నిలకడగా కొనసాగేంత వరకు ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ ప్రకటించింది.

ధర మరింత పెరిగే అవకాశం

ప్రభుత్వ జోక్యంతో మొక్కజొన్న ధర పెరుగుతోంది. వారం క్రితం వరకు క్వింటా రూ.1,750 కంటే తక్కువగా ఉండగా, ప్రస్తుతం రూ 2 వేల వరకు చెల్లించి మరీ కొంటున్నారు. ఇది మరింత పెరిగే అవకాశం కూడా ఉంది. రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దు. కనీస మద్దతు ధర దక్కని ఏ రైతు అయినా వారి పంటను ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చు.

– రాహుల్ పాండే, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

కల్పతరువు సీవోఈ నుంచి రెండో చాలెంజ్

సాక్షి, అమరావతి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్, ఆటోమేషన్ తదితర సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన నూతన ఆవిష్కరణలకు విశాఖ వేదికగా నిలుస్తోంది. ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కేంద్రం కల్పతరువు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. గతేడాది విశాఖ ఉక్కు పరిశ్రమ(ఆర్ఐఎన్ఎల్)లో అధిక ఉష్ణోగ్రత వద్ద మానవవనరుల వినియోగం లేకుండా ఆటోమేషన్ విధానంలో పనిచేయడం వంటి వాటికి సంబంధించిన ఆరు కీ లక సమస్యలకు కల్పతరువు సీవోఈ ఓపెన్ చాలెంజ్ ప్రోగ్రాం నిర్వహించింది. ఇందులో ఐదింటికి స్టార్టప్స్ నుంచి చక్కటి పరిష్కారాలు వచ్చాయని ఎస్‌టీపీఐ విశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ బాతా చెప్పారు. మరో 12 సమస్యలకు పరిష్కారాలను ఆహ్వానిస్తూ ఓపెన్ చాలెంజ్ ప్రో గ్రాం–2ను ప్రారంభించింది. ఇందులో ఆర్ఐఎన్ఎల్‌కు సంబంధించిన 11 సమస్యలతో పాటు ఇతర పరిశ్రమలకు ఉపయోగపడే నూతన సాంకేతిక ఆవిష్కరణలు ఉండే విధంగా చాలెంజ్‌ను ప్రకటించింది. జూన్ 10 వరకు గడువు ఇచ్చింది. ఈ పోటీకి దేశవ్యాప్తంగా ఉన్న స్టార్టప్స్‌ను ఆకర్షించే విధంగా ఈనెల 26న వెబినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన స్టార్టప్స్‌కు రూ.4 లక్షల సీడ్ ఫండింగ్ ఇస్తారు.

నష్టం రాకుండా.. కష్టం లేకుండా..



అంబేడ్కర్ కోనసీమ జిల్లా పలివెలకి చెందిన ఈ రైతు పేరు టి.శ్రీనివాస్. తన సోదరుడితో కలిసి 20 ఎకరాల్లో వరి పంట వేశారు. పదెకరాల్లో సాధారణ రకం.. మరో పదెకరాల్లో బొండాలు రకాలు ఊడ్చారు. సాధారణ ర కం ధాన్యం 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వ చ్చింది. రూ.4.08 లక్షల విలువైన ఆ ధాన్యాన్ని ఈ నెల 22న ఆర్బీకేలో విక్రయించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన తర్వాత రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నాడు. 'ఒకప్పుడు దళారి చెప్పిందే రేటు.. అతను కొనేదే ధాన్యం అన్నట్టు ఉండేది. ఏనాడూ పూర్తిగా మద్దతు ధర చూసేవాళ్లం కాదు. ఇప్పుడు పొలం దగ్గరకే వచ్చి ధాన్యం కొనే పరిస్థితిని ప్రభుత్వం కల్పించడంతో రైతుల కష్టం చాలా వరకు తగ్గిపోయింది'అని చెప్పాడు. బొండాలు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి ఉందని, ఆ ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధర కు కొనుగోలు చేస్తామని చెప్పడంతో మార్కెట్‌లో వ్యాపారులు ధర పెంచి కొంటున్నారని చెప్పాడు.

గింజ కూడా వదలడం లేదు



పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రుకి చెందిన ఈ రైతు పేరు చింతలపాటి బలరామ రాజు. ఆయనకు 8 ఎకరాలు సొంత పొలం ఉంది. మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకుని మొత్తం 23 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మొత్తం 2,280 బస్తాల (ఒక్కొక్క బస్తా 40 కేజీలు) ధాన్యాన్ని ఆర్బీకేలో విక్రయించగా.. వారం రోజుల్లోనే రూ. 18,60,480 నగదు ఆయన ఖాతాలో జమయ్యింది. 'మా గ్రామంలో ఒక్క గింజ కూడా వదలకుండా ధాన్యం కొంటున్నారు. అందుకు నేనే ఉదాహరణ. ఒకప్పుడు ధాన్యం అమ్మితే డబ్బులు కోసం ఆరేసి నెలలు ఎదురు చూడాల్సి వచ్చేది. వర్షాల సమయంలో అయితే ఆర్బీకే సిబ్బంది నుంచి వీఆర్వో, జిల్లాస్థాయి అధికారుల వరకూ గ్రామాల్లోనే ఉండి ధాన్యం కొన్నారు. రోజుకు 25 వాహనాల్లో ఊరిలో మొత్తం ధాన్యాన్ని తరలించేశారు. ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో నాకు మంచి దిగుబడి వచ్చింది' అని బలరామరాజు వివరించారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం చినమిల్లిపాడుకు చెందిన కౌలు రైతు చింతాడ కృష్ణ ఏప్రిల్ 24 నుంచి విడతల వారీగా 865 బస్తాల ధాన్యాన్ని ఆర్బీకే ద్వారా విక్రయించాడు. ఆర్బీకేలో ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీఓ) జనరేట్ అయిన తర్వాత లోడును మిల్లుకు తరలిస్తే తరుగు, ముక్క విరుగుడు పేరుతో మిల్లర్ సుమారు రూ.15 వేలు వసూలు చేశారు. దీంతో మే 4న ఆ రైతు పౌర సరఫరాల శాఖ 1967 టోల్‌ఫ్రీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేశాడు. అధికారులు మిల్లర్ అనధికారికంగా సొమ్ము వసూలు చేసిన విషయాన్ని ధ్రువీకరించి మే 9న ఆ మొత్తాన్ని వెనక్కి ఇప్పించి మిల్లుకు నోటీసులు జారీ చేశారు.

తిరుమల ఘాట్‌లో విద్యుత్ బస్సు బోల్తా

- ఆరుగురు భక్తులకు స్వల్పగాయాలు
- ప్రమాదంపై విచారణ కమిటీ ఏర్పాటు చేసిన ఆర్టీసీ



తిరుమల/సాక్షి, అమరావతి: తిరుమల ఘాట్‌రోడ్డులో ఇటీవల ప్రవేశపెట్టిన ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సు బుధవారం బోల్తాపడింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పిన బస్సు ఘాట్ రోడ్డు రక్షణ గోడను ఢీకొని లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. అలిపిరి డిపోకి చెందిన విద్యుత్ బస్సు తిరుమలలో భక్తులను ఎక్కించుకుని మొదటి ఘాట్‌రోడ్డు మీదుగా తిరుపతికి బయలుదేరింది. 28వ మలుపు మందు అదుపుతప్పి అతివేగంగా రక్షణ బ్యారికేడ్లను ఢీకొని లోయలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొని బోల్తా పడింది. అటుగా వెళుతున్న ఎస్పీఎఫ్ సిబ్బంది బస్సు ముందు అద్దాలను పగులకొట్టి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో తిరుపతిలోని టీటీడీ బర్డ్ ఆస్పత్రికి తరలించారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, డీఎ జానకిరామరెడ్డి, అలిపిరి ఏవీఎస్‌వో సురేష్ ప్రమాదస్థలాన్ని పరిశీలించి డ్రైవర్ రెడ్డప్పను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో స్టీరింగ్ లాక్ అయిందని, దీంతో హ్యాండ్ బ్రేకు ఉపయోగించానని, కొండవాలుగా ఉండడంతో వేగం అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగిందని డ్రైవర్ తెలిపారు.

తిరుమల ఇ-బస్ ప్రమాదంపై విచారణ కమిటీ..

తిరుమల– తిరుమల ఘాట్ రోడ్డులో విద్యుత్ బస్ (ఇ-బస్) ప్రమాదానికి గురికావడంపై విచారణకు ఆర్టీసీ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(ఆపరేషన్స్) కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (మెయింటినెన్స్), చిత్తూరు డీపీటీవో, ఇ-బస్సులను సరఫరా చేసిన ఈవై ట్రాన్స్ కంపెనీ ప్రతినిధి సభ్యులను నియమించింది. బస్సు ప్రమాదానికి కారణాలను గుర్తించి తగిన సిఫార్సులను ఈ కమిటీ చేస్తుంది.

తడుకు వద్ద రోడ్డు ప్రమాదం.. 30 మందికి గాయాలు

పుత్తూరు రూరల్: తిరుపతి జిల్లా పుత్తూరు మండలం తడుకు గ్రామం వద్ద బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఆగి ఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి పుత్తూరు డిపో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 30 మంది గాయపడ్డారు. సీటులో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎస్.హరిబాబును క్రేన్ సహాయంతో బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. తిరువళ్లూరు నుంచి తిరుపతి వెళ్తున్న భారతీ బస్సు తడుకు గ్రామం వద్ద ఆగింది. అదే సమయంలో తిరుత్తణి నుంచి తిరుమల వెళుతున్న ఆర్టీసీ బస్సు.. ఆగి ఉన్న బస్సును క్రాస్‌చేస్తూ ఢీకొట్టింది. దీంతో రెండు బస్సుల్లోని 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కొందరు వెళ్లిపోయారు. ఆర్టీసీ బస్సు కండక్టర్ జాఫర్, ప్రైవేటు బస్సు కండక్టర్ రాజేంద్ర, మరో నలుగురు ప్రయాణికులకు తలపై తీవ్ర గాయాలయ్యాయి.

అన్నదాతల్లో 'ధర'హాసం

గోదావరి జిల్లాల నుంచి సాక్షి ప్రతినిధి
వరదా ఎస్వీ కృష్ణకిరణ్



అంబేడ్కర్ కోనసీమ జిల్లా పలివెల గ్రామంలో ధాన్యం బస్తాలను లారీల్లో లోడ్ చేస్తున్న కూలీలు

రాష్ట్రంలో రబీ ధాన్యం కొనుగోళ్లు వెల్లువలా కొనసాగుతున్నాయి. అకాల వర్షాల సమయంలో కోసిన ధాన్యాన్ని.. కోసినట్టుగా ప్రభుత్వం కొనుగోలు చేసింది. తడిసిన, నూక ధాన్యాన్ని సైతం (బ్రోకెన్ రైస్) ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టాల ఊబి నుంచి రైతులను గట్టెక్కించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. తొలిసారిగా జయ రకం (బొండాలు) ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ప్రైవేట్ మార్కెట్‌లో ఆ పంటకు మంచి ధర పలుకుతోంది. బుధవారం సాయంత్రానికి రూ. 2,541.51 కోట్ల విలువైన 12.45 లక్షల టన్నుల ధాన్యాన్ని ఆర్బీకే ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో ధాన్యం విక్రయించిన 1.38 లక్షల మంది రైతులకు గాను 96 వేల మందికి రూ.1,673 కోట్లకు పైగా చెల్లింపులు పూర్తి చేసింది.

బాయిల్డ్ మిల్లులకు తరలింపు

వరి కోతలు ప్రారంభమైన దశలో అకాల వర్షాలు కురవడం.. ఆ తరువాత అధిక ఉష్ణోగ్రతలతో ధాన్యంలో ముక్క విరుగుడు సమస్య తలెత్తింది. దీనిని సాకుగా చూపించి రైతులను మిల్లర్లు మోసం చేయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మండలానికి ఒకటి చొప్పున.. ఏలూరు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో బ్రోకెన్స్ అధికంగా వస్తున్న ప్రాంతాల్లో మొబైల్ మిల్లులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతులు ముందుగానే శాంపిళ్లను మొబైల్ మి ల్లుల్లో మరాడించి.. అక్కడ ఇచ్చే రశీదు ఆధారంగా ధా న్యాన్ని విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించింది. ముక్క విరుగుడు ధాన్యాన్ని బాయిల్డ్ రకంగా పరిగణించి కొనుగోలు చేస్తూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. జయ రకం (బొండాలు) ధాన్యానికి కూడా ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుండటంతో మార్కెట్‌లో పోటీ పెరిగింది. ప్రైవేట్ వ్యాపారులు మంచి ధరకు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. జయ రకం ఎక్కువగా పండించిన ప్రాంతంలో కళ్లాల్లోకి వచ్చి మరీ బస్తా (75 కేజీలు) రూ.1,500 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఈ రకాన్ని తక్కువ పండించిన ప్రాంతాల్లో అయితే.. బస్తాకు రూ. 1,600–రూ.1,700 కూడా చెల్లిస్తున్నారు.

రూ.5 కోట్ల కార్పస్ ఫండ్

రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు వేగంగా మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం తొలిసారిగా ఉమ్మడి గోదావరి పరిధిలోని 5 జిల్లాలకు రూ.కోటి చొప్పున రూ.5 కోట్ల కార్పస్ ఫండ్‌ను ముందుగానే విడుదల చేసింది. ఫలితంగా ఆయా జిల్లాల్లో అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా వాహనాలు, కూలీలను ఏర్పాటు చేస్తూ రైతులకు భారాన్ని తగ్గిస్తున్నారు. ఒక వేళ రైతులే సొంతంగా ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే ఆ మొత్తాన్ని కూడా మద్దతు ధరతో కలిపి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.

ధాన్యం కొనుగోళ్లు ఇలా..

జిల్లా	లక్షల టన్నుల్లో
పశ్చిమ గోదావరి	5.61
ఏలూరు	2.06
తూర్పు గోదావరి	2.31
అంబేడ్కర్ కోనసీమ	1.21
కాకినాడ	0.56
కృష్ణా	0.17
ఎన్టీఆర్	0.14
బాపట్ల	0.24
నెల్లూరు	0.04
ప్రకాశం	0.03

మిగిలిన జిల్లాల్లో 419 టన్నులు సేకరించారు

వాస్తవ పరిస్థితి ఇదీ..

- పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు 90 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట ప్రాంతాల్లో ఇంకా కోతలు జరగాల్సి ఉందని పౌర సరఫరాల సంస్థ డీఎం శివరామ్ చెప్పారు.
- తూర్పు గోదావరి జిల్లాలో 4 లక్షల టన్నుల దిగుబడిలో సగానికి పైగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. బొండాలు రకం సాగు చేసిన రైతులు బయట మార్కెట్‌లోనే ఎక్కువగా విక్రయిస్తున్నారని పౌర సరఫరాల సంస్థ జిల్లా అధికారి కుమార్ తెలిపారు.
- కాకినాడ జిల్లాలో 10 శాతం విస్తీర్ణంలో కోతలు జరగాల్సి ఉందని పౌర సరఫరాల సంస్థ డీఎం పుష్పమణి చెప్పారు.
- ఏలూరు జిల్లాలో ధాన్యంలో ముక్క విరుగుడు సమస్య అధికంగా ఉంది. ఆ ధాన్యాన్ని కృష్ణా జిల్లాలోని బాయిల్డ్ మిల్లులకు తరలిస్తున్నట్టు పౌర సరఫరాల సంస్థ డీఎం భార్గవి చెప్పారు. చింతలపూడి, లింగపాలెం, చాట్రాయి, పోలవరం ప్రాంతాల్లో కోతలు ఆలస్యంగా జరుగుతున్నాయి.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోతలు ఆలస్యం కావడంతో ధాన్యం ఇంకా పొలాలు, కళ్లాల్లోనే ఉంది. ఇక్కడ పంటను వేగంగా కొనుగోలు చేసేందుకు వీలుగా దగ్గర మిల్లులకే ధాన్యం తరలించేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్టు పౌర సరఫరాల సంస్థ డీఎం సాగర్ తెలిపారు. మొత్తంగా అన్నిచోట్లా జూన్ రెండో వారంలోగా కొనుగోళ్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు

వర్షాల్లోనూ కొన్నారు



ఇటీవల కురిసిన వర్షాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన తీరు రైతుల్లో భరోసా నింపింది. అంత యుద్ధప్రాతిపదికన ఎక్కడి ధాన్యాన్ని అక్కడే ఆఫ్‌లైన్‌లో కొనేసి వెంటనే మిల్లులకు తరలించారు. నేను కూడా ఆ సమయంలో కొంత, వారం కిందట 582 బస్తాల (ఒక్కో బస్తా 40 కేజీలు) ధాన్యాన్ని విక్రయించాను. డబ్బులు కూడా చాలా వేగంగా ఖాతాల్లో జమ అవుతున్నాయి.

– సూర్య నారాయణరాజు, లొల్ల, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఎంతైనా కొంటాం



అకాల వర్షాల్లోనూ రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేశాం. ఇప్పటికీ చాలా జిల్లాల్లో ఇంకా కోతలు చేయాల్సి ఉంది. రైతులు తెచ్చిన ప్రతి గింజను కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

– వీరపాండియన్, ఎండీ, పౌర సరఫరాల సంస్థ

రైతులు నష్టపోకుండా చర్యలు



ధాన్యం సేకరణ పూర్తయ్యే వరకు ఈ ఫీడ్‌బ్యాక్ కొనసాగుతుంది. ఈ విధానం ద్వారా వ్యవస్థలో జవాబుదారీ పెంచడం, రైతులు నష్టపోకుండా కాపాడటమే ప్రధాన ఉద్దేశం. ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్‌ను ఆయా జిల్లాలకు పంపిస్తున్నాం. రైతులను ఇబ్బంది పెట్టినా, డబ్బులు వసూలు చేసినా మిల్లులను కస్టమ్ మిల్లింగ్ నుంచి తొలగిస్తున్నాం. జేసీలకు చెప్పి ఆ మొత్తాన్ని రైతులకు వెనక్కి ఇప్పిస్తున్నాం.

– హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌర సరఫరాల శాఖ

రైతుల్ని మోసగిస్తే అంతేసంగతులు

- ధాన్యం సేకరణపై అడుగడుగునా ఆరా తీస్తున్న ప్రభుత్వం
- ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ద్వారా నిత్యం 300 మంది రైతులకు ఫోన్
- మిల్లర్లు నగదు వసూలు చేశారని తెలిస్తే వెనక్కి ఇప్పిస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రైతుకు సంపూర్ణ మద్దతు ధర కల్పించాలన్న ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ చేపడుతోంది. ఈ విషయంలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపై నిత్యం ఫిర్యాదులు స్వీకరిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు స్వస్తి పలికేలా.. కొంతమంది మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట వేసేలా రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కూడా చేస్తోంది. పౌర సరఫరాల శాఖ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ద్వారా ప్రతిరోజూ ధాన్యం విక్రయించిన సుమారు 300 మంది రైతులకు ఫోన్లు చేసి వారి అభిప్రాయాలను నమోదు చేస్తోంది. గడచిన రెండు వారాలుగా తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఏలూరు, కోనసీమ అంబేడ్కర్ జిల్లాల్లో సుమారు 3 వేల మందికిపైగా రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. వాటిని సంబంధిత కలెక్టర్లు, జేసీలు, పౌర సరఫరాల సంస్థ డీఎంలకు పంపించి అప్రమత్తం చేస్తున్నారు. కాల్‌సెంటర్ నుంచి అందిన వివరాల ఆధారంగా అధికారులు విచారించి ఫిర్యాదు నిజమని తేలితే తప్పిదాలకు పాల్పడిన మిల్లర్లు, సిబ్బందిపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

అక్రమాలకు పాల్పడే మిల్లుల బ్లాక్ లిస్ట్

పశ్చిమ గోదావరి జిల్లాలో రైతులను ఇబ్బందులకు గురి చేసినందుకు పాలకొల్లు, తణుకు, పెనుగొండ, గణపవరం, ఇరగవరం, ఆకివీడు, తాడేపల్లిగూడెంలో సుమారు 10 మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. అలాగే, తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలంలో ఏకంగా 10, నిడదవోలులో రెండు, బిక్కవోలులో ఒక రైస్ మిల్లును సీఎంఆర్ నుంచి డీట్యాగ్ చేశారు. వీటితో పాటే సుమారు 60 మిల్లులకు నోటీసులు జారీ చేశారు. రైతుల నుంచి ఎంతైతే వసూలు చేశారో వాటిని తిరిగి వెనక్కి ఇప్పిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు.

గుర్తింపు కోసమే బొప్పరాజు ఉద్యమం

- ఆయన సంఘానికి బలమే లేదు
- సీఎం జగన్ ఉద్యోగుల సంక్షేమం కోసమే ఆలోచిస్తారు
- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి



సీఎస్ జవహర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వెంకట్రామిరెడ్డి, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు చేసే ఉద్యమం అతని గుర్తింపు కోసమే తప్ప ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కాదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకార్ల వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బొప్పరాజు సంఘానికి అసలు బలమే లేదని, చాలా తక్కువ మంది ఉద్యోగులు మాత్రమే ఆయన వెంట ఉన్నారని తెలిపారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం పలు రెవెన్యూ సంఘాలు ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్యలో చేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మూడు దశల ఉద్యమం అని చెబుతున్న బొప్పరాజు వచ్చే ఎన్నికల వరకు 10–15 దశలంటూ ఉద్యమిస్తూనే ఉంటారని విమర్శించారు. సీఎం జగన్ ఉద్యోగుల సంక్షేమం గురించి ఆలోచిస్తారు కానీ, ఉద్యోగ సంఘ నేతల గురించి ఆలోచించరని చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై బొప్పరాజు ఉద్యమించలేదని విమర్శించారు.

ప్రమోషన్లు వచ్చేలా చూస్తాం

రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసే వారికి ప్రమోషన్లు వచ్చేలా చూస్తామని వెంకట్రామిరెడ్డి చెప్పారు. రెవెన్యూ శాఖలో ఖాళీలు భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో చాలావరకు చెల్లించిందని తెలిపారు. రెవెన్యూ జేఏసీ అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ.. వెంకట్రామిరెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్యతో కలిసి పనిచేస్తామన్నారు. ఈ సంఘంతోనే ఉద్యోగులకు మేలు జరుగుతుందని చెప్పారు. సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిరంజీవిరావు మాట్లాడుతూ.. బొప్పరాజు నేతృత్వంలోని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్‌తో కలిసి గతంలో పని చేశామని, అప్పుడు తమను ఉపయోగించుకున్నారు తప్ప సర్వే ఉద్యోగులకు ఏమీ ఉపయోగపడలేదన్నారు. బొప్పరాజు వల్ల సర్వే ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ఏపీ రెవెన్యూ జేఏసీ, ఏపీ ప్రోగ్రెసివ్ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్, రెవెన్యూ టైపిస్ట్స్ అండ్ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్, ఏపీ వీఆర్ఏ అసోసియేషన్లు ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్యలో చేరాయి. ఇకపై సమాఖ్యతో కలిసి ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై పని చేస్తామని ఆ సంఘాలు ప్రకటించాయి. సమావేశం తర్వాత వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో ఆయా సంఘాల నేతలు సచివాలయంలో సీఎస్ జవహర్‌రెడ్డిని కలిశారు.

51,392 మంది పేదలకు 'పట్టా'భిషేకం రేపు

▶ మొదటి పేజీ తరువాయి

నెక్కల్లు, అనంతవరం గ్రామాల్లో 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం 1,402.58 ఎకరాల్లో ఒక్కొక్కరికి సెంటు చొప్పున 25 లేఅవుట్లలో 51,392 కుటుంబాలకు ప్లాట్లు సిద్ధం చేసింది. అమరావతి ప్రాంతం పెద్దలదని, అక్కడ పేదలకు చోటులేదని టీడీపీ నేతలు, మరి కొందరు రైతుల ముసుగులో అడ్డంకులు సృష్టించారు. కోర్టులకు కూడా వెళ్లారు. దేశంలోనే అతి ఖ రీదైన న్యాయవాదులను పెట్టుకుని వ్యాజ్యాలు వేశారు. సీఆర్డీ ఏ ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్లు ఇస్తే సామాజిక సమతౌల్యం దెబ్బతింటుందని చెప్పి కోర్టులను అడ్డుపెట్టుకుని చోటు లేకుండా చేయాలనుకున్నారు. ఎల్లో మీడియా ఎంత రాద్ధాంతం చేసినా ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని కోర్టులు కూడా సమర్థించాయి. దీంతో ఉద్యమం పేరుతో అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం వీటన్నింటినీ అధిగమించి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి సర్వం సిద్ధం చేసింది. సీఆర్డీఏ ప్రాంతంలో నిరుపేదలకు ఇస్తున్న 1402.58 ఎకరాల్లో ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించిన 751.93 ఎకరాల్లో 14 లేఅవుట్లను వేసి 27,532 మందికి ప్లా ట్లు కేటాయించారు. గుంటూరు జిల్లాకు కేటాయించిన 650.65 ఎకరాల్లో 11 లేఅవుట్లలో 23,860 ప్లాట్లు వేశారు. ఈ లేఅవుట్లలో 67,700 హద్దు రాళ్లు వేసి ప్లాట్లకు పొజిషన్ ఇచ్చారు. ఇళ్ల స్థలాల మార్కింగ్, నంబరింగ్ పూర్తి చేశారు. 76.28 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్లు నిర్మించారు. నిడమర్రు, మందడం, అనంతవరం, దొండపాడు, ఐనవోలు, పెనుమాక, తుళ్లూరు, నవులూరులో అన్ని వసతులతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా సీఎం జగన్ పంపిణీ చేయనున్నారు.

తక్కువ సమయంలోనే పూర్తి

సీఆర్డీఏ పరిధిలో 1402.58 ఎకరాల్లో 51,392 ప్లాట్లు సిద్ధం చేశాం. అన్ని ప్లాట్లకు నంబర్లు కేటాయించి మార్కింగ్ కూడా పూర్తిచేశాం. శుక్రవారం ఉదయం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తారు. అందుకోసం వెంకటాయపాలెంలో వేదికను సిద్ధం చేస్తున్నాం. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో తక్కువ సమయంలోనే అన్ని పనులు పూర్తి చేశాం. ఇక్కడి నుంచే టిడ్కో లబ్ధిదారులకు కూడా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తాం.

– వివేక్ యాదవ్, ఏపీసీఆర్డీఏ కమిషనర్

పేదలకు పట్టాలివ్వకుండా ఎన్నెన్నో కుట్రలు

సీఆర్డీయే పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాలివ్వకుండా టీడీపీ, కొందరు వ్యక్తులు రైతుల ముసుగులో అనేక కుట్రలు పన్నారు. రైతుల పేరుతో ఆ ప్రాంతంలో నిరసనలకు దిగారు. జగనన్న లే అవుట్లలో పనులు జరగకుండా అడ్డుకొన్నారు. కొందరు పెట్రోలు పోసుకొని ఆత్మహత్య చేసు కుంటామంటూ బెదిరించారు. పోలీసుల పైనా దాడులకు దిగారు. కొందరు హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు వెళ్లారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిందేనన్న కృత నిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. కోర్టుల్లోనూ సమర్థంగా వాదనలు వినిపించింది. కోర్టులు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించడంతో ఇప్పుడు సీఆర్డీఏ ప్రాంతంలో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. తొలుత పేదలకు ఇళ్ల స్థలాలే వద్దన్న బాబు అండ్ కో సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఆర్ 5 జోన్‌లో కాకుండా ఆర్–3 జోన్లో ఇస్తే ఇబ్బంది లేదని, సెంటు కాకుండా 5 సెంట్లు ఇవ్వాలంటూ మరో రాగం అం దుకున్నారు. సెంటు భూమి సమాధులు కట్టుకోవడానికి తప్ప ఎందుకూ పనికి రాదంటూ చంద్రబాబు పేదలను అవహేళన చేసేలా మాట్లాడారు. తాజాగా దళిత జేఏసీ పేరుతో జడ శ్రావణ్‌కుమార్ తదితరులు తుళ్లూరులో 144 సెక్షన్ అమల్లో ఉన్నా లెక్కచేయకుండా బుధవా రం అక్కడ అశాంతిని సృష్టించే ప్రయత్నం చేశా రు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డు కొనేందుకు దీక్ష పేరుతో ఆయన తుళ్లూరు దీక్షా శిబిరానికి దొడ్డిదారిలో చేరుకున్నారు. పోలీసులు ఆయన్ని అరెస్టు చేసి, విజయవాడకు తరలించారు.



“ చట్టాలు సాలెగూళ్ల లాంటివి. పెద్ద ఈగలు వాటి గుండా వెళ్లిపోతాయి. చిన్నవి దొరికిపోతాయి.

– హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 25 మే 2023

వరస తప్పిన ముఖ్యమైన లెక్క

దేశ జనన, మరణాల రిజిస్టర్‌ను ఓటర్ల జాబితాతో అనుసంధానించేలా త్వరలోనే పార్లమెంట్‌లో ఒక బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర సర్కార్ యోచిస్తోంది. దేశ పౌరులెవరికైనా సరే 18 ఏళ్ళు నిండగానే వారి పేరు ఓటర్ల జాబితాలో చేరిపోయేలా ఆ బిల్లుతో వీలు కల్పించాలని భావిస్తోంది. సోమవారం ఢిల్లీలో భారత జనగణన కమిషనర్ కార్యాలయ ప్రారంభోత్సవ వేళ కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా వెల్లడించిన ఈ సంగతి మారుతున్న కాలమాన పరిస్థితుల్లో మంచి ఆలోచనే. మరణించినవారి పేర్లను తక్షణం తొలగించడానికీ, ఓటుహక్కు వయసు రాగానే జాప్యం లేకుండా కొత్త ఓటర్లు జాబితాలో చేరడానికీ ఈ అనుసంధాన ప్రక్రియ ఉపకరిస్తుంది. అయితే, అదే సమయంలో పదేళ్ళకోసారి నిర్వహించాల్సిన కీలక జనగణనను ఈ దఫా ఎప్పుడు జరిపేదీ ప్రస్తావించకపోవడమే ఆశ్చర్యం.

నిజానికి, 1948 జనగణన చట్టం ప్రకారం ప్రభుత్వం ఈ ప్రక్రియను నిర్వహిస్తుంది. అలాగని ప్రతి పదేళ్ళకూ జనగణన చేయాలని చట్టమేమీ లేదు. ఎప్పుడు జనగణన చేయాలో, ఫలితాలెప్పుడు వెల్లడించాలో నిర్ణీత కాలవ్యవధి అందులో లేదు. అయితే, ఈ లెక్కల ప్రయోజనం అపారం. బ్రిటీష్ ఇండియాలో 1881లో వందల మంది శ్రమించి, 25 కోట్లకు పైగా జనాభా నుంచి జవాబులు సేకరించారు. అప్పటి నుంచి 130 ఏళ్ళ పాటు యుద్ధాలు సహా ఎన్ని సంక్షోభాలు వచ్చినా, మన పాలకులు ఒక క్రమం తప్పని యజ్ఞంగా ఈ జనగణన ప్రక్రియను సాగించారు. తీరా ఈసారి ఆ క్రమం తప్పింది. దేశంలో తాజా జనగణన 2021లో జరగాల్సి ఉంది. 2020 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ దాకా అందులో తొలి దశ జరపాలని భావించారు. కరోనాతో అది నిరవధిక వాయిదా పడింది. జనం లెక్కను ప్రోదిచేసి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక తదితర అంశాలతో ఒక సమాచార గనిగా, ప్రభుత్వ – ప్రజా కార్యాచరణకు కీలక సూచికగా ఉపకరించాల్సిన ఆ ప్రక్రియ ఈసారి అలా ఆలస్యమైంది.

జాప్యానికి కరోనాయే కారణమన్న ప్రభుత్వ వాదన తర్కానికి నిలవదు. అత్యధికులు కరోనా టీకాలు వేయించుకున్నా, 2022లో మూడో వేవ్ ముగిసి జనజీవనం కుదుటపడినా, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు సైతం సాగుతున్నా సరే... సర్కార్ ఎందుకనో ఇప్పటి దాకా మళ్ళీ జనగణన ఊసే ఎత్తలేదు. జిల్లాలు, తాలూకాలు, పోలీస్ స్టేషన్ల పాలనా సరిహద్దుల్ని స్తంభింపజేసే తుది గడువును ఈ జూన్ 30 వరకు కేంద్రం పొడిగించింది గనక లెక్కప్రకారం ఆ తర్వాత మూడు నెలలైతే కానీ జనగణన చేపట్టరాదు. అంటే, కనీసం ఈ సెప్టెంబర్ దాకా జనగణన లేనట్టే. ఇక, సాధారణంగా జనసంఖ్యను లెక్కించడం జనగణన చేసే ఏడాది ఫిబ్రవరిలో చేస్తారు. మార్చి 1కి ఇంత జనాభా అంటారు. కానీ, వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో 2024 చివర ఎప్పటికో కానీ ప్రక్రియే మొదలు కాకపోవచ్చు. పైకి మామూలు గానే అనిపించినా, ఈ ఆలస్యం విస్తృత పర్యవసానాలకు దారి తీస్తుంది. ఎందుకంటే, పుష్కరకాలం గడిచిపోయినా ఇప్పటికీ మన విధాన రూపకర్తలు పాత 2011 నాటి జనాభా లెక్కల ఆధారంగా సంక్షేమ పథకాల నుంచి సాయాల దాకా నిర్ణయాలు తీసుకోవాల్సి రావడం విచిత్రం, విషాదం.

అసలు కరోనాతో ఆలస్యమవడానికి ముందే ఈ 2021 జనగణన వివాదాస్పదమై కూర్చుంది. జనగణనతో పాటు జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)ను నవీకరించేలా జనాభా సర్వే చేపడతామంటూ ప్రభుత్వం తేనెతుట్టె కదిల్చింది. అప్పటికే, ముస్లిమ్‌లే లక్ష్యంగా వివాదాస్పద ‘పౌరసత్వ చట్టం–2019’ తెచ్చారంటూ, దేశవ్యాప్తంగా నెలల తరబడి నిరసనలు సాగాయి. ఆ చట్టానికి, ఇప్పుడు భారతీయులమని నిరూపించుకోవాల్సిన ఈ ‘ఎన్పీఆర్’ జత చేరిందని విమర్శలు రేగాయి. మరో పక్క ఇప్పటికే ప్రతిపక్షాల్లోని అనేక రాజకీయ పార్టీలు, ప్రాంతీయ నేతలు దేశంలో కులగణన సాగాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆ లెక్కలు కూడా తీస్తే తమ ఓటుబ్యాంకులో చీలికలు రావచ్చనీ, అది తమకు దెబ్బ కావచ్చనీ అధికార పార్టీ భయపడుతోంది. వివిధ వర్గాల నుంచి ప్రత్యేక కోటాలకు డిమాండ్లు తలెత్తుతాయని ఆందోళన చెందుతోంది. అయిన ఆలస్యం ఎలాగూ అయింది గనక వచ్చే ఎన్నికల్లో లెక్క తప్పకుండా ఉండాలంటే, ఈ లెక్కలు పక్కనపెట్టాలనుకుంటే ఆశ్చర్యమేమీ లేదు.

జనగణన అంటే కేవలం భౌగోళిక ప్రాంతాల్లో తలకాయలు లెక్కపెట్టడం కాదు. సమాజంలోని భిన్న వర్గాల ఆకాంక్షలకు పునాదిగా నిలిచే ప్రక్రియ. గ్రామీణ – పట్టణ జనాభా వాటా, వలసలు, మాతృభాష, ఆయుఃప్రమాణం, గృహవసతులు వగైరా అనేక గణాంకాలను అందించే సమాచార నిధి. ఆర్థిక జీవిత అంశాలపై దృష్టి పెట్టే అనేక సర్వేలకు మాతృకైన ‘జాతీయ శాంపిల్ సర్వే’, ఆరోగ్యం – సామాజిక స్థితిగతులపై ఇంటింటి సర్వే అయిన ‘జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే’ వగైరాలు శాంపిల్స్ తీసుకోవడానికి జనగణనే ఆధారం. ఇంతటి ముఖ్యమైన వ్యవహారంపై ఈ సుదీర్ఘ అనిశ్చితి సమంజసం కాదు. జనగణన ప్రక్రియ ఎప్పుడు జరిగినా – ఆధునికతనూ, ఎప్పటికప్పుడు లెక్కల్లో మార్పుల్ని పొందుపరుచుకొనే లక్షణాన్నీ సంతరించుకోవాలన్న ప్రభుత్వ యోచన ఆహ్వానించదగినదే. కాకపోతే ఎప్పుడో డిజిటల్ వేదికల్ని ఆశ్రయిస్తామనీ, వ్యక్తులు తమకు తామే ఎలక్ట్రానిక్‌గా సమాచారం పూర్తిచేసే హక్కు కల్పిస్తామనీ, అందులో సామాజిక – ఆర్థిక హోదాను లెక్కించే 35కు పైగా పరామితులు ఉంటాయనీ అంటూ... ఇప్పుడు అమితమైన జాప్యం చేయడం అర్థరహితం. అసలుకే మోసం. అయితే, జనగణన ఎప్పుడు చేస్తామో చెప్పకున్నా, ఎలా చేయాలనుకుంటున్నదీ పాలకుల నోట వినపడడమే ప్రస్తుతానికి దక్కిన సాంత్వన.

ఉక్రెయిన్ ఆత్మస్థయిర్యం పెరిగిందా?

విశ్లేషణ



కేపీ నాయర్

రష్యాతో యుద్ధం ప్రారంభమైనప్పుడు కనిపించినంత బలహీనంగా ఇప్పుడు ఉక్రెయిన్ లేదు. అజేయంగా కనిపిస్తూ రాత్రి పూట మీదపడే రష్యన్ ఆయుధాల నుంచి ఉక్రెయిన్ తనను తాను కాచుకుంటోంది. ఇది కీవ్‌లో వ్యక్తమవుతున్న కొత్త ఆత్మవిశ్వాసంలో కొంతభాగం మాత్రమే. రష్యాలోని తమ స్లీపర్ సెల్స్‌ను క్రియాశీలం చేయడంలో ఉక్రెయిన్ యంత్రాంగం సఫలీకృతం అయినట్లే కనిపిస్తోంది. క్రెమ్లిన్ ఆకాశం మీదుగా ప్రయోగించిన మానవ రహిత డ్రోన్స్ వాస్తవానికి ఉక్రెయిన్ పంచమాంగ దళం పేల్చినవే అయివుండవచ్చని వార్తలు! తూర్పు ఆసియా పర్యటనలో భాగంగా హిరోషిమాలో జెలెన్‌స్కీని కలవడానికి మోదీ అంగీకరించడం 15 నెలల యుద్ధం తర్వాత ఉక్రేనియన్ దౌత్యం పురోగమించిందనటానికి సాక్ష్యం.

మే 24 నాటికి రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలై 15 నెలలు. అవే శీర్షికలు, అవే చిత్రాలతో విసిగిపోయిన చాలామందికి యుద్ధ అలసట అకస్మాత్తుగా ముగిసిపోయినట్లుగా ఉంది. ఒకే రాత్రి రాజధాని కీవ్‌పై ప్రయోగించిన 30 రష్యన్ క్షిపణుల్లో 29 క్షిపణుల్ని తాము పేల్చివేసినట్లు ఉక్రెయిన్ చేసిన అద్భుత ప్రకటన కారణంగా ఈ అలసట ముగియలేదు. ఈ క్షిపణుల్లో అడ్డుకోడానికి ‘వీల్లేని’ కింజాల్ హైపర్‌సోనిక్ బాలిస్టిక్ ఆయుధాలు, ఇంకా భూమి, సముద్రం, గగనతలం నుంచి పేల్చిన అదేవిధమైన ఇతర ఆయుధాలు ఉన్నాయి. సముద్రంలోనూ, కీవ్ చరిత్రాత్మక సంప్రదాయ చర్చిల నేపథ్యంలో గగనమార్గాన తాము కూల్చిన క్షిపణుల వీడియోలను, కొన్ని ఫోటోలను ఉక్రెయిన్ ప్రదర్శించినప్పుడు ఆ ప్రకటనలను ప్రపంచం పాక్షికంగానైనా ఎత్తిపట్టింది.

యుద్ధం ప్రారంభం నుంచి తన ట్రేడ్ మార్క్ డ్రెస్‌గా మారిన రౌండ్ నెక్ కాలర్ లేని టీ షర్టును ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ వదిలిపెట్టినప్పుడు ఈ యుద్ధకాలపు అలసటకు కాస్త విరామం లభించింది. గత శుక్రవారం జెలెన్‌స్కీ సైనిక ఛాయలు కలిగిన పోలో షర్టు ధరించి జెద్దాలో దిగారు. ఇది కుట్టుపని విషయంలో స్వాగతించదగిన మార్పు. డ్రెస్ కోడ్ విషయంలో సంప్రదాయ సున్నితత్వాలకు రాయితీలాగా జెలెన్‌స్కీ ధరించిన పోలో షర్ట్ పొడవాటి చేతులను కలిగి తన అరచేతులు, తల, మొహం మినహా చర్మాన్ని పూర్తిగా కప్పి ఉంచింది. అరబ్ లీగ్ సదస్సుకు తగిన మర్యాదను జెలెన్‌స్కీ ప్రదర్శించారనే చెప్పాలి. గత సెప్టెంబర్‌లో ఐక్యరాజ్య సమితి 77వ సర్వసభ్య సమావేశంలో గుండ్రని నెక్ లైన్, ‘ప్లాకెట్ స్లీవ్’లతో కూడిన ముడతలు పడిన హెన్లీ షర్ట్ ధరించి ప్రసంగించి ప్రోటోకాల్, దౌత్యపరంగా చూపిన అమర్యాదకు ఇది భిన్నం.

రష్యన్ గగనతల దాడులను తోసిరాజనడం, రాజధాని కీవ్ వీధుల్లో మడత నలగని దుస్తులు ధరించిన ప్రపంచ దేశాల నేతల ముందు బాగా నలిగిన టీ షర్టులతో కనిపించడం అనేది జెలెన్‌స్కీ తనదైన ప్రకటన చేసే విధానం కావచ్చు. కానీ సంవత్సర కాలంగా ఒక పదవిలో ఉన్న అధ్యక్షుడి ఇటువంటి చేష్టలు విసుగు పుట్టించాయి. దేశాధ్యక్షుడు తన కండపుష్టిని అలా ప్రదర్శించడం ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్న ఉక్రెనియన్ల విశ్వాసాన్ని పెంపొందించవచ్చు లేదా పెంపొందించకపోవచ్చు. కానీ ప్రపంచ ప్రజలకు మాత్రం అది సరైన అభిరుచిగా తోచలేదు.

ఇటీవల సంభవించిన మార్పులు కాకతాళీయంగా జరిగినవి కాదు. నిదానంగానే కానీ కచ్చితంగా రష్యా నుండి వచ్చినదానికి ఉక్రెయిన్ తగినట్టుగా స్పందించడం ప్రారంభించింది. గత ఏడాది ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనప్పుడు రష్యాకు వ్యతిరేకంగా కనిపించినంత బలహీన స్థితిలో ఉక్రెయిన్ ఇప్పుడు కనిపించడం లేదు. ఇప్పటివరకు అజేయంగా కనిపిస్తూ రాత్రి పూట మీదపడే ఆయుధాల



నుంచి ఉక్రెయిన్ తనను తాను కాచుకుంటోంది. ఇది కీవ్‌లో వ్యక్తమవుతున్న కొత్త ఆత్మవిశ్వాసంలో కొంతభాగం మాత్రమే.

ఆ డ్రోన్లు రష్యా లోపలి నుండి పేల్చినవే!

రష్యాలో నిత్యం ఉనికిలో ఉండే తమ వేలాది ‘స్లీపర్ సెల్స్’ను క్రియాశీలం చేయడంలో జెలెన్‌స్కీ యంత్రాంగం సఫలీకృతం అయినట్లే కనిపిస్తోంది. విశ్వసనీయమైన గణాంకాల ప్రకారం రష్యాలో దాదాపు 60 లక్షలమంది ఉక్రెయిన్ జాతి ప్రజలు నివసిస్తున్నారు. సామీప్యత, ఇంకా రాజకీయాల వల్ల శతాబ్దాల పరస్పర ఏకీకరణ చరిత్ర మిగిల్చిన ఫలితం ఇది. ఇలాంటి పరిస్థితుల్లో తమ మాతృభూమి కోసం పంచమాంగ దళంగా పనిచేయడానికి రష్యాలోని వేలాది మంది ఉక్రెయిన్ వాసులు సంసిద్ధతతో ఉండటం కద్దు. ఈ నెల మొదట్లో క్రెమ్లిన్ ఆకాశం మీదుగా ప్రయోగించిన మానవ రహిత డ్రోన్స్ వాస్తవానికి రష్యాలోని ఉక్రెయిన్ పంచమాంగ దళం పేల్చినవే అయివుండవచ్చని వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్ భూభాగం నుంచి ఈ డ్రోన్స్‌ను ప్రయోగించి ఉంటే వాటిని రష్యా తప్పకుండా కనిపెట్టే అవకాశం ఉండేది. దేశం లోపలి నుంచి వీటిని పేల్చారు కాబట్టి వాటిని రష్యా కనుగొనలేకపోయిందని చెప్పాలి. రష్యాలో విద్రోహ చర్యలు, ఆస్తి విధ్వంసక చర్యలు పెరుగుతుండటం... రష్యా లోపలి ఉక్రెయిన్ స్లీపర్ సెల్స్ కార్యాచరణ విజయవంతమవుతోందని సూచిస్తోంది. ఈ పరిస్థితి భారత్‌లోకి పాకిస్తాన్ ఎగుమతి చేస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని పోలి ఉంది.

చిట్టచివరకు పాశ్చాత్య మిత్ర దేశాల నుంచి జెలెన్‌స్కీ అత్యాధునికమైన ఆయుధ సామగ్రిని అందుకుంటున్నారు కాబట్టి కూడా యుద్ధం ఉక్రెయిన్ వైపునకు తిరుగుతున్నట్లుంది. నాటో సైనిక దళాలు రహస్యంగా యాంటీ మిస్సైల్ బ్యాటరీస్ వంటి హైటెక్ రక్షణ సామగ్రిని నిర్వహిస్తున్నట్లుంది. రష్యా సైనిక లక్ష్యాలను అత్యంత నిర్దిష్టతతో కూల్చడం కూడా నాటో బలగాల జోక్యాన్ని ఎత్తి చూపుతుంది.

ఈ యుద్ధం తనకు అనుకూలంగా పరిణమిస్తున్నదానికి సరితూగేట్టుగా జెలెన్‌స్కీ ఆహార్యం కనబడుతోంది. హుడ్‌తో కూడిన ముదురు గోధుమ రంగు విండ్‌చీటర్‌లో జెలెన్‌స్కీ హిరోషిమాలో జరిగిన జీ–7 దేశాల సదస్సులో (మే 19–21) పాల్గొనడానికి వచ్చారు. అయితే ఇంకా టైతో కూడిన జాకెట్ ధరించలేదు. అంతకు రెండు రోజుల క్రితం పోలో షర్టులో ఆయన జెద్దాలో దిగినప్పుడు, ఆయన భార్య, ప్రథమ మహిళ ఒలెనా జెలెన్‌స్కా మందపాటి, పాక్షికంగా సైనిక శైలి ఆకుపచ్చ దుస్తులు ధరించి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో అత్యంత ప్రముఖ మీడియా కార్యక్రమంలో ప్రసంగించారు. ఆ డ్రెస్ ఆమె మెడ కింది భాగం నుంచి ఆమె మోకాళ్ల కిందివరకు పాకి ఉంది. ఆ తర్వాత సియోల్ మెట్రోపాలిటన్ ప్రభుత్వంతో ఒక సాంస్కృతిక మార్పిడి ఒప్పందంపై సంతకం చేసినప్పుడు మెరిసే తెల్ల షర్టు, దానికి వ్యత్యాసంగా నల్ల ప్యాంట్స్, దానికి తగినట్లుగా నడుముకు బెల్టు, ఏక ఆభరణంతో అత్యంత సొగసుగా ఆమె కనిపించారు. తమ దేశానికి ప్రాణాంతకం కాని సైనిక సహాయం మాత్రమే కావాలంటూ దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సక్ యోల్ వైపు వేలు చూపి మరీ ఆమె అడిగిన సమయంలో దక్షిణ కొరియా ప్రజలపై ఆమె గట్టి ముద్ర వేశారు.

జెలెన్‌స్కీ ఈ నెలలో యూరప్ వ్యాప్తంగా దౌత్య పర్యటనలకు వెళ్లారు. తాము మాత్రం స్వదేశంలోనే ఉంటూ తమ స్థాయి విదేశీ నాయకులను కీవ్‌లోనే కలవడం అనే ఉక్రేనియన్ నాయకుల మునుపటి విధానంలో ఆయన మార్పు తెచ్చారు. మే 1వ తేదీ నుంచి ఆయన ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, బ్రిటన్‌లలో పర్యటించారు. మే మధ్యలో ఆయన వాటికన్ సందర్శన అత్యంత భావోద్వేగపూరితమైనదిగా నిలిచింది.

భారత్ శాంతి ప్రణాళిక?

ప్రధాని నరేంద్ర మోదీ గత సంవత్సరం ఫిబ్రవరికి ముందు జెలెన్‌స్కీకి సమయం కేటాయించలేదు. ఉక్రెయిన్ ఒక అస్థిరమైన దేశంగా ఉండేది. భారత్‌కు దాంతో ఉపయోగం లేదు. పైగా ఉక్రెయిన్‌లోని వరుస ప్రభుత్వాలు భారత్‌పై ఉపయోగించేందుకు పాకిస్తాన్ కు ఆయుధాలను విక్రయించడానికి ప్రయత్నించాయి. అయితే, తన తూర్పు ఆసియా పర్యటనలో భాగంగా హిరోషిమాలో జెలెన్‌స్కీని కలవడానికి మోదీ అంగీకరించడం, 15 నెలల యుద్ధం తర్వాత ఉక్రేనియన్ దౌత్యం పురోగమించిందనటానికి గుర్తింపుగా నిలిచింది. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి తన విధానానికి ఎప్పటికప్పుడు చురుకైన సర్దుబాట్లు చేసుకోవాలని భారతదేశం గుర్తించింది. అయితే ఇదేమైనా భారత శాంతి ప్రణాళికలో భాగమా అని కొన్ని వర్గాలు అనుకుంటున్నాయి.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకులు
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

శభాష్ కశ్మీర్



యూపీఎస్సీ సివిల్ సర్వీసుల పరీక్షల్లో అర్హత పొందిన అందరికీ శుభాభినందనలు. ప్రత్యేకించి జమ్ము కశ్మీర్ అభ్యర్థులు మంచి ర్యాంకులు సాధించడం ఉత్సాహాన్ని ఇచ్చింది. వసీమ్ (7), ప్రసేన్‌జిత్ (11), నవీద్ ఎహసాన్ భట్ (84)– ఇలా జమ్ము కశ్మీర్ అభ్యర్థులు ఈ సంవత్సరం మంచి ఫలితాలు పొందారు.

– షా ఫజల్, ఐఏఎస్ అధికారి

తేదీ వెనుక...



నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని మే 28గా మోదీ నిర్ణయించడానికి కారణం అది వీర్ సావర్కర్ జయంతి. కాంగ్రెస్, ప్రతిపక్షాలు... మోదీ, సావర్కర్‌లను ఇద్దరినీ ద్వేషిస్తాయి. కాబట్టి ప్రారంభోత్సవానికి దూరంగా ఉండటానికి అవి రెండూ కారణాలు.

– సమీర్, బ్లాగర్

అర్థం కాదు



నీలి చిత్రాల నటి మియా ఖలీఫా ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ప్రసంగించిందని వార్త. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆక్స్‌ఫర్డ్‌లో చేర్పించడానికి ఎంతో కష్టపడతారు; కానీ వాళ్లకు లెక్చర్ ఇవ్వడానికి ఒక పోర్న్‌స్టార్ వస్తే ఎలా ఉంటుందో ఊహించండి! ఈ ప్రపంచం పిచ్చిది.

– బుష్రా షేక్, వ్యాఖ్యాత

అనుమానం



అంటే ఇప్పుడు ఈ పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించేవాళ్లు పార్లమెంట్ సమావేశాలకు కూడా హాజరు కారా?

– సుహేల్ సేత్, నటుడు

ఏం మోడల్?



చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సరైన ‘ద్రావిడ’ నమూనా. జట్టులో ఏ ఒక్కరూ తమిళం మాట్లాడలేరు. బయటివాళ్లు అందరూ జట్టు కోసం ఆడుతుంటే, ద్రావిడ ఫ్యాన్లు వాళ్లకు కేరింతలు కొడుతున్నారు.

– అరుణ్ కృష్ణన్, రచయిత

సాహిత్యకారుల ఉమ్మడి కుటుంబీకుడు

నివాళి



ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి

రాయలసీమ రైతు బిడ్డగా పుట్టి అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం చేసి మట్టివాసనలోని ఉన్నతత్వాన్ని గ్రహించారు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి. చిన్నతనం నుండి పల్లెపట్టున వ్యవసాయ క్షేత్రంలో సాగుపనులు చూస్తూ పేదసాదల బడుగు జీవన వెతల్లను తలకెక్కించుకున్నారు. వీరు బహుముఖ ప్రజ్ఞాశాలి. అభ్యుదయ భావ కథకులు, జనజీవన తెలుగుకు పట్టం కట్టిన ఉత్తమ పరిశోధకులు, భవిష్య నిర్దేశంతో విద్యార్థులను తీర్చిదిద్దిన గొప్ప అధ్యాపకులు, వాక్యాన్ని ఒడిసిపట్టి పత్రికల్లో వార్తలు రాయాలన్న పత్రికా భాషా యోచకులు.

పాఠ్యగ్రంథం అంటే సాదాసీదా మార్కుల కోసం చదివేది కాదు. సమాజ భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసేలా విద్యార్థుల మెదళ్లను పదునుపెట్టే సాధనంగా ఉండాలనే ఆకాంక్ష కలిగినవారు. అందుకే పాఠ్యగ్రంథ ప్రణాళికా సంస్థలైన ఎన్సీఈఆర్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠ్యప్రణాళికా సంస్థ, సార్వత్రిక విశ్వవిద్యాలయ పాఠ్య ప్రణాళికా సంఘం, విశ్వవిద్యాలయ బీఓఎస్‌లలో ఆచార్య కేతువిశ్వనాథరెడ్డి ఉన్నారంటే తప్పకుండా వాచక నిర్మాణంలో పెను మార్పులు జరిగేవి. సమాజంలోని ప్రతి ఒక్కరికి సంబంధించిన అంశాలతో వాచక నిర్మాణం జరగాలనీ, అది సామాజిక అభ్యుదయ కోణంలో ఉండాలనీ అనేవారు.



కేతు విశ్వనాథరెడ్డి

సమకాలీన కథా రచయితలను కాలూనిన ప్రదేశ ప్రాంత విశేషాలతో... అక్కడి ప్రజల వెతలతో రచనలుగా చేయాలని ఎప్పటికప్పుడు సమాయత్తపరిచేవారు. ఎందరో రచయితలు వీరి ఒరవడిని అందిపుచ్చుకుని ముందుకు సాగారు. వీరు రచించిన కథలు, నవలికలు ఆ కోణంలో ఉండడం వల్ల దశాబ్దాలు దాటినా అవి నేటికీ కొత్తదనాన్నే అందిస్తాయి.

పాత్రికేయ వృత్తి అంటే అబద్ధాలను నిజాలను చేసేది కాదనీ, వాస్తవికతే ప్రాధాన్యంగా ఆయా ప్రాంత పదజాలంతో వార్తను రాస్తే ఆ వార్త ఆ ప్రజల మధ్య జీవిస్తుందని చెప్పేవారు. అంతేకాదు వార్తా పత్రికల్లో వార్తకు సరిపడా పదాలు, వాక్యాల వాడకం విషయంలోనూ వారు స్పష్టంగా చెప్పేవారు. పత్రికల ద్వారానే మాండలికాలకు ప్రమాణ గౌరవం దక్కుతుందనే వారి ఆలోచన ఎందరో సంపాదకులకు స్ఫూర్తిదాయకం.

మాతృభాషను వివిధ రంగాల అవసరాలనూ అందిపుచ్చుకునేలా ఎదిగించాలనుకునే వారు. అంతేకాదు పరిపాలనలోని అన్ని శాఖల్లోనూ, న్యాయరంగంలోనూ ఆధునిక వచనం సులభ గ్రాహ్యంగా రచించాలని సూచించేవారు. చలం సాహిత్యంలోని ఆధునికత, మార్క్సిజం భావజాలం, గురజాడ సమాజ సంస్కరణ వాదం, గిడుగు వ్యావహారిక భాషావాదం, నార్ల వార్తా పత్రికాభ్యుదయం, ఫ్యూడల్ వ్యవస్థపై శ్రీశ్రీ తిరుగుబాటు ప్రభావం వారిలో కనిపిస్తూ ఉంటాయి. స్వాతంత్ర్యం అంటే ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యమంటే అందరి సమైక్యత అన్న ధోరణి వారి ప్రత్యేకత. అందరివాడుగా ఎందరెందరికో కుల మత వర్గ వైషమ్యాలు లేని పెద్దదిక్కు అయిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఇప్పుడు మన మధ్య నుండి దూరమైనప్పటికీ ఆయన సృజించిన సాహిత్యంతోను, సమసమాజ అభ్యున్నత రచనలతోను,విద్యావిషయక పరిశోధక వ్యాసాలతోను మనమధ్యే మరింతకాలం జీవించగల జీవశక్తి గల అజరామరుడు.

వ్యాసకర్త తెలుగు ఆచార్యులు, హైదరాబాదు విశ్వవిద్యాలయం । 99490 58611

ఈ ‘బేటీ’ల గోడు పట్టదా?

అభిప్రాయం



జి. అనురాధ

దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన మన మహిళా రెజ్లర్లు నేడు వీధిన పడ్డారు. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన తమ ఫెడరేషన్ అధ్యక్షునిపై చర్యలు తీసుకోవాలని దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తున్నారు. అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు.

భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పేర్కొంటూ ఏడుగురు మహిళా రెజ్లర్లు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 2023 జనవరిలో నిరవధిక దీక్షలు చేపట్టారు. వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ వంటివారు లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. బీజేపీకి చెందిన ఉత్తరప్రదేశ్ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ భూషణ్‌తో పాటు కొందరు కోచ్‌లు కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రాతపూర్వకంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేధింపులకు గురైన వారిలో ఒక మైనర్ బాలిక కూడా ఉంది. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఈ ఫిర్యాదును స్వీకరించేందుకు, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు పోలీసులు నిరాకరించారు. దీనితో న్యాయం చేయాలని ఏడుగురు బాధిత మహిళా రెజ్లర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. చివరికి సుప్రీంకోర్టు ఆదేశంతో పోలీసులు పిటిషన్ తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన అంశాన్ని చాలా తీవ్రమైన విషయంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

‘బేటీ పఢావో’ ‘బేటీ బచావో’ అంటూ నినాదాలిస్తున్న బీజేపీ పాలకులు ప్రఖ్యాత క్రీడాకారిణులకే లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించలేక పోతుంటే ఇక సాధారణ ఆడపిల్లలకు ఏం చేయగలుగుతారు?

మొట్టమొదటగా 2023 జనవరి 18న జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు నిరవధిక ధర్నాలు చేపట్టారు. వారికి మద్దతుగా అనేక మంది సీనియర్ రెజ్లర్లు, ఇతర క్రీడా విభాగాల మిత్రులు సంఘీభావంగా ఉద్యమంలోకి వచ్చారు. దీంతో పీటీ ఉష నేతృత్వంలోని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) జనవరి 23న ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేసి ఏడుగురు సభ్యులతో ఒక విచారణ కమిటీని నియమించింది. మేరీ



కోమ్ కన్వీనర్‌గా నియమించిన ఈ విచారణ కమిటీకి విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించడానికి ముందు నాలుగు వారాల గడువు ఇచ్చారు. ఆ తర్వాత మరో రెండు వారాలు కమిటీ సభ్యుల కోరిక మేరకు పొడిగించారు. ఈ కమిటీలో మేరీకోమ్, యోగేశ్వర్ దత్‌లు (రెజ్లింగ్); ఆర్చర్ డోలా బెనర్జీ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు సహదేవ్ యాదవ్, మాజీ షట్లర్ అలకానంద అశోక్, ఇద్దరు న్యాయ వాదులు సభ్యులుగా ఉన్నారు. కేంద్రం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ కమిటీ ఇచ్చే నివేదికను అనుసరించి చర్యలు తీసుకుంటుందనే నమ్మకంతో రెజ్లర్లు ఆందోళన విరమించారు. అయితే లైంగిక వేధింపులకు పాల్పడిన దోషులపై చర్యలు తీసుకోకుండా నివేదికను చెత్త బుట్టలో పడేసింది ప్రభుత్వం.

తప్పు చేసినవారిని శిక్షించకపోగా... ఫిర్యాదు చేసిన వారిపై మరింత ఒత్తిడి చేయడం, వేధించడం ప్రారంభించారు. కేంద్ర క్రీడల శాఖ లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను సమర్థిస్తూ, ఆయనపై ఆరోపణలు చేసిన మహిళా మల్లయోధులను తప్పుపడుతూ వ్యాఖ్యానాలు చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసినా లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై విచారణ జరిపి దోషులను అరెస్టు చేయలేదు. బ్రిజేష్ భూషణ్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పూనుకున్నాయనీ, తమకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధంగా లేవనీ... మహిళా మల్ల యోధులకు అర్థమయింది. ఈ స్థితిలో వారు న్యాయం కోసం మూడు నెలల తరువాత ఏప్రిల్ 11 నుండి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రెండవ దఫా నిరవధిక ధర్నాకు పూనుకున్నారు.

ఈ సందర్భంగా బ్రిజ్ భూషణ్‌పై చర్యలకు కేంద్రం ఎందుకు సిద్ధంగా లేదనే విషయంపై కొంత చర్చించాలి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఎంపీ అయిన బ్రిజ్‌భూషణ్ అత్యంత నమ్మకమైన కార్యకర్త. బాబ్రీమసీద్ కూల్చివేతలోనూ పాల్గొన్నవాడు. బీజేపీలో అత్యంత పలుకుబడి గల యోగికి నమ్మకమైన అనుచరుడుగా ఉన్నందునే ఆయనకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలూ కేంద్రం తీసుకోవడం లేదనే విమర్శ ఉంది.

ఇప్పుడు ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధులకు మద్దతు తెలపడం ద్వారా పాలకులకూ, లైంగిక వేధింపులకు పాల్పడే వారికీ దేశ ప్రజలు ఒక హెచ్చరిక చేయాలి.

వ్యాసకర్త ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు
మొబైల్: 99596 32366

ఋణ విముక్తి

ఇతరుల వద్ద తీసుకున్న ధనం, వస్తువులను ఋణంగా భావిస్తూ, తిరిగి వాటిని చెల్లించడంతో ఋణ విముక్తి కలుగుతుందని భావిస్తారు జనులు. కానీ గృహస్థులు తీర్చాల్సిన అయిదు ఋణాలను హిందూ ధర్మం వివరించింది. ఈశ్వరార్పణ బుద్ధితో ధర్మాన్ని, కర్తవ్యాన్ని ఆచరించడం ద్వారా ఋణ విముక్తులు కావచ్చని తెలిపింది.

దేవ ఋణం: బతుకునిచ్చే ప్రాణవాయువు, జనుల భారం మోస్తూ ఆహార ధాన్యాలనిచ్చే భూమి, దప్పికను తీర్చే జలం మొదలైన పంచభూతాలు మానవ జీవితానికి ఆధారాలు. ఎలాంటి ప్రతిఫలం ఆశించని ప్రత్యక్ష దైవాలైన పంచభూతాల పట్ల కృతజ్ఞతాభావంతో మెలుగుతూ భగవదారాధన చేసినప్పుడే వాటి ఋణం తీరుతుంది.

ఋషి ఋణం: సకల శాస్త్రాలకు, సంస్కృతికి మూలం ఋషులు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఋషుల ప్రతిరూపంగా భావించి సద్బుద్ధితో సేవిస్తూ, వారందించిన



శాస్త్రాలను అధ్యయనం చేస్తూ ఆచరించడం వల్ల ఋషి ఋణం తీరుతుంది.

పితృ ఋణం: జన్మకు కారకులైన తల్లిదండ్రుల ఋణం తప్పక తీర్చాల్సిందే. వారు జీవించినంతకాలం కష్టపెట్టకుండా ప్రేమగా చూసుకుంటూ, వారి తదనంతరం శ్రాద్ధ కర్మలు, పిండ ప్రదానాల వంటి కర్మలను విధిగా నిర్వర్తిస్తే పితృ ఋణం తీరుతుంది.

భూత ఋణం: ఎన్నో జీవుల సహకారం లేనిదే మానవ జీవనం సాధ్యం కాదు. అందుకే క్రిమి కీటకాల వంటి అల్ప జీవుల పట్ల కూడా దయ, జాలితో మెలగాలి. ప్రకృతిలో జీవించే సర్వ హక్కులు వాటికీ ఉన్నందున హింసించడం, చంపడం చేయ కూడదు. వాటి జీవనానికి సహకరించాలి. అప్పుడే భూత ఋణం తీరుతుంది.

అతిథి ఋణం: తిథి, వార, నక్షత్రాలు చూడకుండా వచ్చేవాడే అతిథి. ఇంటికి వచ్చే అతిథులను ప్రేమతో సేవించాలి. సేవా భాగ్యం కలిగించిన అతిథిని అభినందించాలి. ఆశ్రమ వాసులైన బ్రహ్మచారులను, వానప్రస్థులను, సన్యాసులను ఆదరించాలి. అలా అతిథి ఋణం తీరుతుంది.

ఈ ఐదు ఋణాలను తీర్చుకుంటూ, పెద్దల పట్ల బాధ్యతలను నెరవేరుస్తూ, సద్గురువులు ఉపదేశించిన బోధనలతో జీవితాన్ని సంస్కరించుకున్నప్పుడే మానవజన్మ ధన్యమవుతుంది.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.3.10 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పుష్యమి సా.4.22 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.46 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.20 నుండి 11.04 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.23.

క్లుప్తంగా...

వెలుగోడులో అరుదైన అడవి జంతువు


పామ్ సివిట్

వెలుగోడు: నంద్యాల జిల్లా వెలుగోడు పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ అరుదైన జంతువు స్థానికులకు కనిపించింది. చెట్టు కొమ్మపై వింతగా ఉండటంతో అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ రేంజ్ అధికారి ఎంఏ ఖాన్, సెక్షన్ ఆఫీసర్ శివనాగయ్య, బీట్ ఆఫీసర్ ఈరన్న ఘటనా స్థలానికి చేరుకొని ఆ జంతువును పట్టుకున్నారు. పిల్లి జాతికి చెందిన పామ్ సివిట్ జంతువుగా గుర్తించారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా ఈ జంతువు సంచరిస్తుందని పేర్కొన్నారు. ఈ జంతువును అడవిలో వదులుతామని తెలిపారు.

వేసవికి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. కాచిగూడ–తిరుపతి ప్రత్యేక రైలు (07061) ఈ నెల 25న రాత్రి 10 గంటలకు కాచిగూడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07062) ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. 2 మార్గాల్లో ఈ రైలు షాద్‌నగర్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. కాచిగూడ–కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు (07417) ఈ నెల 27న రాత్రి 8.45 గంటలకు కాచిగూడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07418) ఈ నెల 28న రాత్రి 9.55 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. 2 మార్గాల్లో ఈ రైలు కాజీపేట, వరంగల్లు, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది.

టీడీపీ, బీజేపీకి మధ్య జనసేన దళారీ

- సీపీఐ నేత నారాయణ

కడప వైఎస్సార్ సర్కిల్: టీడీపీ, బీజేపీకి మధ్య జనసేన పార్టీ దళారీగా వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. కడపలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ పని పైపోయిందన్నారు. తెలుగు ప్రజలకు మొదటి శత్రువు బీజేపీయేనని చెప్పారు. గతంలో నల్లధనం వెలికి తీసి పేద ప్రజల బ్యాంకు అకౌంట్‌లో వేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా వేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు డబ్బు లేకుండా దెబ్బతీసేందుకు రూ.2వేలు నోటును రద్దు చేశారని అభిప్రాయపడ్డారు. నేర చరిత్ర కలిగిన నాయకులందరూ బీజేపీలోనే ఉన్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను ప్రధాని మోదీ మోసం చేశారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే వస్తుంటే.. ఊర్లో ఎవరూ ఉండకూడదు

- గ్రామస్తులను బెదిరించి... భయాందోళనకు గురిచేసిన టీడీపీ నేతలు
- ఇళ్లకు తాళాలు వేసుకుని పోవాలని హుకుం జారీ


పేట అగ్రహారంలో ఓ ఇంటికి వేసిన తాళం

పూతలపట్టు: గ్రామానికి ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసి గ్రామంలో ఎవరూ ఉండకూడదని స్థానిక టీడీపీ నేతలు ప్రజలను భయాందోళనకు గురి చేసి ఇళ్లకు తాళాలు వేయించారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని పేట అగ్రహారం పంచాయతీలో జరిగింది. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బుధవారం పేట అగ్రహారం పంచాయతీలో పర్యటించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తుండటాన్ని స్థానిక టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. ప్రజలను ఎమ్మెల్యే కలవకుండా చేయాలని పంచాయతీలోని 5 గ్రామాల్లో ప్రజలంతా తాళాలు వేసుకుని వెళ్లిపోవాలని టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. తాళాలు వేసుకుని వెళ్లకుంటే అంతు చూస్తామని తీవ్రంగా భయపెట్టారు. దీంతో పల్లెల్లో ఒకటి రెండు ఇళ్లు మినహా మిగిలిన వారంతా భయపడి తాళాలు వేసుకుని పక్క గ్రామాలకు, పొలాల వద్దకు వెళ్లిపోయారు. పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే ఏం జరిగిందని అధికారులను ప్రశ్నించారు. ఎవరూ ఉండకూడదని టీడీపీ నాయకులు భయపెట్టడంతో జనం తాళాలు వేసుకుని వెళ్లారని అధికారులు చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే టీడీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేట అగ్రహారంలో 498 మంది లబ్ధిదారులకు రూ.2.15 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.

అట్టహాసంగా టిడ్కో గృహ ప్రవేశాలు

పొన్నూరులో 1,660.. కేసానుపల్లిలో 500

- పేదల సొంతింటి కల సాకారం
- మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్


గుంటూరు జిల్లా నిడుబ్రోలు ప్రాంతంలో టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవ శిలాఫలకం వద్ద మంత్రి సురేష్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కిలారి రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు)/నరసరావుపేట : పేదల సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ పరిధి నిడుబ్రోలు ప్రాంతంలో బుధవారం టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సుమారు 21 ఎకరాల్లో నిర్మించిన 2,368 టిడ్కో గృహాల్లో మొదటి విడతగా 1,660 గృహాలను మంత్రి ప్రారంభించారు. అలాగే పల్నాడు జిల్లా నరసరావుపేట కేసానుపల్లి పంచాయతీ పరిధిలో మొదటి దశలో భాగంగా నిర్మించిన 500 టిడ్కో గృహాలనూ మంత్రి ప్రారంభించారు. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా నిడుబ్రోలులో జరిగిన సభకు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అధ్యక్షత వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ పొన్నూరులో రూ.177 కోట్లతో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంతో ఇక్కడ సుమారు 12 నుంచి 15 వేల జనాభాతో జగనన్న టౌన్ షిప్‌గా అభివృద్ధి చెందుతోందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో చంద్రబాబు అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కిలారి రోశయ్య మాట్లాడుతూ పేదలకు లక్షల విలువ చేసే సొంతింటిని అందించిన సీఎం జగన్.. పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, మేనేజింగ్ డైరెక్టర్ చిత్తూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.115 కోట్లతో 1,504 గృహాల నిర్మాణం

పల్నాడు జిల్లా నరసరావుపేట కేసానుపల్లి పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో టిడ్కో గృహాల మీద ఏర్పాటు చేసిన సీఎం జగన్ కటౌట్‌కు మహిళలు పాలాభిషేకం చేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో రూ.115 కోట్లతో 1,504 గృహాల నిర్మాణం చేపట్టామని.. అందులో ఈ రోజు 500 గృహ ప్రవేశాలు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.14 కోట్లతో మౌలిక వసతులు కల్పించిందన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించడంతో పాటు గతంలో డిపాజిట్ చేసిన నగదులో రూ.25 వేలు తిరిగి చెల్లించనున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన బహుజన ఉద్యమం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు వెల్లడి



తాడికొండ: రూపుమార్చుకున్న అంటరానితనం, సామాజిక అసమానతలను ఎదుర్కొని బహుజన ఉద్యమం చరిత్ర సృష్టించిందని పలువురు బహుజన పరిరక్షణ సమితి నాయకులు, వక్తలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా 969వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా ఈ నెల 26న పట్టాల పండుగ జరగనున్న నేపథ్యంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు పాల్గొన్నారు. సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సూచించిన బహుజన రాజ్యాధికారం దిశగా తమ అడుగులు కదులుతున్నాయని అన్నారు. పేదల హక్కులను కులవాదులు బాబు అండ్‌కో అడ్డుకోవడాన్ని నిరసిస్తూ.. హక్కులు సాధించుకోవడమే లక్ష్యంగా 2020 మార్చి 9న ప్రారంభమైన బహుజన పరిరక్షణ సమితి ఉద్యమాన్ని సుదీర్ఘంగా కొనసాగించి విజయం సాధించామని తెలిపారు. పేదల కోసం కష్టనష్టాలను ఓర్చుకుని అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుజనులంతా రుణపడి ఉంటారని చెప్పారు. రాజధానిలో పేదలకు శాటిలైట్ సిటీ నిర్మాణం జరుగుతుండడంతో బాబుకు వెన్నులో వణుకు పుడుతుందన్నారు. వామపక్షాలు, పవన్ కళ్యాణ్, రాధాకృష్ణ, రామోజీ, టీవీ–5 నాయుడు, దళిత దళారులు బహుజన ద్రోహులని విమర్శించారు. వికలాంగుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, మల్లవరపు సుధారాణి, కారుమూరి పుష్పరాజ్, పల్లెబాబు, బొలిమేర శ్యామ్యూల్, బట్టు బాబు, వై రాజ్ కుమార్, ఐనవోలు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల రైతులకు న్యాయం

- టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్

జమ్మలమడుగు: టీడీపీ అధికారంలోకి వస్తే ముంపువాసులకు న్యాయం చేస్తామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి లోకేశ్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం సుద్దపల్లె – జంగాలపల్లె గ్రామాల మధ్య రాజోళి ప్రాజెక్టు, కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టుల ముంపునకు గురయ్యే ప్రాంతాల రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వస్తే ముంపునకు గురయ్యే గ్రామాల రైతులకు ఎకరాకు రూ.16 నుంచి రూ.17 లక్షల వరకు పరిహారం ఇప్పిస్తామన్నారు. కొండాపురం ముంపు గ్రామవాసులకు సైతం చంద్రబాబుతో మాట్లాడి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్యాన వన హబ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పోర్టు, హార్బర్‌తో అభివృద్ధి పరుగులు

మారనున్న శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు: మంత్రి ధర్మాన


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మూలపేట పోర్టు, బుడగట్లపాలెం హార్బర్ ఏర్పాటుతో శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మారనున్నాయని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వేరే దేశాల్లో పనిచేస్తున్న జిల్లా మత్స్యకారులు నేరుగా మూలపేటలో దిగే సదుపాయం వస్తుందని చెప్పారు. వలసలు తగ్గుతాయని, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు వస్తాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం బలరాంపురం పంచాయతీలో రూ.8.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని రేషన్‌కార్డుల వారీగా తెలిపే బ్రోచర్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి, గత టీడీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాలను ప్రజలు గమనించాలని కోరారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో లంచాలు తీసుకోవడం, నచ్చినవారికి పథకాలు అమలు చేయడం జరిగేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్లను నియమించామని, మీ గ్రామంలో నిబద్ధత కలిగిన యువత ఇంటికే వచ్చి పథకాలు అందజేస్తారని చెప్పారు. పైసా లంచం లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమాన్ని చేరువ చేస్తున్నామన్నారు. మత్స్యకారులకు మత్స్యకార భరోసాగా రూ.10 వేలు ఇస్తున్నట్టు తెలిపారు. బలరాంపురం నుంచి బీచ్ వరకు కోటి రూపాయలతో రోడ్డు నిర్మించామని, దీపావళి నుంచి ఈ గ్రామం వరకు గతుకులు లేని రోడ్డును వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వేసినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలంటే ఓటు ద్వారా మరోసారి ఈ ప్రభుత్వానికి మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీల ద్వారా మంచి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని చెప్పారు. కూర్మనాథపురం మంచినీటి సమస్యపై స్పందిస్తూ వెంటనే అంచనాలు తయారు చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

కామ మాంత్రికుడికి టీడీపీ నేతల పరామర్శ

- పార్టీ అండగా ఉంటుందని హామీ
- మహిళను వేధించిన వ్యక్తికి భరోసా ఇవ్వడంపై అవాక్కవుతున్న టీడీపీ శ్రేణులు





శ్రీకాళహస్తి సబ్‌జైల్లో కామ మాంత్రికుడు సుబ్బయ్యను కలిసి బయటకు వస్తున్న టీడీపీ నేతలు

రేణిగుంట(తిరుపతి జిల్లా): రేణిగుంట మండలం తారకరామానగర్‌లో క్షుద్రపూజల పేరుతో ఓ మహిళపై బలాత్కారానికి యత్నించిన కామ మాంత్రికుడు సుబ్బయ్యను బుధవారం టీడీపీ నేతలు తిరుపతి సబ్ జైల్లో పరామర్శించడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. టీడీపీ ఎస్టీ సెల్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడిగా ఉన్న సుబ్బయ్య శ్రీకాళహస్తి పట్టణం బహదూర్‌పేటలో భూత మాంత్రికుడి అవతారం ఎత్తి దాదాపు పదేళ్ల నుంచి మంత్రాలు, తాయత్తులు కడుతూ ప్రజల మూఢ విశ్వాసాలను సొమ్ముచేసుకునే వాడు. తాంత్రిక పూజల ముసుగులో అతని అకృత్యాలు నిత్యకృత్యమైనా.. ఎవ్వరూ అతనిని ఎదిరించేందుకు సాహసించలేదు. ఈ క్రమంలో ఈ నెల 14న రేణిగుంట మండలం తారకరామానగర్‌లో క్షుద్రపూజల నెపంతో ఓ మహిళను నగ్నంగా పూజలో కూర్చోవాలని బలవంతం చేసి ఆమె నిరాకరించడంతో బలాత్కారం చేశాడు. ఈ ఘటనతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సుబ్బయ్యను అరెస్ట్ చేసి కటకటాల వెనక్కు నెట్టారు. కాగా, సబ్ జైల్లో ఉన్న నిందితుడు సుబ్బయ్యను బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, టీడీపీ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతిబాబు, రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మనోహర్‌నాయక్, అమాస శివకుమార్‌లు కలిసి అరగంటకు పైగా అతనితో మంతనాలు జరిపారు. పార్టీ అధినాయకత్వం అండగా నిలుస్తుందని ఆయనకు భరోసా ఇచ్చారు. మహిళపై అకృత్యానికి పాల్పడి అరెస్టయిన సుబ్బయ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని టీడీపీ వర్గాలే భావించాయి. అయితే అనూహ్యంగా జైల్లో ఉన్న అతన్ని కలిసి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడంపై టీడీపీ శ్రేణులే నివ్వెరపోతున్నాయి. మరీ ముఖ్యంగా మహిళలు ఛీదరించుకుంటున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి బలహీనతలు సుబ్బయ్యకు బాగా తెలుసని, అవెక్కడ బయటపడతాయోనని పార్టీ వర్గాలు అతన్ని కాపాడే ప్రయత్నాలు చేస్తున్నాయని ప్రచారం సాగుతోంది.

చరిత్ర సృష్టించిన విశాఖ పోర్టు

- తూర్పు తీరంలో 2వ స్థానంలో నిలిచిన విశాఖ పోర్టు అథారిటీ
- 2022–23లో రికార్డు స్థాయిలో 73.73 మిలియన్ టన్నుల సరుకు రవాణా
- త్వరలో క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభానికి సిద్ధం





దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ పోర్టు అథారిటీ చరిత్ర సృష్టించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణాలో తన రికార్డును తానే తిరగరాసింది. మునుపెన్నడూ లేనివిధంగా 73.73 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసింది. 7 శాతం వృద్ధిని నమోదు చేసి తూర్పు తీరంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ దఫా స్టీమ్ కోల్, క్రూడ్ ఆయిల్, కుకింగ్ కోల్, ఎరువులు వంటి సరుకు రవాణాలో వృద్ధిని నమోదు చేసింది.

పోర్టులో ఆధునికీకరణ పనులు

భవిష్యత్‌లో విశాఖ పోర్టు మరింత ప్రగతి సాధించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఆధునికీకరణ వైపు పయనిస్తోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 2022–23 ఆర్థిక సంవత్సరంలో పోర్టు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయడంతో ప్రగతి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. 2022 డిసెంబర్ 31 నుంచి బేబీ కేప్(260 మీటర్ల పొడవు, 43 మీటర్ల వెడల్పు) వెస్సల్స్ ఇన్నర్ హార్బర్‌లోకి వచ్చే విధంగా ఆధునికీకరణ చేపట్టారు. రూ.151 కోట్ల ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. పోర్టును ల్యాండ్‌లార్డ్ పోర్టు చేయడంలో భాగంగా పీపీపీ పద్ధతిలో రూ.655 కోట్లు విలువైన ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో రెండు ప్రాజెక్టులు తుది దశలో ఉన్నాయి. స్టాక్ నిల్వ కేంద్రాల నుంచి కాలుష్యం వెదజల్లకుండా ఉండేందుకు రూ.120 కోట్లతో 15 లక్షల నిల్వ సామర్థ్యంతో కవర్డ్ స్టోరేజ్ యార్డుల నిర్మాణం చేపట్టారు. మరిన్ని ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి.

తుది దశలో క్రూయిజ్ టెర్మినల్

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా క్రూయిజ్ టెర్మినల్ పనులు జోరుగా సాగుతున్నాయి. 2,500 మంది పర్యాటకులు ఉండే క్రూయిజ్ వెస్సల్‌ను ఈ బెర్త్‌లో ఆపరేట్ చేసే విధంగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఈ క్రూయిజ్ టెర్మినల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో కార్యకలాపాలు

- 2022 ఫిబ్రవరి 25న ఈస్ట్ క్యూ–6 బెర్త్‌లో ఎంవీ దిస్పిన.కె నౌక నుంచి రికార్డు స్థాయిలో 20,050 టన్నుల క్రోమ్ ఓర్‌ను పోర్టులో దించింది.
- 2022 సెప్టెంబర్ 25న వెస్ట్ క్యూ–1 బెర్త్‌లో ఫెర్రో మాంగనీస్ స్లాగ్‌ను ఎంవీ ఎస్‌జే స్టార్ నౌక నుంచి పోర్టులో దించారు.
- 2022 అక్టోబర్ 16న ఈస్ట్ క్యూ7 బెర్త్ నుంచి హై కార్బన్ ఫెర్రో మాంగనీస్‌ను ఎంవీ ఆలమ్ సయాంగ్ నౌకలోకి ఎక్కించారు.
- 2022 అక్టోబర్ 17న వెస్ట్ క్యూ–1 బెర్త్‌లో 29,500 టన్నుల ఐరన్ ఓర్(పిల్లెట్స్)ను ఎంవీ విశ్వవిజేత నౌకలోకి లోడింగ్ చేశారు.
- 2022 డిసెంబర్ 1న వెస్ట్ క్యూ–3 బెర్త్‌లో 23,030 టన్నుల ఐరన్ ఓర్ ఆక్సైడ్‌ను ఎంవీ అగియా ఇరిని ఫోర్స్ నౌక నుంచి అన్‌లోడ్ చేశారు.
- 2022 డిసెంబర్ 23న వెస్ట్ క్యూ–6 బెర్త్‌లో 16,478 టన్నుల ఫ్లైయాష్‌ను ఎంవీ కింగ్ ఫిషర్ నౌకలోకి ఎక్కించారు.
- 2023 మార్చి 10న ఈస్ట్ క్యూ–6 బెర్త్ నుంచి 8,864 టన్నుల స్టీల్ బ్లూమ్స్‌ను ఎంవీ ఎంఎక్స్ డిక్సియామెన్ నౌకలోకి లోడ్ చేశారు.
- 2023 ఏప్రిల్ 26న వెస్ట్ క్యూ–2 బెర్త్‌లో 44,374 టన్నుల ఐరన్ ఓర్‌ను ఎంవీ జల కల్పతరు నౌకలోకి ఎక్కించారు.
- 2023 ఏప్రిల్ 29న ఈస్ట్ క్యూ–1 బెర్త్‌లో 36,177 టన్నుల పెట్రోలియం కోక్‌ను ఎంవీ అన్ చాంగ్ నౌక నుంచి దించారు.

ఆధునిక టెక్నాలజీతో తిరుమలలో పటిష్ట భద్రత

- హోంశాఖ ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా


ఆలయ పరిసర ప్రాంతాలను తనిఖీ చేస్తున్న హరీష్ కుమార్ గుప్తా

తిరుమల: ఆధునిక టెక్నాలజీ సాయంతో తిరుమలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు రాష్ట్ర హోం శాఖ ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా చెప్పారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1 వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో 2 రోజుల పాటు భద్రతాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. సీసీటీవీ కంట్రోల్ రూంలో కృత్రిమ మేధను ఎలా వినియోగించాలి, ఎలాంటి సాఫ్ట్‌వేర్‌లను వాడాలనే అంశాలపై అధ్యయనం చేస్తామన్నారు. యాంటీ డ్రోన్ టెక్నాలజీ, బాడీ స్కానర్స్ వినియోగంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ..భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపడానికి ఎస్పీ లేదా ఏఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 7 కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీల్లోని అధికారులు 15 రోజుల పాటు పరిశీలన జరిపి నివేదిక ఇస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత కమిటీలు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామన్నారు.

భద్రతాంశాల పరిశీలన..

అంతకుముందు శ్రీవారి ఆలయం, కొత్త పరకామణి భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1, కమాండ్ కంట్రోల్ రూం తదితర ప్రాంతాలను పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూంలో తిరుమలలో సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తించే విధానాన్ని పరిశీలించారు. తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ సీవీఎస్‌వో నరసింహ కిషోర్, ఇంటెలిజెన్స్ ఎస్పీ సుమిత్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఆక్టోపస్, బాంబుస్క్వాడ్, ఎస్పీఎఫ్, జిల్లా పోలీస్, అటవీ, అగ్నిమాపక, ఇతర విభాగాలకు చెందిన అధికారులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిశాఖకు మరో స్కోచ్ అవార్డు

- గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల తవ్వకానికి ఈ ఏడాది సిల్వర్ అవార్డు
- అమృత్ సరోవర్‌లో ఏడాదిలో 1,810 చెరువుల నిర్మాణం
- ఈ నెలాఖరుకు పూర్తికానున్న మరో 140 చెరువుల పనులు
- గత ఏడాది ఈ శాఖ పరిధిలో కార్యక్రమాలకు 6 స్కోచ్ అవార్డులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మరో స్కోచ్ అవార్డును సొంతం చేసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటిని పెద్ద ఎత్తున నిల్వచేసుకునే ప్రక్రియలో భాగంగా అమృత్ సరోవర్ కార్యక్రమం అమలుకుగాను 2023 సంవత్సరానికి స్కోచ్ సిల్వర్ అవార్డుకు రాష్ట్రం ఎంపికైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా ఒక్కో జిల్లాలో 75 వంతున రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మొత్తం 1,950 చెరువులను ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం ద్వారా నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 1,810 చెరువుల నిర్మాణం పూర్తయింది. ఈ నెలాఖరుకల్లా మిగిలిన 140 చెరువుల నిర్మాణం పూర్తవుతుందని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు వెల్లడించారు. స్కోచ్ సిల్వర్ అవార్డుకు రాష్ట్రం ఎంపికైన విషయాన్ని స్కోచ్ సంస్థ ప్రతినిధులు బుధవారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలకు గత ఏడాది గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో ఉండే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)తో పాటు వివిధ జిల్లాల డీఆర్‌డీఏలకు ఆరు స్కోచ్ అవార్డులు దక్కిన విషయం తెలిసిందే.

బ్యాంకును బురిడీ కొట్టించిన టీడీపీ నేత

- నకిలీ పత్రాలు, బోగస్ కంపెనీ పేరుతో రూ. 8 కోట్లకుపైగా రుణం
- ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఆస్తుల అమ్మకాలకు సిద్ధమైన ఎస్‌బీఐ
- ష్యూరిటీ పెట్టిన డాక్యుమెంట్లు ఫోర్జరీవి అని నిర్ధారణ
- టీడీపీ నేతపై బ్యాంకు అధికారుల ఫిర్యాదు.. ఆలస్యంగా వెలుగులోకి


చంద్రబాబుతో ప్రియాంక చౌదరి (ఫైల్)


లోకేష్‌తో ప్రియాంక చౌదరి (ఫైల్)


ప్రియాంక ఇంటి ముందు హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ సిబ్బంది (ఫైల్)

సాక్షి, తిరుపతి: ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో టీడీపీ నేత బ్యాంకును బురిడీ కొట్టించి రూ. 8 కోట్లకు పైగా రుణం తీసుకున్న ఘటన తిరుపతి జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. రామచంద్రాపురం మండలానికి చెందిన బీఎన్ రెడ్డి కుటుంబం దశాబ్దాలుగా టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయన కుమారుడు నవీన్‌రెడ్డి, కోడలు ప్రియాంకా చౌదరి కొంత కాలం క్రితం తిరుపతిలో స్థిరపడ్డారు. 2016, మే 28న నిర్వహించిన మహానాడులో చంద్రబాబు సమక్షంలో ప్రియాంక చౌదరి రూ.15 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ విషయాన్ని ఎల్లో మీడియా ద్వారా అప్పట్లో విపరీతంగా ప్రచారం చేసుకున్నారు. ఆ తర్వాత 2016 జూలై 8న తిరుపతి న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌బీఐ ఎస్ఎంఈ బ్రాంచ్‌లో ఓసారి రూ.4.90 కోట్లు రుణం తీసుకున్నారు. కొంతకాలం తర్వాత మరలా రూ. 3.5 కోట్లు రుణం తీసుకున్నారు.

9 ఎకరాలు తమదేనంటూ..

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం పీర్లగూడలో చిన్నశ్రీరాములు పేరుతో సర్వే నంబర్ 157, 159, 160లో ఉన్న 9 ఎకరాల భూమి, అలాగే కరీంనగర్ జిల్లాలో ఉన్న నారియా ఎంటర్‌ప్రైజెస్ గ్రానైట్ ఇండస్ట్రీ రికార్డులను ఎస్‌బీఐకు ష్యూరిటీగా సమర్పించి ఎస్‌బీఐ నుంచి రూ.4.90 కోట్లు రుణం తీసుకున్నారు. ప్రస్తుత తిరుపతి జిల్లా పుత్తూరు పాలమంగళంలోని సిరీనా రాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మరో రూ. 3.5 కోట్లను రుణంగా పొందారు. ఆ రుణం పొందిన వెంటనే బ్యాంకుకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నారియా ఎంటర్‌ప్రైజెస్‌ను అమ్మేశారు. ఆ తరువాత ఈఎంఐలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఎన్‌పీఏగా గుర్తించి ష్యూరిటీగా పెట్టిన ఆస్తుల అమ్మకానికి రంగంలోకి దిగారు. ఈ క్రమంలో పీర్లగూడలో ప్రియాంకా చౌదరి, నవీన్‌రెడ్డి పేరుతో ఎలాంటి భూములు లేవని, బ్యాంకుకు సమర్పించిన పత్రాలు ఫోర్జరీ డాక్యుమెంట్లని నిర్ధారించుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలతో గతేడాది అక్టోబర్ 3న తిరుపతి ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే రూ. 4.90 కోట్లకు సంబంధించిన కేసుకు సంబంధించి మాత్రమే బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేయడం అనుమానాలకు తావిస్తోందని, ఇది సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలకు అప్పగించాల్సిన కేసు అని బ్యాంకు సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు.

క్లుప్తంగా

పిచ్చి మోదీ: అధీర్

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై వివాదం

కోల్‌కతా: రూ.2,000 నోట్ల ఉపసంహరణను ఆక్షేపిస్తూ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి బుధవారం చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ''మోదీ పట్ల దేశ ప్రజలకు విముఖత పెరిగిపోతోంది. మోదీని పిచ్చి (పగ్లా) మోదీగా ప్రజలు భావిస్తున్నారు'' అన్నారు. వీటిపై బీజేపీ మండిపడింది. అధీర్ ఓ నేరగాడంటూ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ దుయ్యబట్టారు. తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలపై వివాదం చెలరేగడంతో, ప్రజల మనోభావాలను తాను బయట పెట్టానని అధీర్ అన్నారు.

మాకు మద్దతివ్వండి

ఉద్ధవ్ ఠాక్రేకు కేజ్రీవాల్ విజ్ఞప్తి



ముంబై: నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టుపై విశ్వాసం లేదని, అందుకే ఢిల్లీలో పాలనాధికారాలపై నియంత్రణ కోసం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఆయన బుధవారం ముంబైలో శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రేతో సమావేశమయ్యారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి మద్దతివ్వాలని ఠాక్రేను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్డినెన్స్‌పై రాజ్యసభలో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లును వ్యతిరేకిస్తామని ఉద్ధవ్ హామీ ఇచ్చారన్నారు. సభలో ఈ బిల్లు విఫలమైతే 2024లో బీజేపీ ఓటమి తథ్యమని చెప్పారు. తమ పోరాటం కేవలం ఢిల్లీ కోసం కాదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సమాఖ్య వ్యవస్థ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను ఓడించడానికి తాము చేతులు కలిపామని ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఈసారి బీజేపీని ఓడించకపోతే దేశంలో ఇక ప్రజాస్వామ్యం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఠాక్రే వర్గం శివసేనకు రాజ్యసభలో ముగ్గురు సభ్యులు ఉన్నారు. కేజ్రీవాల్ మంగళవారం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కలిసి, మద్దతు కోరిన సంగతి తెలిసిందే.

20 వేలమందిని బఖ్‌ముత్‌లో కోల్పోయాం

రష్యా ప్రైవేట్ ఆర్మీ చీఫ్ వెల్లడి

కీవ్: తూర్పు ఉక్రెయిన్‌లోని బఖ్‌ముత్ నగరంలో తమకు భారీ నష్టం వాటిల్లిందని రష్యా ప్రైవేట్ సైన్యమైన 'వాగ్నర్' చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ వెల్లడించారు. ఉక్రెయిన్ సేనలతో జరిగిన పోరాటంలో 20,000 మందికిపైగా సైనికులను కోల్పోయామని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. రష్యా ప్రభుత్వం ఖైదీలకు, వివిధ కేసుల్లో విచారణను ఎదుర్కొంటున్నవారికి కొంత శిక్షణ ఇచ్చి, ప్రైవేట్ సైన్యంగా మార్చి, ఉక్రెయిన్‌లో యుద్ధ రంగానికి పంపిస్తున్న సంగతి తెలిసిందే. బఖ్‌ముత్‌లో గత తొమ్మిది నెలలుగా సాగుతున్న హోరాహోరీ యుద్ధంలో ఉక్రెయిన్ జవాన్లు ఎంతమంది మరణించారన్నది తెలియరాలేదు. దీనిపై ఉక్రెయిన్ సైన్యం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. పది వేల మందికి పైగానే ఉక్రెయిన్ సైనికులు మరణించి ఉంటారని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పార్లమెంటు భవన ప్రారంభంపై రాజకీయ రగడ	మోదీ ప్రారంభించడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్న విపక్షాలు	రాష్ట్రపతికి అవమానంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉమ్మడి ప్రయత్నం	బీజేపీపై పోరుకు 'ప్రారంభం'గా మలచుకునే వ్యూహం	ప్రారంభించాల్సింది విధిగా రాష్ట్రపతేనా! ప్రధానైనా పర్లేదా!	గతానుభవాలు, సంప్రదాయాలు చెబుతున్నదేంటి..?

ప్రారంభ 'గౌరవం'పై.. పెను దుమారం

పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవంపై రాజకీయ రగడ తీవ్ర రూపు దాలుస్తోంది. కొత్త భవన ప్రారంభోత్సవం ఈ నెల 28న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనుండటం తెలిసిందే. అయితే కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యాంగాధిపతి, దేశాధిపతి, ప్రథమ పౌరుడైన రాష్ట్రపతిని కాదని ప్రధాని ఎలా ప్రారంభిస్తారంటూ ముక్త కంఠంతో ఆక్షేపిస్తున్నాయి. భవనాన్ని ప్రారంభించాల్సిందిగా మోదీని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆహ్వానించడంపై మండిపడుతున్నాయి. అంతేగాక వి.డి.సావర్కర్ వంటి హిందుత్వవాది జయంతి రోజునే ప్రారంభోత్సవం జరపనుండటాన్ని కూడా విపక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని ఒకే వర్గానికి పరిమితయ్యే రోజున చేయనుండటం తప్పనని వాదిస్తున్నాయి. దాంతో ఈ వివాదం అంతకంతకూ పెద్దదవుతోంది. చివరికి పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్‌తో సహా ఏకంగా 19 ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించే దాకా వెళ్లింది. 2024 లోక్‌సభ ఎన్నికలు అంతకంతకూ సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీపై నిర్ణాయకమైన సమైక్య పోరుకు పార్లమెంటు భవనం అంశంతోనే శ్రీకారం చుట్టే యోచనలో విపక్షాలున్నట్టు కనిపిస్తోంది. మొత్తమ్మీద జాతీయ రాజకీయాల్లో త్వరలో కీలక పరిణామాలు చోటుచేసుకునే వాతావరణం కనిపిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఏడాది ముందే ఎన్నికల వేడి రాజుకుంటోందనేందుకు దీన్ని స్పష్టమైన సూచికగా భావిస్తున్నారు.



ప్రతిపక్షాల అభ్యంతరాలేంటి..?

పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతే ప్రారంభించాలని ప్రతిపక్ష పార్టీలు వాదిస్తున్నాయి. అవేమంటున్నాయంటే...

- ఆర్టికల్ 79 ప్రకారం ఉభయ సభలైన లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి కలిస్తేనే పార్లమెంటు.
- సాధారణంగా అంతా రబ్బరు స్టాంపుగా పరిగణించే భారత రాష్ట్రపతి పదవికి రాజ్యాంగం అంతటి ప్రాధాన్యం కట్టబెట్టింది.
- ఉభయ సభలకు అధిపతి గనుక దేశ ప్రథమ పౌరుని హోదాలో కొత్త భవనాన్ని ప్రారంభించే హక్కు కచ్చితంగా రాష్ట్రపతిదే.
- ఎందుకంటే ప్రధాని పార్లమెంటులోని ఒక అంగమైన లోక్‌సభకు మాత్రమే నేతృత్వం వహిస్తారు.
- ఆ కోణం నుంచి చూస్తే రాజ్యాంగపరంగా కూడా పార్లమెంటు భవనాన్ని ప్రధాని ఆవిష్కరించడానికి వీల్లేదు.
- ఏటా పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించే అధికారం, సార్వత్రిక ఎన్నికల తర్వాత ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసే అధికారం ఆర్టికల్ 87 ప్రకారం రాష్ట్రపతిదే.
- పార్లమెంటు ఆమోదించే బిల్లులన్నీ ఆర్టికల్ 111 మేరకు రాష్ట్రపతి సంతకంతో మాత్రమే చట్ట రూపం దాలుస్తాయి.
- అలాంటప్పుడు రాష్ట్రపతిని ఉద్దేశపూర్వకంగా విస్మరించడం అధికార బీజేపీ అహంకారానికి, లెక్కలేనితనానికి తాజా నిదర్శనం.

గతానుభవాలు ఏం చెబుతున్నాయి?


ఇలాంటి విషయాల్లో నిర్దిష్టంగా ఇలా వ్యవహరించాలంటూ నియమ నిబంధనలేవీ లేవు. కాకపోతే గత ప్రధానులు తమ వ్యవహార శైలి ద్వారా వీటి విషయమై చక్కని సంప్రదాయాలను నెలకొల్పి ఉంచారన్నది విపక్షాలు చెబుతున్న మాట. వారిలో కేంద్రం బీజేపీ ప్రభుత్వానికి సారథ్యం వహించిన వాజ్‌పేయి కూడా ఉన్నారని గుర్తు చేస్తున్నాయి. ఆ సంప్రదాయాలను పాటించడం విజ్ఞత అనిపించుకుంటుందని అవి అభిప్రాయపడుతున్నాయి. విపక్షాలు ఏమంటున్నాయంటే...

నాడు 'గాంధీ' గిరి..

లోక్‌సభ సచివాలయమైన 'పార్లమెంట్ హౌస్ ఎస్టేట్' ప్రచురణల రికార్డుల ప్రకారం పార్లమెంటు అనుబంధ భవన నిర్మాణానికి 1970 ఆగస్టు 3న నాటి రాష్ట్రపతి వి.వి.గిరి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యాక భవనాన్ని 1975 అక్టోబర్ 24న నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారు. అంటే రెండు కార్యక్రమాలుగా ఇద్దరూ పంచుకున్నారు. అలా చూసినా పార్లమెంటు కొత్త భవన నిర్మాణానికి 2020 డిసెంబర్ 10న మోదీ భూమి పూజ చేశారు. కనుక ప్రారంభోత్సవం రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా జరగాలన్నది విపక్షాల వాదన.

వాజ్‌పేయిదీ అదే బాట...

2002లో వాజ్‌పేయి హయాంలో కొత్తగా నిర్మించిన పార్లమెంటు లైబ్రరీ భవనాన్ని నాటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ ప్రారంభించారు. లోక్‌సభ సచివాలయం సంప్రదాయాల ప్రకారం భవనాన్ని ప్రారంభించాల్సిందిగా రాష్ట్రపతినే స్పీకర్ ఆహ్వానించారు. ఇప్పుడు కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తూ పార్లమెంటు కొత్త భవనాన్ని రాష్ట్రపతే ప్రారంభించాలన్నది విపక్షాల డిమాండ్. ''2002లో కేంద్రంలో ఉన్నది మీ బీజేపీ ప్రభుత్వమే. వాజపేయి ప్రధాని హోదాలో రాష్ట్రపతి పదవికి అలాంటి గౌరవమిచ్చారు. కనీసం దీన్నుంచైనా మోదీ నేర్చుకోవాలి'' అని మోదీకి విపక్ష నేతలు హితవు పలుకుతున్నారు.



- సాక్షి, నేషనల్ డెస్క్

అలాంటి అవమానాలు వద్దు

రాష్ట్రపతి కేవలం దేశ ప్రథమ పౌరుడు మాత్రమే కాదు. ఆర్టికల్ 53 ప్రకారం త్రివిధ బలగాలకు సుప్రీం కమాండర్. మోదీ చేయబోతున్న పని అక్షరాలా అలాంటి దేశ అత్యున్నత పదవిని విస్మరించడం, కించపరచడమేనని విపక్షాలంటున్నాయి. రాష్ట్రపతిని ఇలా అవమానిస్తుంటే సహించేది లేదంటూ గట్టిగా హెచ్చరిస్తున్నాయి. రాష్ట్రపతినిలా న్యూనత పరచడం మోదీకి కొత్తేమీ కాదంటూ గత ఉదంతాలను గుర్తు చేస్తున్నాయి. ''2019 ఫిబ్రవరి 25న ఢిల్లీలో నేషనల్ వార్ మెమోరియల్‌ను ప్రధాని హోదాలో మోదీయే ప్రారంభించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కార్యక్రమానికి దూరం పెట్టి ఘోరంగా అవమానించారు. గణతంత్ర పరేడ్‌లో త్రివిధ బలగాల నుంచి రాష్ట్రపతే గౌరవ వందనం స్వీకరిస్తారు. యుద్ధంలో వీరమరణం పొందే సైనిక యోధులకు వీర చక్ర, అశోక చక్ర వంటి గౌరవ పురస్కారాలనూ ఆయనే ప్రదానం చేస్తారు. అలాంటిది యుద్ధ వీరుల జ్ఞాపకార్థం నిర్మించిన వార్ మెమోరియల్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతికి భాగస్వామ్యమే లేకుండా చేయడం అతి పెద్ద తప్పిదం. మోదీ లెక్కలేనితనానికి ఇది రుజువు'' అంటూ మండిపడుతున్నాయి. కనీసం ఇప్పుడైనా అలాంటి తప్పిదాన్ని పునరావృతం చేయొద్దని సూచిస్తున్నాయి.

కేంద్రం ఏమంటోంది..?

ఎటుపోయి ఎటొస్తుందోనని పార్లమెంటు భవనం ప్రారంభోత్సవ రగడపై ఇప్పటిదాకా నోరు మెదపని బీజేపీ నేతలు ఇప్పుడిక తప్పనిసరై ఒక్కోలా స్పందిస్తున్నారు. బహిష్కరణ నిర్ణయంపై విపక్షాలు పునరాలోచించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అనునయించే ధోరణిలో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రం, 'కార్యక్రమానికి అందరినీ ఆహ్వానించాం. రావడం, రాకపోవడమన్నది వారి విజ్ఞతకే వదిలేస్తాం' అంటూ కుండబద్దలు కొట్టడం విశేషం.

బంధాన్ని భంగపరిస్తే సహించం

- ఆస్ట్రేలియాలో ఆలయాలపై వేర్పాటువాదుల దాడులపై ప్రధాని మోదీ ఆగ్రహం
- భేటీ సందర్భంగా అల్బనీస్‌తో ద్వైపాక్షిక అంశాలపై విస్తృత చర్చ

సిడ్నీ: ఖలిస్తాన్ వేర్పాటువాద మూకలు ఆస్ట్రేలియాలో ఆలయాలపై దాడులకు తెగబడటాన్ని భారత ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఆస్ట్రేలియా, భారత్ బంధానికి భంగం కల్గించేలా జరుగుతున్న ఇలాంటి కుట్రలను సహించేది లేదని కరాఖండిగా చెప్పేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మోదీ ఆ దేశ ప్రధాని ఆంటోనీ అల్బనీస్‌తో విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆ తర్వాత అల్బనీస్ సమక్షంలోనే మీడియాతో మాట్లాడారు. 'భారత్, ఆస్ట్రేలియాల స్నేహపూర్వక సంబంధాలకు హాని తలపెట్టే ఎలాంటి శక్తులనైనా ఉపేక్షించేది లేదు. ఈ అంశంలో కఠినంగా వ్యవహరిస్తున్న అల్బనీస్‌కు నా కృతజ్ఞతలు. హిందూ ఆలయాలపై ఖలిస్తాన్ వేర్పాటువాదుల ఆగడాలను అణచేసేందుకు, ఖలిస్తాన్ మూకల కార్యకలాపాలపై ఇకమీదటా కఠిన చర్యలను కొనసాగిస్తానని అల్బనీస్ మరోసారి నాకు మాటిచ్చారు' అని మోదీ ప్రకటించారు.

టీ20 వేగంతో బంధం బలోపేతం

భారత్, ఆస్ట్రేలియా సత్సంబంధాల బలోపేతాన్ని క్రికెట్ పరిభాషలో మోదీ సరదాగా చమత్కరించారు. ''రెండు దేశాల మైత్రీ బంధం వేగంగా బలపడుతోంది. క్రికెట్‌కు వేగాన్ని తెచ్చిన టీ–20 మోడ్‌లోకి వచ్చేసింది. రెండేళ్లలో ఇక్కడికి రెండుసార్లు వచ్చా. ఏడాదిలో ఇది మా ఆరో భేటీ. ఇరుదేశాల బంధంలో పరిణతికి, సత్సంబంధాలకు ఇది నిదర్శనం. ఈసారి భారత్‌లో జరగబోయే క్రికెట్ ప్రపంచ కప్ పోటీలను వీక్షించేందుకు అల్బనీస్‌ను, ఆస్ట్రేలియాలోని క్రికెట్ వీరాభిమానులకు ఇదే నా ఆహ్వానం. ఇదే సమయంలో దీపావళి పర్వదిన వేడుకలు చూడొచ్చు. అల్బనీస్‌తో నిర్మాణాత్మక చర్చలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమున్నత శిఖరాలకు చేరుస్తాయి'' అన్నారు. ఆస్ట్రేలియాలోని పలు వ్యాపారసంస్థల సీఈవోలతో కూడా మోదీ మాట్లాడారు. పలు రంగాల్లో భారత్‌లో పెట్టుబడి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. భారత్‌లోని డిజిటల్ ఆర్థిక, నవకల్పనల వ్యవస్థను ఆస్ట్రేలియాలోని వ్యాపారాలతో అనుసంధానించాలని అల్బనీస్ ఆకాంక్షించారు.



త్రివర్ణ పతాక కాంతులున్న సిడ్నీ ఒపెరా హౌజ్ ముందు మోదీ, అల్బనీస్ అభివాదం

మేం రాం రాం

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నాం ● 19 విపక్ష పార్టీల ప్రకటన

- పార్లమెంటు ప్రజలది, పార్టీలన్నింటిదీ: వైఎస్సార్‌సీపీ
- రాజకీయాలకు అతీతమైన కార్యక్రమం: వైఎస్ జగన్
- ప్రజాస్వామిక స్ఫూర్తితో పాల్గొంటున్నట్టు వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవాన్ని బహిష్కరించాలని విపక్షాలు నిర్ణయించాయి. 28న జరగనున్న ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు 19 విపక్ష పార్టీలు ప్రకటించాయి. రాష్ట్రపతిని పూర్తిగా పక్కన పెడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కార్యక్రమం జరుపుతుండటానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించాయి. కేంద్రం చర్యను ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, జేడీ(యూ), ఆప్, ఎన్సీపీ, శివసేన (ఉద్ధవ్), సీపీఎం, సీపీఐ, ముస్లిం లీగ్, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్ (ఎం), ఆర్ఎస్పీ, వీసీకే, ఎండీఎంకే, ఆర్ఎల్డీ ఈ మేరకు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. కాగా, ప్రారంభోత్సవంలో పాల్గొంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. రాజసం ఉట్టిపడేలా సువిశాలమైన పార్లమెంటు నూతన భవనాన్ని జాతి కోసం నిర్మించినందుకు ప్రధాని మోదీకి అభినందనలంటూ ఆయన ట్వీట్ చేశారు. బిజూ జనతాదళ్, అకాలీదళ్ కూడా పాల్గొంటుండగా టీడీపీ, అన్నాడీఎంకే వైఖరి వెల్లడించలేదు. అవి కూడా పాల్గొనవచ్చని చెబుతున్నారు.

మాటవరసకైనా అడగరా?

శతాబ్దానికోసారి మాత్రమే జరిగే పార్లమెంటు భవనం వంటి నిర్మాణంపై మాటవరసకైనా ప్రజలతో, విపక్ష ఎంపీలతో కేంద్రం చర్చించలేదంటూ విపక్షాలు దుయ్యబట్టాయి. ''కొత్త భవన ప్రారంభోత్సవం చరిత్రాత్మక సందర్భం. విభేదాలు పక్కనబెట్టి అందులో పాల్గొనాలని భావించాం. కానీ ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తీరని హాని చేస్తోంది. రాష్ట్రపతిని కాదని భవనాన్ని మోదీ ప్రారంభించడం ఘోర అవమానం. ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి. పార్లమెంటులో రాష్ట్రపతి అంతర్భాగం. అయినా రాష్ట్రపతి లేకుండా పార్లమెంటు కొత్త భవనాన్ని ప్రారంభించేందుకు మోదీ సిద్ధమైపోయారు. ఈ అప్రతిష్ఠ చర్య రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘిస్తుంది. తొలి ఆదివాసీ మహిళ రాష్ట్రపతి అయ్యాక ప్రజల్లో వెల్లువెత్తిన సమ్మిళిత భావనను కేంద్రం చర్య అణచేస్తోంది. పార్లమెంటును తూతూ మంత్రంగా మార్చేసిన మోదీకి అప్రజాస్వామిక చర్యలు కొత్తేమీ కాదు'' అన్నాయి. విపక్షాలు పునరాలోచించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ సూచించారు. ''వారిది అనవసర రాద్ధాంతం. పార్లమెంటు అనుబంధ భవనాలను కాంగ్రెస్ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ ప్రారంభించారు'' అన్నారు.

ప్రజాస్వామ్యపు ఆలయం: వైఎస్ జగన్

పార్లమెంటును మన ప్రజాస్వామ్య ఆలయంగా వైఎస్ జగన్ అభివర్ణించారు. ''జాతి ఆత్మకు ప్రతీకైన పార్లమెంటు దేశ ప్రజలతో పాటు రాజకీయ పార్టీలన్నింటికీ చెందుతుంది. ఇలాంటి శుభకార్యాన్ని బహిష్కరించడం నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తి అనిపించుకోదు'' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. రాజకీయ విభేదాలన్నింటినీ పక్కన పెట్టి ఈ మంచి కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా అన్ని పార్టీలనూ కోరుతున్నట్టు చెప్పారు. నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తిని పాటిస్తూ తమ పార్టీ ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొంటుందని వెల్లడించారు.

అహంకారపు ఇటుకలతో కట్టేది కాదు: రాహుల్ ట్వీట్

''పార్లమెంటు భవన ప్రారంభోత్సవం రాష్ట్రపతి చేతుల మీదుగా జరగకపోవడం, ఆమెకు పిలుపే లేకపోవడం అత్యున్నత రాజ్యాంగ పదవిని అవమానించడమే. పార్లమెంటు రాజ్యాంగ విలువలపై నిర్మితమైన ప్రజాస్వామ్య ఆలయం. అహంకారపు ఇటుకలతో కట్టేది కాదు'' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హిందీలో ట్వీట్ చేశారు.



జార్ఖండ్‌లో అంతరించిపోతున్న గిరిజన తెగ బృందం బహూకరించిన టోపీ ధరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మనోహర్ జోషి పరిస్థితి ఆందోళనకరం



ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి ఆరోగ్య స్థితి ఆందోళనకరంగా మారింది. శివసేన సీనియర్ నేత అయిన జోషిని మెదడులో రక్తస్రావంతో రెండు రోజుల క్రితం హుటాహుటిన ముంబైలోని పీడీ హిందూజా ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన స్పృహలోలేరని, దాదాపు కోమాలో ఉన్నారని ఆయన కుమారుడు ఉన్మేశ్ సోమవారం చెప్పారు. '85 ఏళ్ల జోషి ఐసీయూలో ఉన్నా వెంటిలేటర్ సాయంలేకుండా సాధారణ శ్వాస తీసుకుంటున్నారు. ప్రస్తుత రక్తస్రావం పరిస్థితి అదుపులో ఉంది' అని ఆస్పత్రి ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఆయన భార్య రష్మీ ఆస్పత్రికి వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెల్సుకున్నారు. 1995లో బీజేపీతో పార్టీ సంకీర్ణం అయ్యాక మహారాష్ట్రలో శివసేన నుంచి తొలిసారిగా ముఖ్యమంత్రి పదవి పొందిన వ్యక్తి జోషియే. 1966లో శివసేన స్థాపించాక అప్పటినుంచీ జోషి అందులో సభ్యునిగా కొనసాగుతున్నారు. లోక్‌సభకు గతంలో స్పీకర్‌గా వ్యవహరించారు. ముంబై మేయర్‌గా సేవలందించారు. మహారాష్ట్ర శాసనసభలో విపక్షనేతగా కొనసాగారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు.

రాజదండం సాక్షిగా...

పార్లమెంటులో చోళుల సెంగోల్

అధికార మార్పిడికి ప్రతీక	బ్రిటిష్ వాళ్ల నుంచి నెహ్రూకు	ప్రస్తుతం అలహాబాద్ మ్యూజియంలో	సెంగోల్ నేపథ్యం వెల్లడించిన అమిత్ షా	స్పీకర్ స్థానం వద్ద ప్రతిష్టిస్తారని వెల్లడి

న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా చోళుల నాటి ఓ పురాతన ఆచారానికి తిరిగి ప్రాణప్రతిష్ఠ జరగనుంది. అధికార బదిలీకి ప్రతీకగా శతాబ్దాల తరబడి చోళ రాజులు తమ వారసుని చేతికందిస్తూ వచ్చిన రాజదండాన్ని లోక్‌సభలో ప్రతిష్ఠించనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరాలను సహచర మంత్రులు కిషన్‌రెడ్డి, అనురాగ్ ఠాకూర్‌లతో కలిసి బుధవారం ఆయన మీడియాకు వివరించారు. ''సెంగోల్‌గా పిలిచే ఆ దండం నీతీ నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ ధర్మబద్ధంగా పాలన సాగిస్తామని చెప్పేందుకు ప్రతీక. నాడైనా నేడైనా సెంగోల్ ప్రతిష్ఠాపన వెనక ఉద్దేశం సుస్పష్టం. అధికార మార్పిడంటే కేవలం కరచాలనమో, దస్తావేజులపై సంతకాలో కాదు. ఆ ప్రక్రియ దేశ సంస్కృతీ సంప్రదాయాలతో లోతుగా ముడిపడి ఉండాలి. అదే సమయంలో ఆధునిక అవసరాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. ప్రధాని మోదీ సుదూర ధర్మదృష్టికి పార్లమెంటు నూతన భవనం ప్రతీక. అందులో సెంగోల్ కొలువుదీరడం సబబుగా ఉంటుందని ఆయన భావించారు'' అని చెప్పారు. అలాగే పార్లమెంటు భవన నిర్మాణంలో పాలుపంచుకున్న శ్రమ యోగులైన 60 వేల మంది కార్మికులను కూడా ఈ సందర్భంగా మోదీ సన్మానిస్తారన్నారు.

ఆ అర్ధరాత్రి నెహ్రూ చేతికి...

''1947 ఆగస్టు 14న జరిగిన అధికార బదిలీ ప్రక్రియకు తమిళనాడు నుంచి అధీనం పూజారి, గాయకుడు (ఒడువర్)తో పాటు నాదస్వర కళాకారుడు రాజారత్నం పిళ్లైని ప్రత్యేకంగా రప్పించారు. వారు ఆచారం ప్రకారం నిర్వహించాల్సిన ప్రక్రియల నడుమ సెంగోల్‌ను తీసుకొచ్చారు. పూజారి దాన్ని లాంఛనంగా మౌంట్‌బాటెన్‌కు అందజేసిన అనంతరం పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. ఊరేగింపుగా నెహ్రూ నివాసానికి తీసుకెళ్లి ఆ సందర్భం కోసం ప్రత్యేకించిన గీతాలాపన నడుమ ఆయనకు అప్పగించారు. ఇదంతా ఆ రాత్రి వేళ చోటుచేసుకుంది. చరిత్ర పుటల్లో మరుగున పడిపోయిన ఎవరికీ పెద్దగా తెలియని ఈ వృత్తాంతంపై సమగ్రమైన పరిశోధనకు మోదీ ఆదేశించారు. ప్రజాస్వామ్య మందిరమైన పార్లమెంటులో సెంగోల్‌ను ప్రతిష్ఠించడం అత్యంత సబబుగా ఉంటుందని నిర్ణయించారు'' అని అమిత్ షా తెలిపారు. నాటి సెంగోల్ తయారీలో పాలుపంచుకున్న వుమ్మిడి యతిరాజులు (96), వుమ్మిడి సుధాకర్ (88) కూడా 28న ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనే అవకాశముంది. సెంగోల్‌ను ఇప్పటికే అలహాబాద్ మ్యూజియం నుంచి ఢిల్లీ తరలించారు.



కుమారస్వామి తంబిరన్ సమక్షంలో రాజదండంతో నెహ్రూ



ప్రత్యేకతలెన్నో..

- పలు ప్రత్యేకతలు సెంగోల్ సొంతం. దీన్ని తమిళంలో ఆనై అని పిలుస్తారు.
- సెంగోల్ అనే పదం తమిళ పదమైన సెమ్మై నుంచి వచ్చింది.
- సెమ్మై అంటే ధర్మమని అర్థం.
- చోళుల హయాంలో సెంగోల్‌ను వెండితో తయారు చేసి బంగారు పూత పూసేవారు.
- సెంగోల్‌లోని ప్రతి చిహ్నానికీ నిగూఢమైన అర్థముంది. ఒక్కోటీ ఒక్కదానికి ప్రతీక.
- ఉదాహరణకు సెంగోల్‌పై ఉండే నంది న్యాయానికి ప్రతీక.
- చోళుల కాలంలో 7వ శతాబ్దం నాటి తమిళ సాధువు, కవి తిరుజ్ఞాన సంబంధర్ రాసి స్వరపరిచిన ప్రత్యేక గీతాలాపన నడుమ సెంగోల్ ప్రక్రియ సాగేదట.

ప్రస్తుత సెంగోల్‌ది ఘనమైన నేపథ్యం

లోక్‌సభలో ప్రతిష్ఠించనున్న సెంగోల్‌కు ఘనమైన నేపథ్యముందని అమిత్ షా వివరించారు. ''బ్రిటిష్ వారినుంచి అధికార మార్పిడికి ప్రతీకగా చివరి గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటెన్ 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి తొలి ప్రధాని నెహ్రూకు సెంగోల్‌నే అందజేశారు. అధికార మార్పిడికి ప్రతీకగా ఎలాంటి ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుందని మౌంట్‌బాటెన్ ఆరా తీయడంతో దీనికి బీజం పడింది. నెహ్రూ కోరగా చోళుల కాలంలో రాజు తన వారసునికి అధికారాన్ని బదలాయించేందుకు అనుసరించిన సెంగోల్ ప్రక్రియను రాజాజీ సూచించారు. 500 ఏళ్ల నాటి 'తిరువావదుత్తురై అధీనం (మఠం)' అధిపతి ద్వారా చెన్నైలో వుమ్మిడి బంగారు చెట్టి అనే నగర వ్యాపారిని పురమాయించి సెంగోల్‌ను తయారు చేయించారు'' అని చెప్పారు.

లోయలోకి వాహనం పల్టీ...

ఏడుగురు కార్మికుల మృతి

జమ్మూ: విద్యుత్ ప్రాజెక్ట్‌లో పనిచేసే కార్మికులతో వెళ్తున్న వాహనం లోయలోకి పల్టీలు కొట్టడంతో ఏడుగురు మరణించిన ఘటన జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కిష్త్‌వార్ జిల్లాలోని దఛన్ సమీపంలోని దాంగ్‌దూరు విద్యుత్ ప్రాజెక్ట్ దగ్గర్లో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ప్రాజెక్ట్ సైట్ సమీపంలో ప్రమాదం జరగడంతో వందలాది మంది కార్మికులు ఘటనాస్థలికి చేరుకుని మృతుల కుటుంబాలకు కంపెనీనే నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు తక్షణ ఆర్థికసాయం అందించాలని నిరసనకు దిగారు. భారీ వర్షం పడుతుండటంతో డ్రైవర్‌కు సరిగా కనిపించకపోవడంతో కొండ మలుపులో వాహనం అదుపుతప్పింది. దీంతో కొండ నుంచి వందల మీటర్ల లోయలోకి వాహనం పల్టీకొట్టి పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో ఇద్దరు జార్ఖండ్ కార్మికులుసహా ఏడుగురు మరణించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సహా పలు పార్టీల నేతలు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

కొత్త పాస్‌పోర్టు కోసం ఎన్‌ఓసీ ఇవ్వండి: రాహుల్

న్యూఢిల్లీ: కొత్తగా సాధారణ పాస్‌పోర్టు పొందడానికి వీలుగా నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) జారీ చేయాలని కోరుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారంలోగా లిఖిత పూర్వకంగా స్పందించాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామిని ఢిల్లీ మెట్రోపాలిటన్ కోర్టు బుధవారం ఆదేశించింది. ఎంపీగా అనర్హత వేటు పడడంతో రాహుల్ గాంధీ తన డిప్లొమాటిక్ పాస్‌పోర్టుతోపాటు ఇతర ప్రయాణ అనుమతి పత్రాలను ఇప్పటికే సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో విదేశాలకు వెళ్లడానికి సాధారణ పాస్‌పోర్టు కావాలని, అందుకు ఎన్‌ఓసీ మంజూరు చేయాలని కోరుతూ రాహుల్ మంగళవారం ఢిల్లీ మెట్రోపాలిటన్ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ ఈ నెల 31 నుంచి పది రోజులపాటు అమెరికాలో పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
గురువారం | 25 | మే | 2023

గవర్నర్ పర్యటనలో నల్లజెండాల ప్రదర్శన –ఆరుగురి అరెస్టు

తిరువొత్తియూరు: మైలాడుదురైలో గవర్నర్‌కు నల్లజెండాలు చూపిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. సీర్గాలిలోని చట్టినాథర్ ఆలయ కుంభాభిషేకోత్సవం బుధవారం జరిగింది. ఇందులో పాల్గొనేందుకు తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్‌రవి మంగళవారం సాయంత్రం 4 గంటలకు కొల్లిడం సమీపంలోని అరసూర్ రౌండ్ ఠాణాకు వెళ్లారు. అనంతరం అక్కడికి వచ్చిన ఇండియన్ డెమొక్రెటిక్ యూత్ అసోసియేషన్ కార్యవర్గం ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు గవర్నర్ ఆర్ ఎన్ రవికి వ్యతిరేకంగా నల్లజెండాలను ప్రదర్శించి నినాదాలు చేశారు. దీంతో పోలీసులు నల్ల జెండా చూపిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే నిందితులు ఉపయోగించిన ద్విచక్రవాహనాలను కూడా సీజ్ చేశారు.

పెట్టుబడులకు స్వర్గధామం



ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

పెట్టుబడులకు తమిళనాడు స్వర్గధామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. దేశంలో ఏ మూలన ఉన్నా అందరం తమిళులమేనని, స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాసులు పెద్దసంఖ్యలో ముందుకు రావాలని సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు సీఎం స్టాలిన్ పిలుపు నిచ్చారు. తమిళనాడులో అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.



ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఒప్పందాలు చేసుకుంటున్న అధికారులు, సింగపూర్ సంస్థల ప్రతినిధులు

- ‘తమిళనాడు’కు రండి.. సకల సౌకర్యాలు కల్పిస్తాం
- సింగపూర్ పెట్టుబడిదారులకు సీఎం స్టాలిన్ పిలుపు
- అందరికీ అన్నీ.. అనే నినాదంతో ముందుకు సాగుతామని స్పష్టీకరణ

సాక్షి, చెన్నై: భారీస్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన సింగపూర్‌లో పర్యటించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సభలు, సమావేశాలు, ఒప్పంద కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపారు. ఉదయాన్నే టెమాసెక్, సెంబ్‌కార్ప్, క్యాపిటాలాండ్ తదితర ప్రముఖ సింగపూర్ సంస్థలకు చెందిన సీఈవోలతో సమావేశమయ్యారు. ఇందులో టెమాసెక్ సీఈఓ దిల్హాన్ పిళ్లై చంద్రశేఖర్, సెంబ్‌కార్ప్ సీఈఓ కిమ్, క్యాపిటా ల్యాండ్ సంజీవ్ దాస్ గుప్తాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తమిళనాడులో విండ్ టర్బైన్‌ల ఉత్పత్తి, కొత్త ఆఫ్ షోర్ విండ్ ఫామ్‌ల బలోపేతం, వివిధ కొత్త టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు, సింగపూర్ సైన్స్ పార్క్ వంటి వివిధ పరిశోధనలు తదితర అంశాలలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పించే రాయితీలు, సౌకర్యాలను సీఎం స్టాలిన్ వారికి వివరించారు. ఈ సమావేశంలో సీఎంతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజ, సీఎస్ ఇరై అన్బు, వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి ఎస్. కృష్ణన్, సింగపూర్‌లోని భారత రాయబారి పెరియస్వామి కుమరన్ పాల్గొన్నారు.

సింగపూర్ మంత్రితో భేటీ

సింగపూర్ రవాణా, వాణిజ్య శాఖ మంత్రి ఎస్. ఈశ్వరన్‌తో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. తమిళనాడులో పెట్టుబడులు పెట్టేందుకు, వ్యాపారాలు ప్రారంభించేందుకు అనుకూలమైన పరిస్థితులను సీఎం వివరించారు. 2024 జనవరిలో జరిగే పెట్టుబడిదారుల మహానాడుకు హాజరు కావాలని ఆహ్వానించారు. ఆర్థిక, వాణిజ్యసంబంధాల మెరుగే లక్ష్యంగా, కొత్త పారిశ్రామిక పెట్టుబడులు, తదితర అంశాల గురించి చర్చించారు. అనంతరం సింగపూరులోని తమిళ విద్యార్థులతో సమావేశమయ్యారు. తమిళ సాహిత్యంపై జరిగిన పోటీలలో 10 మందిని ఎంపిక చేసి సర్టిఫికెట్లను సీఎం అందజేశారు.

నేడు జపాన్‌కు..

గురువారం సింగపూర్ పర్యటనను ముగించుకునే సీఎం స్టాలిన్ ఆ తర్వాత జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. ఇదిలా ఉండగా తమిళనాడులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ఉత్సాహాన్ని చూపిస్తున్నాయని, ఇది ఎంతో ఆనందకర విషయం అని సీఎం స్టాలిన్ తన ట్విట్టర్ పేజీలో పేర్కొన్నారు. అందరినీ ఆహ్వానిస్తున్నామని, ఎక్కువ సంఖ్యలో పెట్టుబడుల మహానాడుకు సింగపూర్ నుంచి సంస్థలు వచ్చేఅవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. కాగా, సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనపై అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి పళనిస్వామి విమర్శలు గుప్పించారు. ఆయన పర్యటన విహారం కోసమేనని, దోచుకున్నది దాచుకునేందుకే అన్న ఆరోపణలు చేశారు. దీనిని ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు ఖండించారు. తాము నోరు విప్పితే ఆయనకు నిద్ర కూడా పట్టదని ఎద్దేవా చేశారు.

ఆరు ఒప్పందాలు..

తొలి రోజు పర్యటనలో భాగంగా తమిళనాడు ప్రభుత్వం సింగపూర్‌లోని సంస్థలతో ఆరు ఒప్పందాలు కుదుర్చుకుంది. సీఎం ఎంకే స్టాలిన్ సమక్షంలో ఈ ఒప్పందాలపై ఆయా సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు. తమిళనాడు కెరీర్ గైడెన్స్ ఇన్‌స్టిట్యూట్ – సింగపూర్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మధ్య పరిశోధన, ఆవిష్కరణ, విశ్వ విద్యాలయాల సహకారం, తదితర అంశాలపై ఒప్పందాలు కుదిరాయి. అలాగే సింగపూర్ ఇండియా పార్ట్‌నర్ షిప్ ఆఫీస్–తమిళనాడు సిప్ కాట్ కార్పొరేషన్ మధ్య ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి సహకారం ఒప్పందం కూడా ఉంది. తమిళనాడు ప్రభుత్వం – సింగపూర్ హైపీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 312 కోట్లతో, 700 మందికి ఉపాధి కల్పించే విధంగా ఎల్రక్టానిక్ విడి భాగాల తయారీ ఒప్పందం కుదిరింది. అలాగే, సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, డిజైన్, తమిళనాడు స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌ల మధ్యవృత్తి శిక్షణ, తదితర అంశాలకు సంబంధించి ఒప్పందాలపై సంతకాలు చేశారు.


సింగపూర్‌లో వివిధ సంస్థల సీఈఓల సమావేశంలో సీఎం స్టాలిన్

ఎక్కడున్నా తమిళులమే..

సాయంత్రం సింగపూర్‌లో స్థిర పడ్డ ప్రవాస తమిళులు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న తమిళనాడుకు చెందిన వారితో జరిగిన సభలో సీఎం స్టాలిన్ ప్రసంగించారు. తమిళనాడు అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని గుర్తు చేశారు. ఎక్కడున్నా అందరం తమిళులమేనని, ద్రవిడ సిద్ధాంతాలే తమిళుల మనోభావాలకు ఆధారాలుగా ఉంటాయని వివరించారు. మలేషియా, సింగపూర్, శ్రీలంక వంటి దేశాలలోని తమిళులు రచయితలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందన్నారు. అలాగే ప్రవాస తమిళుల సంక్షేమాన్ని కాంక్షించే విధంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. తమిళనాడులో వనరులు పుష్కలంగా ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ నుంచి అత్యధిక శాతం మంది జనవరిలో జరిగే మహానాడుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అందరికీ అన్నీ నినాదంతో ద్రవిడ మోడల్ పాలన జరుగుతోందని గుర్తు చేస్తూ, తమిళనాడును భారత దేశంలోనే అన్ని రంగాలలో ముందంజలో నిలబెట్టడం లక్ష్యంగా సాగుతున్న తన పయనానికి బలాన్ని చేకూర్చే విధంగా తరలి రావాలని కోరారు.


సీఎంతో విద్యార్థులు

న్యూస్‌రీల్

చిత్ర పౌర్ణమి హుండీ ఆదాయం రూ. 2.16 కోట్లు


కానుకల లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వేలూరు : తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ హుండీలో రూ. 2.16 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ జాయింట్ కమిషనర్ లక్ష్మణన్ తెలిపారు. ఆలయంలో ప్రతి నెలా పౌర్ణమి అనంతరం హుండీలో భక్తులు చెల్లించిన ఆదాయాన్ని లెక్కించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈనెల చిత్ర పౌర్ణమి ఈనెల 4వ తేదీ రాత్రి నుంచి 5వ తేదీ వరకు సాగింది. దీంతో హుండీ ఆదాయాన్ని ఆలయ జేసీ లక్ష్మణన్ అధ్యక్షతన మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 9 గంటల వరకు లెక్కించారు. వీటిలో రూ. 2.16 కోట్లు నగదు, 165 గ్రాముల బంగారం, 2,213 గ్రాముల వెండి ఇతర దేశాలకు చెందిన కరెన్సీ నోట్లుతో పాటు ఆదాయం వచ్చినట్లు ఆలయ జేసీ తెలిపారు. ఈ ఆదాయాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. చిత్ర పౌర్ణమి రోజున గిరివలయం రోడ్డులోనూ అదనపు హుండీలు ఏర్పాటు చేయడంతో ఆదాయం పెరిగిందని తెలిపారు.

150 కిలోల సముద్రపు జలగలు స్వాధీనం



అన్నానగర్: మండపం ప్రాంతంలో బుధవారం ఉదయం సముద్రగర్భంలో గోనె సంచులలో దాచిన 150 కిలోల సముద్రపు జలగలను కోస్టల్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రామనాథపురం జిల్లా మండపం తోనకాడు సముద్ర ప్రాంతంలో మండపం కోస్టల్ పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ యాశర్మాలానా ఆధ్వర్యంలో సిబ్బంది బోటులో గస్తీ తిరుగుతున్నారు. ఆ సమయంలో నార్త్ సీ ప్రాంతంలో సముద్రంలో తాడుకు కట్టి ఉన్న 8 బస్తాలను గుర్తించి పరిశీలించారు. వీటిలోని 150 కిలోల సముద్రపు జలగలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయంలో అప్పగించారు. అనంతరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాల్లో విషాదం

- ఇద్దరు మృతి

సాక్షి, చెన్నై: ఆలయ ఉత్సవాల్లో విషాదం చోటు చేసుకుంది. బాణసంచా పేలుడులతో ఇద్దరు మరణించారు. అమ్మవారిని ఊరేగిస్తున్న వాహనం తీవ్రంగా దెబ్బతింది. మొరప్పూర్ సీ పల్లి పట్టిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. ధర్మపురి జిల్లా మోరప్పూర్ సీ పల్లి పట్టిలో మారియమ్మన్ ఆలయం ఉంది. ఇక్కడ ప్రత్యేక ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులతో ఓ జీపు తరహా వాహనంలో అమ్మవారిని అధిష్టింపజేసి, ప్రత్యేక అలంకరణలో ఊరేగించారు. ఇందులో బాణసంచా పెద్దఎత్తున కాల్చారు. విద్యుత్ లైటింగ్‌లు, భక్తి గీతాల సంగీత విభావరి వినుల విందుగా సాగింది. అయితే రాత్రి సమయంలో బాణసంచా పేల్చే క్రమంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆ జీపు వెనుక భాగంలో నిల్వ ఉంచిన టపాకాయలపై విద్యుత్ తీగ తెగిపడింది. దీంతో బాణసంచకు నిప్పంటుకుని పేలిపోయాయి. ఆందోళనతో భక్తులు పరుగులు తీశారు. విద్యుదాఘాతం, బాణసంచా మోతకు పలువురు గాయపడ్డారు. వీరిని ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ ప్రమాదంలో ఆ జీపు నడుపుతున్న డ్రైవర్ రాఘవేంద్రన్(25), ఆకాశ్(7) అనే బాలుడు మృతి చెందారు. దీంతో ఆ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం ఉదయాన్నే అధికారులు గ్రామానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు.

పులల్‌జైలులో హైకోర్టు న్యాయమూర్తుల తనిఖీ


ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తులు

కొరుక్కుపేట: మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) టి .రాజ, న్యాయమూర్తులు ఎం. సుందర్, జీకే ఇళంతిరాయన్, జి.చంద్రశేఖరన్ మంగళవారం చెన్నై పుళల్‌లోని సెంట్రల్ జైల్‌ను పరిశీలించారు. ఖైదీల కోసం నూతనంగా నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను ఏసీజే ప్రారంభించి, న్యాయమూర్తులతో కలసి జైలు ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ఖైదీల రూంలు, వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఎ. నజీర్ అహమ్మద్, జైలు శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అమరేష్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సీజేగా జస్టిస్ వైద్యనాథన్

- పదవీ విరమణ చేసిన జస్టిస్ రాజ

సాక్షి, చెన్నై: మద్రాసు హైకోర్టు ఇన్‌చార్జ్ సీజే రాజ బుధవారం పదవీ విరమణ పొందారు. ఆ స్థానంలో సీనియర్ న్యాయమూర్తి ఎస్ వైద్యానాథన్‌ను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సీజే మునీశ్వర్ నాథ్ బండారి పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి మద్రాసు హైకోర్టుకు పూర్తి స్థాయిలో సీజే నియమకం జరగలేదు. తొలుత సీనియర్ న్యాయమూర్తి దురైస్వామి నెల రోజుల పాటు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఆయన కూడా రిటైర్డ్ అయిన తరువాత ఆ బాధ్యతలను మరో సీనియర్ జడ్జి రాజ చేపట్టారు. గత ఆరేడు నెలలుగా ఇన్‌చార్జ్‌గా హైకోర్టు బాధ్యతలను రాజ నిర్వహిస్తూ వచ్చారు. ఆయన్ని రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించేందుకు ప్రయత్నాలు జరిగినా, చివరకు ఆయన మద్రాసు హైకోర్టుకే పరిమితమయ్యారు. బుధవారం ఆయన పదవీ విరమణ పొందారు. ఆయనకు వీడ్కోలు పలికే కార్యక్రమం హైకోర్టు ఆవరణలో కార్యక్రమం జరిగింది. న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులు, న్యాయవాద సంఘాల నేతలు, బార్ కౌన్సిల్ వర్గాలు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. అదే సమయంలో రాజ నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతలను ఎస్. వైద్యనాథన్‌కు అప్పగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా గురువారం నుంచి వైద్యనాథన్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. చెన్నైకు చెందిన వైద్యనాథన్ ఇక్కడే న్యాయవిద్యను పూర్తి చేశారు. 1986లో న్యాయవాద వృత్తి చేపట్టారు. 2015లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించి, ఆ తర్వాత పూర్తిస్థాయి న్యాయమూర్తిగా వ్యవహరిస్తూ వచ్చారు. తాజాగా ఇన్‌చార్జ్ సీజేగా నియమితులయ్యారు.


జస్టిస్ వైద్యనాథన్

సివిల్స్‌లో 42 మంది ఉత్తీర్ణత

- ప్రతిభ చాటిన 19 మంది ప్రభుత్వ శిక్షణ కేంద్రం అభ్యర్థులు
- 20 ఏళ్ల తరువాత వందలోపు ర్యాంకుల్లో తమిళులు లేని వైనం

సాక్షి, చెన్నై: సివిల్స్‌లో ఈ ఏడాది జాతీయ స్థాయిలోని వందలోపు ర్యాంకుల్లో తమిళనాడు అభ్యర్థులు ఎవరూ చోటు సంపాదించలేకపోయారు. గత 20 ఏళ్లుగా వందలోపు ర్యాంకులను ఎవరో ఒకరు సొంతం చేసుకుంటూ రాగా, ఈ సారి ఆ స్థాయిలో ఎవరూ ప్రతిభ చూపకపోవడం గమనార్హం. వివరాలు..ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర సర్వీసుల్లో పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్స్– 2022 తుది ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఇందులో తమిళనాడు నుంచి 42 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 19 మంది రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో నిర్వహిస్తున్న కేంద్రంలో శిక్షణ పొందిన అభ్యర్థులు ఉండడం విశేషం. వీరిలో 8 మంది మహిళ అభ్యర్థులు ఉన్నారు. అయితే, గత 20 ఏళ్లుగా ఏటా ఎవరో ఒకరు వంద లోపు ర్యాంకు సాధించిచేవారు. గత ఏడాది కోయంబత్తురుకు చెందిన స్వాతిశ్రీ 42వ ర్యాంకు సాధించారు. ఈ ఏడాది రాష్ట్రానికి వందలోపు ర్యాంకులు లేకపోవడం గమనార్హం. అయితే చెన్నై పెరంబూరుకు చెందిన జీజీ 107వ ర్యాంకును, తెన్‌కాశికి చెందిన రామకృష్ణస్వామి 117వ ర్యాంకుతో రాష్ట్ర స్థాయిలో తొలి రెండు స్థానాలను సొంతం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జగన్నాథన్ కుమార్తె క్షత్రియ కవిన్ 169వ ర్యాంకు, కార్మిక కమిషనర్ అతుల్ ఆనంద్ కుమార్తె ఈషా 290వ ర్యాంకు, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ కుమారుడు అరవింద్ 361 ర్యాంకును దక్కించుకున్నారు. కడలూరు జిల్లా బన్రూటికి చెందిన సుస్మిత తన చెల్లెలు ఐశ్వర్య బాటలో యూపీఎస్సీలో ఉత్తీర్ణత సాధించారు. 2020లో ఐశ్వర్య యూపీఎస్సీలో నెగ్గిన విషయం తెలిసిందే. అక్క చెల్లలు ఇద్దరు యూపీఎస్సీ పరీక్షలో రాణించడం ఆ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించిన జీజీతో పాటు ఇతర అభ్యర్థులను సీఎం స్టాలిన్ అభినందించారు. ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన వారికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం నుంచి ఉత్తీర్ణత శాతం మరింత పెరగాలని, ఆ దిశగా మరింత మెరుగైన శిక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం స్టాలిన్ బుధవారం ఓ ప్రకటనలో ఆదేశించారు.


జాతీయ స్థాయిలో 107వ ర్యాంక్ సాధించిన ఏఎస్ జీజీని అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

సాగరంలో షికారు!


కొత్త బోటు

త్రివేణి సంగమ క్షేత్రంలో సముద్ర విహారానికి పర్యాటక శాఖ పరిధిలోని పూంబుహార్ ప్రత్యేక విభాగం ఏర్పాట్లు చేసింది. కన్యాకుమారి తీరం నుంచి వట్టకోట్టై వరకు గంట పాటు సముద్రంలో షికారు చేసేందుకు పర్యాటకులకు అవకాశం కల్పించింది. ఇందుకోసం రెండు ప్రత్యేక బోట్లను అందుబాటులోకి తెచ్చింది. వీటిని మంత్రులు ఏవీ వేలు, మనో తంగరాజ్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు.

- కుమరి నుంచి వట్టకోట్టై మధ్య పడవ సవారీ
- ఆరు నాటికల్ మైళ్ల దూరం విహారానికి అనుమతి
- జెండా ఊపి బోట్లను ప్రారంభించిన మంత్రుల బృందం

సాక్షి,చెన్నై : బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం, అరేబియా సముద్ర తీరమైన త్రివేణి సంగమ క్షేత్రంగా కన్యాకుమారి బాసిల్లుతోంది. సూర్యోదయం.. సూర్యాస్తమయాన్ని తన్మయత్వంతో తిలకించేందుకు ప్రపంచంలోనే ఇది అత్యుత్తమ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు యాత్రికులు ఇక్కడికి భారీగా తరలి వస్తుంటారు. అలాగే సముద్రం మధ్యలో నల్ల చలువ రాతితో వివేకానంద రాక్ ఆకట్టుకుంటుంది. ఇక్కడికి కూత వేటు దూరంలో పరమ శివుడిని పరిణయం ఆడేందుకు పార్వతి దేవి తపస్సు చేసినట్టు చాటే శిలారూపంలోని ఆమె పాద ముద్రలను వీక్షించొచ్చు. ఇక తమిళ మహాకవి తిరువళ్లువర్ 133 అడుగుల నిలువెత్తు విగ్రహం ఇక్కడే కొలువు దీరి ఉంది. దక్షిణాసియాలోని ఎత్తయిన విగ్రహాల జాబితాలో ఇది కూడా ఒకటి. వీటిని వీక్షించాలంటే పడవలో పయనించాల్సిందే. అలాగే ఆధ్యాత్మికతకు నెలవుగా భగవతి అమ్మన్, మురుతువజమలై ఉన్నాయి.

సముద్రంలో విహారం..

కన్యాకుమారిలో తీరం నుంచి కూత వేటు దూరంలో సముద్రంలోని వివేకానంద రాక్, తిరువళ్లువర్ విగ్రహం సందర్శన కోసం పూంబుహార్ పడవలను అందుబాటులో ఉంచుతోంది. ఎంఎల్ గుహన్, ఎంఎల్ పొదిగై, ఎంఎల్ వివేకానంద పేరిట ఈ పడవల సవారీ చేపడుతోంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ పడవల ద్వారా వివేకానంద రాక్‌ను సందర్శించవచ్చు. ఈ నేపథ్యంలో సముద్రంలో గంట పాటు పర్యాటకులు విహరించేందుకు వీలుగా రెండు అత్యాధునిక బోట్లను పూంబుహార్ విభాగం రూ.8.2 కోట్లతో సిద్ధం చేసింది. ఈ బోట్లలో ఒకదాని పేరు తామర భరణి, మరొకదానికి తిరువళ్లువర్ అని పేరు పెట్టారు. ఈ పడవల ద్వారా పర్యాటకులు సముద్రంలో విహరించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నిపుణులు

కన్యాకుమారి నుంచి మరో పర్యాటక, శిల్ప సంపదలు, పురాతన బీచ్‌కు చిహ్నంగా ఉన్న వట్టకోట్టై వరకు ఈ సముద్ర ప్రయాణానికి చర్యలు తీసుకున్నారు. ఇందుకు తగ్గ పనులను చెన్నై నుంచి కన్యాకుమారికి వెళ్లిన నిపుణుల బృందం పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. దీంతో బుధవారం నుంచి సముద్ర విహారానికి ఈ పడవలు రెడీ అయ్యాయి.


జెండా ఊపి బోట్లను ప్రారంభిస్తున్న మంత్రులు


బోటులో విహరిస్తున్న మంత్రులు, అధికారులు

ఈ పడవలను ప్రజా పనుల శాఖమంత్రి ఏవీ వేలు, పాడిపరిశ్రమల శాఖ మంత్రి మనో తంగరాజ్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఆరు నాటికల్ మైళ్ల దూరం వరకు ఇందులో మంత్రులు పర్యటించారు. గంట పాటు సముద్రంలో విహరించి ఒడ్డుకు చేరుకున్నారు. ఈ బోట్లలో ఏసీ, నాన్ ఏసీ సౌకర్యాలు సైతం కల్పించారు. ఏసీ సౌకర్యం కలిగిన బోటులో ఒకరికి రూ. 450, నాన్ ఏసీ బోటులో రూ. 350గా ఫీజు నిర్ణయించారు.

అద్దాల వంతెన

పర్యాటక కేంద్రం కన్యాకుమారిలోని వివేకా నంద రాక్ నుంచి తిరువళ్లువర్ విగ్రహం వరకు అద్దాలతో వంతెన నిర్మించాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ. 37 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ వంతెన పనులకు మంత్రుల బృందం బుధవారం శంకుస్థాపన చేసింది.

ఇద్దరు అన్నలపై కత్తితో దాడి చేసిన విద్యార్థి

- పరిస్థితి విషమం

తిరువొత్తియూరు: అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదంలో ఇద్దరు అన్నదమ్ములపై ఓ విద్యార్థి కొడవలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన ముగ్గురు వ్యక్తులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. చెన్నై మాధవరం తిరుమాల్‌నగర్ మొదటి వీధికి చెందిన వెంకటేష్ (50), అతని భార్య సూలచమ్మ (48). వీరు ఆంధ్రప్రదేశ్ వాసులు. మాధవరం సమీపంలో హోటల్ నడుపుతున్నారు. వీరికి సురేష్ (26), శ్రీనివాసన్ (24), శ్రీకాంత్ (20)అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో సురేష్ చెన్నైకి చెందిన ఐటీ సంస్థలోనూ, శ్రీనివాసన్ చెన్నైలోని ఓ ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్నారు. శ్రీకాంత్ కోయంబేడులోని ప్రైవేటు కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం వెంకటేష్ అతని భార్య, వారి పెద్ద కుమారుడు సురేష్‌కు వధువును చూడడానికి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. ఇంటిలో వారి ముగ్గురు కుమారులు మాత్రమే ఉన్నారు. మంగళవారం ఉదయం అన్నదమ్ముల మధ్య గొడవలు జరిగింది. తీవ్ర ఆగ్రహంతో శ్రీకాంత్ కొడవలితో తన ఇద్దరు సోదరులు సురేష్, శ్రీనివాస్‌పై దాడి చేశాడు. వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో శ్రీకాంత్‌కు కూడా గాయాలయ్యాయి. స్థానికులు ఈ ముగ్గురిని 108 వాహనంలో చెన్నై స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. సురేష్, శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మాధవరం పోలీసు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మారియమ్మన్ ఆలయ హుండీ ఆదాయం రూ.1.04 కోట్లు

అన్నానగర్: సమయపురం మారియమ్మన్ ఆలయ హుండీ ద్వారా రూ.కోటి 4 లక్షల ఆదాయం వచ్చింది. తిరుచ్చి జిల్లా సమయపురం మారియమ్మన్ ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పాలకవర్గం నేతృత్వంలో నెలకు రెండుసార్లు లెక్కిస్తారు. ఆలయ జాయింట్ కమిషనర్ కల్యాణి, హిందూ ధార్మికశాఖ అధికారుల సమక్షంలో మంగళవారం హుండీ కానుకలను లెక్కించారు. ఇందులో రూ.కోటి 4 లక్షల నగదు, 759 గ్రాముల బంగారం, 5 కిలోల 117 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ సిబ్బంది, వలంటీర్లు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

నేటి నుంచి ఉజ్జీవ మహాసభలు

కొరుక్కుపేట: క్రోంపేట తెలుగు బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజుల పాటు ఉజ్జీవ మహాసభలు జరుపుకోనున్నారు. క్రోంపేట తెలుగు బాప్టిస్టు సంఘం ఆవరణలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానున్న ఈ మహాసభలకు ప్రజలంతా తరలి వచ్చి ఏసుక్రీస్తు కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు బుధవారం తెలియజేశారు. ఈ ఉజ్జీవ మహాసభల్లో ముఖ్య ప్రసంగీకులుగా ఏసయ్య దీవెన టీవీ వర్తమానికులు–ఏలూరుకు చెందిన పాస్టర్ ఎం.జ్యోతిరాజు, రివైవల్ మినిస్ట్రీస్ –చెన్నైకు చెందిన పాస్టర్ లూకాస్ శేఖర్ పాల్గొని దైవసందేశాన్ని వినిపించనున్నట్టు సంఘకాపరి రెవరెండ్ జిమోజెస్, సంఘ పెద్దలు, సభ్యులు తెలియజేశారు.

సరికొత్త సాంకేతికతపై ప్రత్యేక దృష్టి

సాక్షి చెన్నై: మారుతున్న సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరికొత్త సాంకేతిక ఫ్యూచర్లలపై ప్రత్యేక దృష్టి సారించామని ఓప్పో సంస్థకు చెందిన చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దమయంత్ ఖనోరియా తెలిపారు. చెన్నై తరమణిలో బుధవారం జరిగిన సాంకేతిక అంశాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌ల్లో ప్రధాన సమస్యలను వివరించారు. ఇందులో బ్యాటరీ సమస్యే ముఖ్యమైందని పేర్కొన్నారు. దీనిని అధిగమించే విధంగా ఎక్కువ సమయం బ్యాటరీ నిలిచేలా పరిశోధనలు చేసి విజయం సాధించామన్నారు. దీని ఆధారంగా ఓపో ఎఫ్23 పేరుతో 5జీ స్మార్ట్ ఫోన్‌ను తీసుకొచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రతినిధులు అపూర్వ శ్రీవత్సవ తదితరులు ప్రసంగించారు.

పళ్లిపట్టులో జాతర సందడి

పళ్లిపట్టు: పళ్లిపట్టులో రెండు రోజుల పాటు జాతర సందడి నెలకొంది. పళ్లిపట్టు గ్రామదేవత కొళ్లాపురమ్మ, గంగమ్మ జాతర మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం, పట్టణ ప్రధాన వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం సాయంత్రం కొళ్లాపురమ్మ ఆలయం వద్ద చేపట్టిన నాదస్వర కచేరి అమితంగా ఆకట్టుకుంది. రాత్రి 9 గంటల సమయంలో మునికృష్ణన్ యాదవ్ కుటుంబీకులు అమ్మవారికి రూ.లక్ష విలువగల రెండు వందల కేజీజీ బరువుతో మల్లి, రోజా, చామంతి, తులసి పువ్వుల మాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు మహిషాసురమర్థిని అలంకరణ చేసి పుష్పపల్లకిలో కొలువుదీర్చి పట్టణ వీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా, యువకుల చిందుల నడుమ అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. మహిళలు కర్పూర హారతులిచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి గంగమ్మతల్లిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. బుధవారం ఉదయం గాంధీ విగ్రహం వద్ద కొలువుదీర్చారు. మహిళలు అంబలి పోసి దర్శించుకున్నారు. యువకులు వివిధ వేషధారణతో పట్టణంలో హల్‌చల్ చేశారు. సాయంత్రం అశేష భక్తజనం నడుమ అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు. వేడుకల్లో తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వేడుకల ఏర్పాట్లు విజయవంతంగా చేశారు.







గజమాలను తీసుకొస్తున్న భక్తులు, ఆకట్టుకున్న నాదస్వర కచ్చేరి, (ఇన్‌సెట్) మహిషాసురమర్థిని అలంకరణలో కొళ్లాపురమ్మ

డీఎస్పీ కూతురి పెళ్లి పత్రిక సోషల్ మీడియాలో వైరల్

కొరుక్కుపేట: కోయంబత్తూరులో మూడు మతాలకు చెందిన మత పెద్దల సమక్షంలో డీఎస్పీ తన కుమార్తెకు పెళ్లి పత్రిక రాసే వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వేతిచెల్వన్ కోయంబత్తూరు జిల్లా క్రైమ్ డీఎస్పీ. కొన్నేళ్ల క్రితం ఇతను కోయంబత్తూర్‌లో మతపరమైన సమస్యలను పర్యవేక్షించే ఎస్ఐసీ అనే ప్రత్యేక నిఘా విభాగంలో ఉన్నారు. ఆ సమయంలో మతపరమైన విషయాలను చక్కగా నిర్వహించి పలు కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు. రాష్ట్రపతి అవార్డు సైతం అందుకున్నారు. అతని కూతురు నిషాన్‌ధిని పీహెచ్‌డీ చదువుతున్న ఆమెకు, తిరునల్వేలికి చెందిన సుదర్శన్‌కు వివాహం నిశ్చయమైంది. వీరి వివాహాన్ని మతాలకు అతీతంగా నిర్వహించాలని నిర్ణయించుకున్న వేతిచెల్వన్ కుమార్తె వివాహం హిందూ, క్రిస్టియన్, ఇస్లాం మత గురువుల సమక్షంలో నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. అనంతరం పేరూరు ఆధీనం శాంతలింగ ఆడిగళార్, గౌమార మఠం రామానంద కుమారగురుపరస్వామి కామాక్షీపురి ఆధీనం శివలింగేశ్వరస్వామి, కోయంబత్తూరు క్యాథలిక్ డియోసెస్ బిషప్ థామస్ అక్వినాస్, బోధ్‌నూర్ మసీదు ఇబ్రహీం సున్నత్ జమాత్‌కు చెందిన ఇమామ్ అబ్దుల్ రహీమ్ ఇమ్దతి భగవి ఆహ్వానిస్తారు. పెళ్లి కార్డులో మూడు మతాలకు చెందిన పెద్దల పేర్లను కూడా ముద్రించారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మతాలకు అతీతంగా కూతురి పెళ్లి జరిపించాలనే పట్టుదలతో మత సామరస్యానికి పాటుపడుతున్న డీఎస్పీకి ప్రజలు, తోటి పోలీసులు అభినందించారు. ఈ వివాహం కోయంబత్తూరులోని చూలులోని తిరుచ్చి రోడ్‌లోని కల్యాణ మండపంలో జరగనుండడం విశేషం.



సర్ఫింగ్ గేమ్‌కు తమిళులు

ఎల్ సాల్వడార్‌లో ఐఎస్ఏ వరల్డ్ సర్ఫింగ్ గేమ్స్ 2023 పోటీలు ఈనెల 30 నుంచి జూన్ 7వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో భారత్ తరఫున నలుగురు సర్ఫర్‌లలో ముగ్గురు తమిళనాడుకు చెందిన చెన్నై శివారులోని కోవలం జాలర్ల గ్రామానికి చెందిన అజీస్ అలీ, సంజయ్ సెల్వమణి, మహాబలిపురం జాలర్ల గ్రామానికి చెందిన శివరాజ్ బాబు ఉన్నారు. అలాగే, కేరళలోని కోవలంకు చెందిన రమేష్ కూడా ఉన్నారు. వీరంతా స్థానికంగా శిక్షకులుగా ఉన్నారు. ప్రస్తుతం ప్రపంచ స్థాయి పోటీలకు అవకాశం రావడంతో బుధవారం తమ ఆనందాన్ని ఇలా పంచుకున్నారు.

–సాక్షి, చెన్నై

ఆన్‌లైన్ ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కారం

కొరుక్కుపేట: సైబర్ నేరాలు, మోసాలు కట్టడి చేయడమే లక్ష్యంగా నగర పోలీసులు పని చేస్తున్నారు. స్థానిక వేపేరిలో చెన్నై నగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అదనపు కమిషనర్ మహేశ్వరి ఆధ్వర్యంలో అదనపు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్, ఎస్ఐల ఆధ్వర్యంలో 30 మంది పోలీసులతో ప్రత్యేక విభాగం 24 గంటలూ పనిచేసేలా నిర్ణయించారు. తమిళనాడులో డీఎంకే వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తమిళనాడు పోలీసు శాఖను ఆధునీకరించేందుకు పలు ప్రాజెక్టులను అమలుచేస్తున్నారు. పోలీస్ కమిషనర్ శంకర్ జివాల్ ఆదేశాల మేరకు చెన్నై నగర పోలీసులు ప్రజల ఫిర్యాదులపై స్పందిస్తూ పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ సహా సోషల్ మీడియాలోని ఫిర్యాదులను తీసుకుంటున్నారు. సిటీ పోలీసులు 48 గంటల్లో పరిష్కారం చూపుతున్నారు. నాలుగు నెలల్లో చెన్నైలో ప్రజల నుంచి 4,835 ఫిర్యాదులు రాగా, 4,700 ఫిర్యాదులను పరిష్కరించారు.

పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం

వేలూరు: గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడి యూనియన్ పరిధిలోని తెన్‌పల్లికుప్పం పంచాయతీలో మన ఊరు సూపర్ అనే పథకాన్ని ప్రారంభించారు. అనంతరం పారిశుధ్య పనుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పాల్గొని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ కూలీలతో వాగులు, వంకల్లో పూడిక తీత పనులు చేపట్టి వర్షపు నీరు వృథాగా పోకుండా చెరువులకు, కుంటలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా గ్రామ వీధుల్లో వీధులు, పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయం వంటి ప్రాంతాల్లోను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చర్యలు స్థానికులు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ సెంథిల్ కుమార్, యూనియన్ చైర్మన్ వేల్‌మురుగన్, వైస్ చైర్మన్ శరవణన్, బీడీఓ నందకుమార్, పాల్గొన్నారు.



మన ఊరు సూపర్ పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

మార్కెట్ వ్యాపారులతో సమీక్ష

తిరుత్తణి: తిరుత్తణి కామరాజర్ మార్కెట్ వ్యాపారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ బుధవారం సమీక్ష నిర్వహించారు. తిరుత్తణి మపోసీ రోడ్డు మార్గంలో మున్సిపాలిటీకి సొంతమైన కామరాజర్ మార్కెట్ 50 ఏళ్లకు పైగా సేవలందిస్తోంది. కూరగాయలతో పాటు కిరాణా వస్తువులు, పండ్లు, సహా వివిధ దుకాణాలున్నాయి. మార్కెట్ సముదాయంలోని భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనాలు నిర్మించాలన్న మున్సిపాలిటీ కోర్కె మేరకు రూ.3కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో త్వరలో కొత్త మార్కెట్ సముదాయ భవనం నిర్మించనున్నారు. పాత దుకాణాల కట్టడాలు కూల్చివేయనున్న క్రమంలో అక్కడున్న వ్యాపారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. నూతన సదుపాయాలతో వంద గదులు, మరుగుదొడ్లు, వ్యాపారులు, కూలీలు సేదదీరేందుకు గదులు సహా సౌకర్యాలు కల్పించనున్న క్రమంలో తాత్కాలికంగా ఆరు మాసాల పాటు వ్యాపారులు రైతు బజారులో వ్యాపారం చేసుకునేందుకు సంబంధించి వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. మున్సిపల్ కమిషనర్ రామజయం, మున్సిపల్ వైస్ చైర్మన్ సామి రాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వార్షికోత్సవం

ఎస్ఆర్ఎం గ్రూప్ పరిధిలోని ఈశ్వరి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం బుధవారం టీఆర్‌పీ ఆడిటోరియంలో జరిగింది. ఇందులో కోయంబేడు డిప్యూటీ కమిషనర్ పి. కుమార్, రామాపురం, తిరుచ్చి క్యాంపస్ ఎస్ఆర్ఎం చైర్మన్ డాక్టర్ ఆర్ శివకుమార్, డైరెక్టర్ సుబ్బయ్య భారతి వివిధ పోటీల్లో విజేతలైన 750 మంది విద్యార్థులకు బహుమతులు, అవార్డులు, ట్రోఫీలను అందజేశారు.

–సాక్షి, చెన్నై

రూ.100 కోట్ల బడ్జెట్‌తో ధనుష్ చిత్రం





ధనుష్
దుషారా

తమిళసినిమా: పాన్ వరల్డ్ నటుడు ధనుష్. ఈయన సినీ పయనం అతి తక్కువ కాలంలోనే కోలీవుడ్ టూ హాలీవుడ్ వయా బాలీవుడ్, టాలీవుడ్ అంటూ సక్సెస్‌ఫుల్‌గా సాగుతోంది. ప్రస్తుతం కెప్టెన్ మిల్లర్ అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన గెటప్ పొడవైన జుట్టు, గడ్డం అంటూ చాలా భిన్నంగా ఉంది. సత్యజ్యోతి ఫిలింస్ సంస్థ నిర్మిస్తోంది. చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దీంతో ధనుష్ నటించనున్న తర్వాత చిత్రం ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఎందుకంటే పలువురు దర్శక నిర్మాతలు ఈయన కాల్‌షీట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా ధనుష్ తన 50వ చిత్రానికి సిద్ధం అవుతున్నారు. విశేషం ఏమిటంటే ఈ చిత్రాన్ని ఆయనే దర్శకత్వం వహించబోతుండడం. ధనుష్ మెగాఫోన్ పడుతున్న రెండవ చిత్రం ఇది. ఇంతకు ముందు పా.పాండి అనే చిత్రంలో నటించి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ చిత్రం 2017 ఏప్రిల్ 14న తమిళ ఉగాదికి విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. కాగా తాజాగా దర్శకత్వం వహించనున్న చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌లో నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు ఇప్పటికే జరుగుతున్నట్లు సమాచారం. కాగా ఇందులో ధనుష్‌తో పాటు నటుడు విష్ణువిశాల్, కాళిదాస్ జయరామ్, నటి దుషారా ముఖ్య పాత్రలు పోషించనున్నట్లు సమాచారం. తాజాగా ఇందులో ఎస్‌జే.సూర్య, సందీప్‌కిషన్ కీలక ప్రధాన పాత్రల్లో నటుడు ధనుష్‌కు సోదరులుగా నటించనున్నట్లు తెలుస్తోంది. ఇది ఉత్తర చెన్నై నేపథ్యంలో సాగే గ్యాంగ్‌స్టర్ కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

కోలీవుడ్ టాక్స్





అజిత్
త్రిష

విడాముయర్చి మరోసారి వాయిదా

తమిళసినిమా: నటుడు అజిత్ నటించిన తుణివు చిత్రం గత పొంగల్‌కు తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే తదుపరి చిత్రం షూటింగ్ వాయిదాలు పడుతోంది. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మొదట నటి నయనతార భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తారని ప్రచారం జరిగింది. అయితే పలు కారణాలతో దర్శకుడు విఘ్నేశ్ శివన్ ఆ చిత్రం నుంచి వైదొలిగారు. అప్పటి నుంచి ఏదో ఒక కారణంతో అజిత్ చిత్రం ప్రారంభం వాయిదా పడుతూనే ఉంది. విఘ్నేశ్ శివన్ చిత్రం నుంచి వైదొలగడంతో ఆ స్థానంలోకి దర్శకుడు మగిళ్ తిరుమేణి వచ్చారు. ఈ చిత్రానికి విడా ముయర్చి అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆయనకు తన పోర్షన్‌ను 70 రోజుల్లో పూర్తిచేయాలని అజిత్ కండిషన్ పెట్టారనే ప్రచారం జరిగింది. దీంతో విడా ముయర్చి చిత్రం ప్రారంభం కాబోతోందనే ప్రచారం జోరందుకుంది. అలా గత మార్చిలోనే ఈ చిత్ర షూటింగ్ ప్రారంభం కావలసింది. అయితే ఆ సమయంలో అజిత్ తండ్రి మరణించారు. దీంతో చిత్ర షూటింగ్ వాయిదా పడింది. ఏప్రిల్‌లో షూటింగ్ మొదలవుతుందనే ప్రచారం జరిగింది. అయితే అజిత్ తన ప్రపంచ బైక్ పర్యటనకు వెళ్లిపోయారు. దీంతో విడా ముయర్చి చిత్ర షూటింగ్‌ను మే నెలకు వాయిదా వేసినట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్ర షూటింగ్ మరోసారి వాయిదా పడినట్లు తెలిసింది. ప్రస్తుతం అజిత్ అనూహ్యంగా తాను కొత్తగా ప్రారంభించనున్న ఏకే మోటో రైడ్ పేరుతో అంతర్జాతీయ పయనానికి ఆసక్తి కలిగిన వారికి అవకాశం కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో జూన్ చివరిలో విడా ముయర్చి చిత్ర షూటింగ్ ప్రారంభం అవుతుందని టాక్. ఈ చిత్రంలో అజిత్ సరికొత్త గెటప్‌లో కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇకపోతే ఇందులో కథానాయకి పాత్ర కోసం బాలీవుడ్ బ్యూటీలు కంగనారనౌత్, కత్రినా కైఫ్, కరీనాకపూర్‌లలో ఒకరిని ఎంపిక చేసే పనిలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాజాగా త్రిషనే ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ బ్యూటీ అజిత్‌తో ఇంతకు ముందు కిరీటం, ఎన్నై అరిందాల్, మంగాత్తా చిత్రాల్లో జత కట్టిందన్నది గమనార్హం.

భారతీరాజా ప్రధాన పాత్రలో మార్గళి తింగళ్



మార్గళి తింగళ్ చిత్ర ప్రారంభోత్సవం

తమిళసినిమా: సీనియర్ దర్శకుడు భారతీరాజా ఏడు పదులు దాటిన వయసులోనూ నటుడిగా బిజీబిజీగా ఉన్నారు. మరో పక్క మళ్లీ దర్శకత్వం వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈయన ప్రధాన పాత్రలో నటించనున్న చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభంమైంది. దీనికి మార్గళి తింగళ్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్రం ద్వారా దర్శకుడు భారతీరాజా వారసుడు మనోజ్ భారతీరాజా దర్శకుడిగా పరిచయం అవుతుండడం విశేషం. ఈయన 1999లో తండ్రి భారతీరాజా దర్శకత్వం వహించిన తాజ్‌మహల్ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అయ్యారన్నది గమనార్హం. ఆ తరువాత సముద్రం, వరుషమెల్లామ్ వసంతం, అల్లిఅర్జున్ చిత్రాల్లో నటించారు. ఇటీవల శింబు హీరోగా నటించిన హిట్ చిత్రం మానాడులోనూ కీలక పాత్ర పోషించారు. అప్పుడు భారతీరాజా కొడుకును డైరెక్ట్ చేశారు. ఇప్పుడు మనోజ్ భారతీరాజా తండ్రిని దర్శకత్వం వహిస్తున్నారన్న మాట. ఈయన మెగాఫోన్ పట్టిన చిత్రాన్ని దర్శకుడు సుశీంద్రన్ తన వెన్నిలా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఇందులో దర్శకుడు భారతీరాజా ప్రధాన పాత్రను పోషిస్తుండగా ఇతర పాత్రల్లో నూతన నటీనటులు నటిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేయగా మంచి స్పందన వచ్చిందని దర్శకుడు తెలిపారు. మార్గళి తింగళ్ చిత్ర షూటింగ్‌ను బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

పిచ్చైక్కారన్ పార్టు-3 ఉంటుంది

తమిళసినిమా: ఒక్కో రంగంలో తనను తాను సక్సెస్‌ఫుల్‌గా మలుచుకుంటూ ఎదుగుతూ వస్తున్న నటుడు విజయ్‌ఆంటోని. ఈయన మొదట్లో సంగీత దర్శకుడిగా రంగప్రవేశం చేశారు. ఆ రంగంలో తనకుంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆ తరువాత 2012లో నిర్మాతగా, కథానాయకుడిగా నాన్ అనే చిత్రంతో రంగప్రవేశం చేశారు. ఆ చిత్రం సక్సెస్ అయ్యింది. అలా వరుసగా నటిస్తూ, మరో పక్క సంగీత దర్శకుడిగానూ రాణిస్తున్న విజయ్‌ఆంటోని పిచ్చైక్కారన్ చిత్రంతో సంచలన విజయాన్ని అందుకోవడంతో పాటు తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కాగా ఇటీవల పిచ్చైక్కారన్–2 చిత్రంతో దర్శకుడిగానూ అవతారమెత్తారు. ఈ చిత్రానికి నటుడిగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, ఎడిటర్‌గా బహుముఖాలను ప్రదర్శించి సక్సెస్ అయ్యారు. అవును ఇటీవల విడుదలై పిచ్చైక్కారన్ 2 చిత్రం మంచి వసూళ్లను సాధిస్తోంది. దీంతో పిచ్చైక్కారన్ చిత్రానికి పార్టు 3 ఉంటుందని ఆయన తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ చిత్ర షూటింగ్ 2025లో ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు.అయితే ఈ చిత్ర కథ పిచ్చైక్కారన్ 1, 2 చిత్ర కథలకు సంబంధం ఉండదని, ఇది వేరే విధంగా ఉంటుందని తెలిపారు. కాగా ప్రస్తుతం విజయ్‌ఆంటోని రత్తం, మళై పిడిక్కాద మణిదన్, వళ్లి మళై, అగ్నిసిరకుకళ్, కొలై చిత్రాల్లో నటిస్తున్నారన్నది గమనార్హం. ఈ చిత్రాలు విడుదలైన తరువాతనే పిచ్చైక్కారన్ 3 చిత్రాన్ని ప్రారంభించనున్నట్లు విజయ్ ఆంటోని చెప్పారు.



విజయ్‌ఆంటోని

హిట్ కాంబినేషన్ రిపీట్

తమిళసినిమా: నటుడు విశాల్, కమర్షియల్ చిత్రాల దర్శకుడు హరి హిట్ కాంబినేషన్ రిపీట్ కానున్న విషయం ఇప్పటికే ప్రచారంలో ఉన్న విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో ఇంతకు ముందు తామిరభరణి, పూజా వంటి సూపర్‌హిట్ చిత్రాలు వచ్చాయి. తాజాగా ఈ కాంబినేషన్ హ్యాట్రిక్‌కు సిద్ధం అవుతోంది. ఇది విశాల్ నటించనున్న 34వ చిత్రం అవుతుంది. ప్రస్తుతం ఆయన మార్క్ ఆంటోని చిత్రాన్ని పూర్తిచేశారు. నటుడు ఎస్‌జే.సూర్య విలన్‌గా పవర్‌ఫుల్ పాత్రను పోషించిన ఈ చిత్రాన్ని ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మినీ స్టూడియోస్ పతాకంపై వినోద్‌కుమార్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. కాగా విశాల్ నటించనున్న తాజా చిత్రాన్ని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ స్టోన్ బెంచ్ స్టూడియో, జీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం షూటింగ్ జూన్ తొలివారంలో ప్రారంభం కానుందని తాజా సమాచారం. చిత్ర షూటింగ్‌ను తమిళనాడు, కేరళ, ఆంధ్ర రాష్ట్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిసింది. కాగా ఇందులో ముఖ్యపాత్రలో యోగిబాబును నటించనున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిసింది. షూటింగ్‌కు ముందే చిత్ర వీడియోను విడుదల చేసే పనిలో చిత్ర వర్గాలు ఉన్నట్లు సమాచారం.

విశాల్‌తో దర్శకుడు హరి



క్లుప్తంగా

వేడి నీళ్లలో పడిన చిన్నారి మృతి

తిరువొత్తియూరు: దిండుక్కల్ జిల్లాలో వేడి నీళ్లలో పడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. దిండుక్కల్ జిల్లా నేలకోట ప్రాంతానికి చెందిన చెల్లపాండి (39). ఇతని భార్య సత్య. వీరికి మూడేళ్లు, ఆరు నెలల బిడ్డ ఉన్నారు. ఈరోడ్ జిల్లా కుంజై బులియన్ పట్టి వద్ద వున్న పుంగమ్ పల్లిలో కుటుంబం సహా ఉంటూ అదే ప్రాంతంలో ఉన్న ప్రైవేటు సంస్థల్లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం సత్య మూడేళ్ల రితిక స్నానానికి బాత్‌రూమ్‌లో వేడినీటిని ఉంచి తలుపులు వేసేందుకు ఆమె వెళ్లారు. అదే సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లిన రితిక వేడినీటిలో జారి పడింది. తీవ్రంగా గాయపడ్డ రితికను కోవై ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

రైళ్లలో 670 కేజీల గంజాయి స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై సెంట్రల్, ఎగ్మూర్, కాట్పాడి సహా ప్రధాన రైల్వేస్టేషన్లలో గంజాయి స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు గంజాయి తనిఖీ 4.0 కార్యక్రమంలో భాగంగా రైల్వే పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి నుంచి మే 21 వరకు పలు రైల్వేస్టేషన్లలో నిర్వహించిన తనిఖీల్లో 670 కేజీల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. 38 మంది నిందితులను అరెస్టు చేశారు. అలాగే ఉత్తరాది రాష్ట్రాల నుంచి విజయవాడ, రేణిగుంట మీదుగా తమిళనాడుకు వచ్చే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో గంజాయి, గుట్కా, పొగాకు, మత్తుపదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తమిళనాడు రైల్వే పోలీసులు వెల్లడించారు.

జిల్లా స్థాయిలో భారీ బహిరంగ సభలు



కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏజీ సంపత్

తిరువళ్లూరు: రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ప్రధాన కేంద్రాల్లో భారీ బహిరంగ సభలను నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. తిరువళ్లూరు జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం కాకలూరులోని ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఏజీ సంపత్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్లమెంట్ నియోజవర్గ స్థాయిలో 250 కుటుంబాలను సమన్వయం చేసి సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నేతలు సెల్వీదామోధరన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కరుణాకరన్, ఆర్యశ్రీనివాసన్, లయన్ శ్రీనివాసన్, జయగణేష్, కోశాధికారి మధుసూదనన్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తిరువొత్తియూరు: కుటుంబకలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. తిరువేర్కాడు రాందాస్ నగర్‌కు చెందిన మహేష్ (30). ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. ఇతనికి జాక్వెలిన్ బ్యూలా (26)తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడు నెలల బాబు ఉన్నాడు. కొన్ని నెలలుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మహేష్ ఎప్పటిలాగే పనికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి భార్య జాక్వెలిన్ బ్యూలా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండడంతో దిగ్భ్రాంతి చెందాడు. దీనిపై తిరువేర్కాడు పోలీసులు కేసు దర్యాప్తు చేయగా పెళ్లయిన తరువాత కూడా మహేష్ తల్లిదండ్రులు, చెల్లెలుతో ఉంటున్నాడని, వేరే కాపురం పెట్టాలని జాక్వెలిన్ బ్యూలా భర్తపై ఒత్తిడి తెచ్చింది. అందుకు మహేష్ నిరాకరించి చెల్లెలు వివాహం అయిన తరువాతే అని చెప్పినట్టు తెలిసింది. ఈ విషయంతో భార్యభర్తల మధ్య తలెత్తిన వివాదంలో జాక్వెలిన్ బ్యూలా ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు.

పైకప్పు కూలి కార్మికుడు మృతి

తిరువొత్తియూరు: జాకీతో కట్టడాన్ని పైకి లేపుతుండగా పైకప్పు కూలి ఓ కార్మికుడు మృతి చెందాడు. తాంబరం సమీపం సేలయూర్ కరణం వీధికి చెందిన లక్ష్మి (60). ఈమె రెండు అంతస్తుల ఇంటిని నేలమట్టం నుంచి పైకి లేపే పనులు చేయిస్తున్నారు. ఇందులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు 11 మంది పనిచేస్తున్నారు. మంగళవారం జాకీతో కట్టడం పైకి లేపుతున్న సమయంలో హఠాత్తుగా పైకప్పు విరిగిపడింది. ఈ ప్రమాదంలో శిథిలాల కింద ముగ్గురు కార్మికులు చిక్కుకున్నారు. విషయం తెలిసి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని రెండు గంటలపాటు శ్రమించి శిథిలాలను తొలగించి కార్మికుల ను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే భాస్కర్ (28) అనే కార్మికుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సేలయూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిశువు మృతదేహం లభ్యం

అన్నానగర్: నెల్లై సమీపంలో బుధవారం ఉదయం మగ శిశువు మృతదేహం రోడ్డు పక్కన లభ్యమైంది. కూకరైపట్టి సమీపంలోని అనయప్పపురం బస్టాప్ సమీపంలో బుధవారం రోడ్డు పక్కన మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు అందించారు.

కనులపండువగా ఆలయ కుంభాభిషేకం

- హెలికాప్టర్ నుంచి పూల వర్షం

కొరుక్కుపేట: మైలాడుదురై జిల్లా సీర్కాళిలో ధర్మపుర ఆదినాథునికి చెందిన 800 ఏళ్లనాటి చారిత్రక పుణ్యక్షేత్రం చట్టినాథ్ ఆలయం ఉంది. దయాల్ నాయకీ అంబాల్ సమేత బ్రహ్మపురీశ్వర స్వామి కొలువై భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ ఆలయంలో 32 ఏళ్ల తరువాత కుంభాభిషేకాన్ని నిర్వహించాలని నిర్ణయించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈనెల 20న 150 మంది శివాచార్యులు, 82 యాగ గుండాలను ఏర్పాటు చేసి యాగశాల పూజలను ప్రారంభించారు. బుధవారం ఉదయం యాగశాల నుంచి ఊరేగింపు ప్రారంభమై వేద మంత్రోచ్చరణలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం 10 గంటలకు పవిత్ర జాలాలను పోసి కుంభాభిషేకం మహోత్సవాన్ని కనులపండువగా చేశారు. అనంతరం హెలికాప్టర్ నుంచి గోపురంపై పూలవర్షం కురిపించారు. వేలాదిమంది భక్తులు కుంభాభిషేకాన్ని తిలకించి తరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, ఆరాధనలు నిర్వహించారు . ఎస్పీ నిషా ఆధ్వర్యంలో 100 మందికి పైగా పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొనగా ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి దర్శన భాగ్యం కల్పించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఆశీర్వాదం అందించారు. ఇదిలా ఉండగా గవర్నర్ రవికి నల్లజెండాలు ఎగురవేసి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.



కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, హెలికాప్టర్ నుంచి పూల వర్షం

నిషేధిత వస్తువులు అనుమతించొద్దు

కొరుక్కుపేట: నిషేధిత వస్తువులను బస్సులో తీసుకెళ్లకూడదని, వాటిని అనుమతించొద్దని కండక్టర్లను రవాణా సంస్థ ఆదేశించింది. ఈ మేరకు బుధవారం మున్సిపల్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ఒక సర్క్యులర్ జారీ చేసింది. మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ బస్సుల్లో ప్రయాణికులు 5కిలోల లగేజీని ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతిస్తున్నారు . అయితే 5 కిలోల కంటే ఎక్కువగా బరువున్న వాణిజ్య సరుకులకు ఒక ప్రయాణికుల చార్జీ వసూలు చేస్తారు. అదేవిధంగా 5 కిలోల నుంచి 20 కిలోల బరువున్న వస్తువులకు లగేజీ రూ.10, ప్రయాణికుడి చార్జి ఏది ఎక్కువయితే అది విధిస్తున్నారు. అదే విధంగా 20 కిలోల కంటే ఎక్కువ బరువున్న లోడ్ లకు రూ. 20 లేదా ఇద్దరు ప్రయాణికుల చార్జీ ఏది ఎక్కువైతే అది వసూలు చేస్తున్నారు. అలాగే తమిళనాడు రాహదారిపై నిషేధిత వస్తువులు, అక్రమ రవాణా వస్తువులు, మండే వస్తువులను బస్సులో కండక్టర్లు అనుమతించకూడదని, రద్దీ సమయాల్లో బస్సుల్లో లగేజీ వేయకూడదని రవాణా సంస్థ తెలిపింది. అలాగే వార్తా పత్రికలు, మెయిల్‌లను తీసుకెళ్లే ముందు అనుమతి తీసుకోవాలి అని తెలిపింది.

కొబ్బరికాయల తొలగింపుపై నిర్ణయం తీసుకుంటాం

–మంత్రి పన్నీరుసెల్వం

కొరుక్కుపేట: కొబ్బరి కాయల తొలగింపుపై ప్రభుత్వం అన్ని వర్గాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి పన్నీరుసెల్వం తెలిపారు. కోయంబత్తూరులోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సెమినార్ అండ్ ఫ్యూచర్ ఫుడ్ విజన్ కార్యక్రమాన్ని మంత్రి పన్నీరుసెల్వం ప్రారంభించారు. కొత్త రకాల చిరుధాన్యాలపై యూనివర్సిటీ పరిశోధకులు రైతులకు అవగాహన కల్పించారు. విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ దేశంలో కొత్త వంగడాల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఈ ఏడాది రూ.50 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. అలాగే చిరుధాన్యాల పనులు, నాణ్యమైన విత్తనాల అభివృద్ధికి రూ.82 కోట్లు కేటాయించామని చెప్పారు.



సదస్సులో మంత్రి పన్నీరు సెల్వం

ఐదేళ్లలోపు పిల్లలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 5 నుంచి12 ఏళ్లలోపు వారికి 50 శాతం రాయితీ



సాక్షి, చెన్నై: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ఇకపై ఐదేళ్లలోపు పిల్లలు ఉచితంగా ప్రయాణించే అంశానికి సంబంధించిన ఉత్తర్వులు బుధవారం జారీ అయ్యాయి. అలాగే, 5 నుంచి 12 ఏళ్లలోపు వారికి 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ వివరాలను బుధవారం ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించారు. వివరాలు.. కుంబకోణం, విల్లుపురం, తిరునల్వేలి తదితర 8 డివిజన్లుగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు సేవలందిస్తోంది. రోజూ 20 వేల బస్సులను కార్మికులు నడుపుతున్నారు. బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఇప్పటికే కల్పించారు. ఈ పరిస్థితులో గత నెల జరిగిన బడ్జెట్ సమావేశాల సందర్భంగా 3 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత ప్రయాణం అన్న అంశంపై చర్చ జరిగింది. ఇందులో 3 ఏళ్లకు బదులుగా ఐదేళ్ల వరకు ఉచిత ప్రయాణ సదుపాయం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు రవాణ శాఖ మంత్రి శివశంకర్ ప్రకటించారు. దీనిని అమల్లోకి తెస్తూ బుధవారం ప్రభుత్వ గెజిట్‌లో వివరాలను పొందుపరిచారు. అన్ని డివిజన్ల మేనేజర్లు ఈ ఉత్తర్వులను తక్షణం అమలు చేయాలని, ఎలాంటి ఫిర్యాదులకు, విమర్శలకు తావివ్వకుండా సేవలు కొనసాగాలని అందులో పేర్కొన్నారు.

బావిలో బిడ్డలను తోసి తల్లి ఆత్మహత్య

తిరువొత్తియూరు: సెల్‌ఫోన్‌లో మాట్లాడినందుకు భర్త మందలించాడని ఇద్దరు బిడ్డలను బావిలో తోసి తల్లి ఆత్మహత్య చేసుకుంది. విరుదునగర్ జిల్లా రాజపాళెం సమీపంలోని దేవదానంకు చెందిన ముత్తుకుమార్. వెల్డింగ్ వర్కర్ అయిన అతనికి రాముతై (30) అనే భార్య, ఇద్దరు కుమార్తెలు నిషా (06), ఆర్ఫ సనాదేవి(03) ఉన్నారు. రాముతై ఉపాధి పనులకు వెళుతోంది. ఈ స్థితిలో 20వ తేదీ సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వచ్చిన ముత్తుకుమార్‌కు భార్య రాముతై సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించింది. ఈ విషయమై దంపతుల మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో రాముతై చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని ముత్తుకుమార్ పగలుగొట్టాడు. ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ స్థితిలో రాముతై తన పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఆమె కోసం భర్త, బంధువులు గాలించారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం అక్కడి వ్యవసాయ బావిలో రాముతై , కూతురు నిషా మృతదేహాలు తేలుతున్నాయని స్థానికులు బంధువులకు తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లిన సేతూర్ పోలీసులు, అగ్నిమాపకసిబ్బంది తల్లి, ఇద్దరు కుమార్తెల మృతదేహాలను వెలికి తీసి రాజపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

తిరువళ్లూరు: కాకలూరు కరకట్టను ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణలను పోలీసుల భారీ బందోబస్తు నడుమ బుధవారం తొలగించారు. వివరాలు.. తిరువళ్లూరు మున్సిపాలిటీ కాకలూరు పంచాయతీకి మధ్యలో కాకలూరు చెరువు ఉంది. ఈ చెరువు కరకట్టను ఆక్రమించుకుని 100 మంది భవనాలు, గుడిసెలు, రేకులషెడ్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కాకలూరు–తిరువళ్లూరు మధ్యలో రోడ్డు విస్తరణ పనులను హైవే అధికారులు చేపట్టారు. అయితే రోడ్డు నిర్మాణంతో పాటు విస్తరణకు కరకట్టపై ఉన్న అక్రమ కట్టడాలు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలోనే వీటిని తొలగించాలని అధికారులు నిర్ణయించి గత సంవత్సరం నుంచి నాలుగు సార్లు నోటీసులు ఇచ్చారు. దీంతో పాటు ఈకాడు వద్ద ప్రత్యామ్నాయ ఇంటి స్థలాలను సైతం కేటాయించారు. అయితే ఆక్రమణల తొలగింపునకు ప్రజలు సహకరించకపోవడంతో రోడ్డు విస్తరణ పనులు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చివరి సారిగా గత రెండు వారాల క్రితం నోటీసులను అధికారులు జారీ చేసినా ఖాళీ చేయడానికి అక్కడి ప్రజలు ససేమిరా అనడంతో బుధవారం భారీ పోలీసు బందోబస్తు నడుమ తొలగింపు ప్రక్రియను చేపట్టారు. కాగా ఆక్రమణల తొలగింపును స్థానికులు అడ్డుకోవడానికి యతి న్నించడంతో పోలీసులు వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు.

ప్రేమ పెళ్లి వద్దని తాళి తీసిన యువతి

అన్నానగర్: తిరుపూర్ పూండి రింగ్‌రోడ్‌కు చెందిన యువతి (23). ఈమెకి ఆరు నెలల ముందు కోయంబత్తూర్ జిల్లా అన్నూర్ ఒటర్‌పాళయంకు చెందిన 29 ఏళ్ల యువకుడితో ప్రేమలో పడింది. విషయం తెలిసి పెద్దలు అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో గత 17వ తేదీ యువతి తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంట్లో ఐదున్నర సవర్ల నగలు, రూ.5 లక్షల నగదు తీసుకుని వెళ్లింది. తల్లిదండ్రులు వెలంపాళయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఇంటి నుంచి అన్నూర్‌కి వెళ్లి ప్రియుడిని కలుసుకుంది. అనంతరం అక్కడే గుడిలో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. భద్రత కల్పించాలని ప్రేమికులు ఇద్దరు అన్నూరు పోలీసులను ఆశ్రయించారు. అన్నూర్ పోలీసులు ప్రేమ జంటను వెలంపాళయం పోలీస్‌స్టేషన్‌కు పంపారు. అక్కడ పోలీసులు బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో వారు స్టేషన్‌కు చేరుకుని కుమార్తెను చూసి బోరున విలపించారు. యువతి మనసు మారి తల్లిదండ్రులతో వెళుతూ ప్రియుడిని తప్పులేదని చెప్పి తాళి తీసి అతనికి ఇచ్చి వెళ్లింది. పోలీసులు యువకుడికి సర్ది చెప్పి పంపించేశారు.

పునరావాస కేంద్రాల్లో చిన్నారుల భద్రతకు కమిటీ

తిరువళ్లూరు: పునరావాస కేంద్రాల నుంచి తరచూ తప్పించుకుంటున్న వారి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చిన్నపిల్లల హక్కులు భద్రత కమిటీ సభ్యుడు ఆర్‌జీ ఆనంద్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా వైద్యకేంద్రంలో శిశువుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను పరిశీలించారు. అనంతరం చిన్నారులకు అందుతున్న వైద్యసేవలు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తిరుముల్లైవాయల్‌లో చిన్నపిల్లల డిఅడిక్షన్ పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో చిన్నపిల్లల హక్కులు భద్రత జాతీయ కమిటీ సభ్యుడు ఆర్‌జీ ఆనంద్ కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ తదితరులు మాట్లాడారు. బాలకార్మికులు, చిన్నారులకు సంబంధించిన అన్ని రకాల సమస్యలకు జాతీయ స్థాయిలో పర్యవేక్షించడానికి కమిటీ పని చేస్తోందన్నారు. కల్లకురిచ్చి, తిరువళ్లూరు తదితర రెండు ప్రాంతాల్లో ప్లస్–2 విద్యార్థులు ఆత్మహత్య వ్యవహారంపై దర్యాప్తు సాగుతోందన్నారు. తమిళనాడు సహా దక్షణ భారతదేశంలో ఉన్న 21 బాలనేరస్తుల పునరావస కేంద్రాలను పరిశీలించామన్నారు. కొంత మంది బెయిల్ రాక ఇబ్బంది పడుతుంటే, మరికొంత మంది కేంద్రాల నుంచి తప్పించుకుంటున్నట్లు తనిఖీల్లో నిర్ధారించామన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, డీఆర్వో అశోకన్, ఆర్డీఓ బౌలిన్, తాహసీల్దార్ మదియగళన్, ప్రభుత్వ వైద్యశాల డీన్ అరసిశ్రీవాత్సవన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



జిల్లా వైద్యకేంద్రంలో పిల్లల ఎమర్జెన్సీ వార్డును తనిఖీ చేస్తున్న ఆర్‌జీ ఆనంద్

చెన్నైలో గంజాయి కేక్ విక్రయం

తిరువొత్తియూరు: చెన్నైలో తొలిసారిగా గంజాయి కేక్ విక్రయానికి వచ్చింది. దీన్ని పార్శిల్ చేసి తరలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నైలో గంజా నూనె, గంజాయి చాక్లెట్ వెరైటీలలో మొదటిసారిగా అమ్మకానికి అందుబాటులో ఉంచారు. యువకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. బిహార్, ఒడిశా, అసోం, త్రిపుర రాష్ట్రాల్లో దీనిని తయారు చేసి విక్రయిస్తున్నట్లు భావిస్తున్నారు. మాంబలం పోలీసులు సోమవారం రాత్రి ఈకాట్టు తాంగల్‌లోని కొరియర్ సంస్థలో తనిఖీలు నిర్వహించారు. అక్కడున్న పార్శిల్స్‌ను స్వాధీనం చేసుకుని చూడగా వాటిలో 200 గ్రాముల గంజాయి కేక్ ఉంది. ఇది ఖరీదైందని పోలీసులు చెబుతున్నారు. స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. కొరియర్ పార్శిల్‌లో అక్రమంగా తరలిస్తున్న వారు కొడుంగయూరుకు చెందిన ఏక్‌నాథ్ (39)ను అరెస్టు చేశారు.

గిల్టు నగలతో రూ. 5 లక్షల మోసం

- కేరళ యువకుడు అరెస్ట్

కొరుక్కుపేట: ఓ ప్రైవేట్ బ్యాంకులో గిల్టు నగలు తనఖా పెట్టి రూ.5 లక్షలు మోసం చేసిన కేరళ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరోకరి కోసం గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..చెన్నైలోని కొలత్తూరు పూంపుహార్‌నగర్‌కు చెందిన వెంకట్రామన్ (46) అంబత్తూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలో గతేడాది నవంబర్‌లో కేరళకు చెందిన ప్రణవ్ (29) వెంకట్రామన్ పనిచేసే బ్యాంకు నుంచి స్నేహితుడి ద్వారా నగలు తాకట్టు పెట్టి రూ.2లక్షల 33వేలు పొందాడు. అదేవిధంగా ప్రణవ్ స్నేహితుడు సుభాష్ కూడా అదే బ్యాంకులో నగలు డిపాజిట్ చేసి రూ. 2లక్షల 90 వేలు తీసుకున్నాడు. ఈ స్థితిలో బ్యాంకు సిబ్బంది నగలను మరోసారి పరిశీలించగా ప్రణవ్, సుభాష్ నగలు గిల్టు నగలు అని తేలింది. బ్యాంకులో అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుంటే కటకటాల పాలు కావాల్సి వస్తుందని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీంతో భయాందోళనకు గురైన ప్రణవ్ బ్యాంకులో అప్పుగా తీసుకున్న డబ్బును తిరిగి చెల్లిస్తానని చెప్పి డబ్బుతో మంగళవారం అంబత్తూరు వచ్చాడు. పోలీసులు అంబత్తూరుకు వచ్చి ప్రణవ్‌ను అరెస్టు చేశారు. అతను తెచ్చిన డబ్బును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవానికి దూరం

- డీఎంకే, వీసీకే, ఎండీఎంకే వెల్లడి
- చోళుల ఖ్యాతిని తెలిపే రాజ దండం ఏర్పాటుపై తమిళుల హర్షం

సాక్షి, చెన్నై: కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని తాము బహిష్కరిస్తున్నామని డీఎంకే, ఎండీఎంకే, వీసీకేలు ప్రకటించాయి. బుధవారం ఆ పార్టీల నేతలు స్థానికంగా వేర్వేరుగా ప్రకటన చేశారు. ఈనెల 28వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తూ తమిళనాడుకు చెందిన డీఎంకే, వీసీకే, ఎండీఎంకేలు పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. ఇక, అన్నాడీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్‌లు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. అయితే తమ ప్రతినిధులు ఎవ్వరూ ఈ కార్యక్రమానికి హాజరుకారని డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, వీసీకే నేత, ఎంపీ తిరుమావళవన్, ఎండీఎంకే నేత, ఎంపీ వైకో ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఈ కొత్త భవనంలో చోళుల కాలం నుంచి విశిష్టంగా పేర్కొంటున్న రాజ దండం(సెంగోల్)ను ఉంచనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడాన్ని తమిళాభిమానులు ఆహ్వానించారు. ఈ దండం గతంలో తమిళనాడులోనే తయారు చేసి ఉండటం విశేషం. దీని పై భాగంలో నంది, ఆతర్వాత మహాలక్ష్మి చిత్రాలు, ఆ కింది భాగంలో ఆ దండం తయారీ, అవశ్యం గురించి వివరాలు పొందు పరిచి ఉన్నారు. ఐదు అడుగులతో కూడిన ఈ దండంకు కింది భాగం జెండాను తలపించే విధంగా బంగారు కళాకారులు గతంలో తీర్చిదిద్ది ఉన్నారు. ఎలాంటి సాంకేతికత లేని కాలంలో ఈ దండంను 10 మంది కళాకారులు 30 రోజుల్లో తయారు చేసి ఉండటం విశేషం. ఇది 22 క్యారెట్ల బంగారంతో రూపొందించిన దండమని, 75 ఏళ్ల క్రితం దీనిని తయారు చేసిన బంగారు సంస్థ ప్రకటించాయి. అలహాబాద్ మ్యూజియంలో ఉన్న ఒరిజినల్ దండంను కొత్తగా నిర్మించిన పార్లమెంటులో ఉంచబోతున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఒరిజినల్‌ను తలపించే విధంగా నమూనాతో మరో రాజ దండాన్ని ఆ సంస్థ తయారు చేయడం విశేషం.

రూ.400 కోట్లతో విద్యా రంగంలో పెట్టుబడులు

సాక్షి, చెన్నై: విద్యా రంగంలోని వివిధ విభాగాల్లో తమ సేవలను విస్తరించే విధంగా రూ. 400 కోట్ల పెట్టుబడులు పెట్టాలని వెరాండా లెర్నింగ్ సొల్యూషన్స్ నిర్ణయించింది. ఇందులో భాగంగా 7 సంస్థలను తమతో కలుపుకునేందుకు చర్యలు తీసుకుంది. ఈమేరకు ఆయా విద్యా విభాగాలలో పెట్టుబడులు విస్తృతం చేయనుంది. ఈ వివరాలను బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో వెరాండా చైర్మన్ సురేష్‌కల్పాతి ప్రకటించారు. అలాగే ఎఫ్‌వై23–24లో వెరాండా లెర్నింగ్‌కి సంబంధించిన ప్రొఫార్మా రూ.100 కోట్లకు చేరుకుంటుందని వివరించారు. విద్యకు ఉపయోగ పడే సహాయకాలు, బహుళ నిర్వహణ సేవలు, మేనేజ్‌మెంట్ సిస్టమ్, పర్యావరణ వ్యవస్థ, ఎడ్యుకేర్ వంటి సంఘాల నిర్మాణల దిశగా ముందుకెళ్తామన్నారు. పెట్టుబడిదారులతో భాగస్వామ్యం, అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి, విద్యా కోర్సులు, తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నామని వివరించారు.

చెట్టును బైక్ ఢీకొని సిద్ధ వైద్యుడు మృతి

అన్నానగర్: చెట్టును బైక్‌ను ఢీకొని ఓ సిద్ధ వైద్యుడు మృతిచెందాడు. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ సమీపంలోని కురువికులం సీఎస్ఐ చర్చి వీధికి చెందిన సత్యరాజు కుమారుడు జయకుమార్ (23). కేరళలో సిద్ధ వైద్యం కోర్సు పూర్తి చేశాడు. ఇతని స్నేహితుడు అదే ప్రాంతానికి చెందిన ఇన్నాసి ముత్తు కుమారుడు శివబాలన్ (19). పుత్తూరులోని కాలేజీలో క్యాటరింగ్ పూర్తి చేశాడు. ఈ స్థితిలో క్యాటరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ తీసుకునేందుకు శివబాలన్, జయకుమార్ బైకులో బుధవారం ఉదయం బయలుదేరారు. కోవిల్‌పట్టి నుంచి కలుగుమలై వెళుతుండగా కల్లూరని వద్దకు రాగానే బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన వున్న చింతచెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో జయకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. శివబాలన్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న నాలాట్టిన్ పుత్తూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జయకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవిల్‌పట్టి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడ్డ శివబాలన్‌ను నెల్లై ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈదలకుప్పంలో అర్జున తపస్సు



అర్జున తపస్సు ప్రదర్శిస్తున్న కళాకారులు

పళ్లిపట్టు: ఈదలకుప్పం ద్రౌపదీదేవి ఆలయ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంది. పళ్లిపట్టు సమీపంలోని నెడిగల్లు పంచాయతీలోని ఈదలకుప్పం పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ద్రౌపదీదేవి ఆలయ అగ్నిగుండ 10వ వార్షికోత్సవాన్ని 19న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ పగటి సమయాల్లో మహాభారత కథ, రాత్రి వేళల్లో వీధి నాటకాలు ప్రదర్శించారు. బుధవారం ఉదయం అర్జునుడు తపస్సు చేసే ఘట్టాన్ని కళాకారులు ప్రదర్శించారు. ఇందులో గ్రామీణులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారులు అర్జున తపస్సు ప్రదర్శనలో పాటలు ఆలపిస్తూ గ్రామీణులను ఆకట్టుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్లునాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు విజయవంతంగా చేశారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తారు.

చోరీ కేసులో దొంగ అరెస్ట్

తిరువొత్తియూరు: 70 సవర్ల చోరీ కేసులో దొంగ అరెస్టయ్యాడు. నామక్కల్ జిల్లా పుదుచత్రం యూనియన్ దత్తాతిరిపురం పంచాయతీ పరిధి ప్రాంతానికి చెందిన కృష్ణన్ (59). ఇతని భార్య వసంత. వీరికి కుమారుడు, కూతురు వున్నారు. అగరం బస్టాప్ ప్రాంతంలో వస్త్ర దుకాణం, ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్నాడు. ఇతని కుమార్తె పవిత్రకు పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో గత ఏడాది 4న సేలంకు వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టబడి ఉంది. బీరువాలో ఉంచిన 70 సవర్ల నగలు, రూ.72 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పుదుచత్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో బెంగళూరుకు చెందిన డేవిడ్ నేతృత్వంలోని ముఠా చోరీకి పాల్పడినట్లు తెలిసింది. పోలీసులు బెంగళూరులో లాడ్జీలో ఉన్న దొంగలను చుట్టుముట్టారు. డేవిడ్, అతని సహచరులు తప్పించుకున్నారు. అయితే మరో సహచరుడు కాంచీపురం జిల్లా వాలాజాబాద్‌కు చెందిన గోపి (43)ని పోలీసులు అరెస్ట్ చేశారు.

మెట్రో పనులకు రూ.533.87 కోట్ల ఒప్పందం

కొరుక్కుపేట: చెన్నై మెట్రో రైలు రెండవ దశ విద్యుత్ పనులకు ఒప్పందం కుదిరింది. లైన్ 3 (మాధవరం నుంచి షోలింగనల్లూరు వరకు), లైన్ 5 (మాధవరం నుంచి సీఎంపీడీ వరకు, మాదవరం వర్క్ సైట్ సహా) సబ్‌స్టేషన్, సబ్–బిల్డింగ్, అన్ని రకాల సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ సిస్టమ్, ఎలక్ట్రికల్ పనుల క్రాంటాక్టును ఎల్ అండ్ టీ సంస్థ రూ.533.87 కోట్లతో దక్కించుకుంది. ఈ మేరకు చెన్నై మెట్రో రైలు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గునార్ రాజేష్ చతుర్వేది, లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) ప్రతినిధి హెచ్ రాజేంద్రన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈమేరకు బుధవారం చెన్నై మెట్రో రైల్వే అడ్మినిస్ట్రేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్ వ్యవస్థ మొత్తం రూప కల్పన, నిరంతరాయ సేవలను అందించడానికి, సురక్షితమైన, స్థిరమైన శక్తిని అందిండంతోపాటు సమర్థవంతమైన విద్యుత్ వ్యవస్థ పనితీరుపై దృష్టి పెట్టనున్నారు. మెట్రో రూట్–లో 29 సబ్‌వే మెట్రోస్టేషన్లు, 10 ఎలివేటెడ్ మెట్రోస్టేషన్లు ఉన్నాయి. అలాగే మెట్రో రూట్–5లో ఆరు సబ్‌వే మెట్రోస్టేషన్లు, 11 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు ఉన్నాయి.

హత్య కేసులో కోడలు అరెస్ట్

- కోడలు, ఆమె ప్రియుడు అరెస్ట్

తిరువొత్తియూరు: విరుదాచలం సమీపంలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని అత్త, మామ సహా ముగ్గురిని సాంబారులో విషం పెట్టి హత్య చేసిన కోడలను, ఆమె ప్రియుడిని ఏడాది తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. కడలూరు జిల్లా విరుదాచలం సమీపం విల్లనేసూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం (60). ఇతని భార్య కొలింజియామాల్ (55). వీరి కుమారుడు వేల్ మురుగన్ (40). ఇతని భార్య గీత (33). ఈమె రిటైర్డ్ ఎస్ఐ పూమలై కుమార్తె గీత. వేల్‌మురుగన్‌కు అఖిలేశ్వర్ (12), శరవణ కృష్ణ (06) అని ఇద్దరు కుమారులు. 2021, డిసెంబర్ 29వ తేదీ కొలీంమాల్ ఇంట్లో ముల్లంగి సాంబార్ పెట్టారు. ఆ సాంబారుతో అన్నం కలుపుకుని సుబ్రమణ్యం, కొలింజియామాల్, మనవడు శరవణకృష్ణ, పక్కింటికి చెందిన ప్రభు కుమారుడు నితీశ్వరన్ (08), కుమార్తె ప్రియదర్శిని (04) సహా 8 మంది భోజనం చేశారు. కొంతసేపటికీ వారు స్పృహతప్పారు. దీంతో వెంటనే వారిని పుదుచ్చేరి జిప్మర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొలింజియామ్మల్, సుబ్రమణ్యం, నితీశ్వరన్ మృతిచెందారు. పోస్టుమార్టం రిపోర్టులో విషం కలిపిన అన్నం తినడం వలన వారు మృతి చెందినట్లు తెలిసింది. పోలీసుల విచారణలో వేల్‌మురుగన్ విదేశాలలో పనిచేస్తున్న క్రమంలో గీతకు విరుదాచలం పుదుకుప్పంకు చెందిన హరిహరన్ (43)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలిసి కొలంజి యమ్మాల్ కోడలను మందలించింది. దీంతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న కొలంజియమ్మాల్‌ను మామను అడ్డు తొలగించుకోవడానికి సంఘటన జరిగిన రోజున ముల్లంగి సాంబార్లో గీత విషం కలిపినట్లు తెలిసింది. ఏడాది తరువాత గీతను, హరిహరన్‌ను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు.

క్లుప్తంగా...

అమ్మను మరిపించేలా గురుకుల వసతి గృహాలు ఉండాలి

- మంత్రి చెల్లుబోయిన వేణు
- టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి చెల్లుబోయిన తదితరులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): అమ్మను మరిపించేలా గురుకుల వసతి గృహాలను ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం బీసీ సంక్షేమ వసతి గృహాల్లో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులను, వారికి సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను సత్కరించి ప్రశంస పత్రం, మెమెంటోలను అందజేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. మంత్రి మాట్లాడుతూ..ఈ ఏడాది టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ రెసిడెన్షియల్, హాస్టల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని..జాతీయ స్థాయిలో ఏపీ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకునేలా 21 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టామన్నారు. త్వరలో వీరిని ఐఐటీ, ఐఐఎంలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దుతామన్నారుకార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తదితరులు

అనంతపురం టవర్‌క్లాక్: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. బుధవారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇతోధికంగా నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. రోడ్ల అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. గోరంట్ల నుంచి అమరావతికి తక్కువ సమయంలో ప్రయాణం చేయడానికి ఆరు వరుసల రహదారిని మంజూరు చేసిందని తెలిపారు. అమరావతిలోనే రాజధాని ఉండాలని అక్కడి రైతులు కోరుతున్నారని చెప్పారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి ఇచ్చిన సహకారంపై శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు తెలియజేయనున్నామన్నారు. ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలిస్తామని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు చిరంజీవి రెడ్డి, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఈనాడు'పై చట్టపరమైన చర్యలు

- నిషేధిత కుల పదాన్ని ఇంటి పేరుగా ప్రచురించడం నేరం
- ఏపీ నాయీబ్రాహ్మణ నంద యువసేన అధ్యక్షుడు ఇంటూరి బాబ్జీనంద



గుంటూరు లీగల్: అసలు ఇంటి పేరును విస్మరించి, నిషేధిత కుల పదాన్ని ఇంటి పేరుగా కించపరిచేలా రాసిన 'ఈనాడు' దినపత్రికపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ నంద యువసేన అధ్యక్షుడు ఇంటూరి బాబ్జీనంద తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన 'ఈనాడు' కర్నూలు మెయిన్ ఎడిషన్ రెండో పేజీలో 'అవినాష్ తల్లి ఆరోగ్యం కొంత ఆందోళనకరం' వార్త ప్రచురితం అయిందని తెలిపారు. ఈ వార్తలో పులివెందుల వైఎస్సార్ సీపీ నాయకుడు దంతులూరి కృష్ణ పేరును మంగలి కృష్ణ అని కించ పరిచేలా, పరువు తీసేలా రాశారని ఆరోపించారు. దీని కారణంగా నాయీబ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతిన్నాయని చెప్పారు. 2022లో విడుదలైన జీవో నంబర్ 50 ద్వారా 'మంగలి' అనే పదాన్ని వినియోగించడాన్ని నిషేధించినట్లు తెలిపారు. నిషేధిత కుల పదాన్ని కృష్ణ ఇంటి పేరుగా రాసిన 'ఈనాడు'కు ఇప్పటికే లీగల్ నోటీసు పంపించినట్లు తెలిపారు. దీనిపై 'ఈనాడు' యాజమాన్యం స్పందించకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'ఈనాడు' కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని బాబ్జీనంద హెచ్చరించారు.

అధిక ఉష్ణోగ్రతలతో ఆక్వా రంగం ఉక్కిరిబిక్కిరి

- తలెత్తనున్న నీటి కాలుష్యం, ఆక్సిజన్ లేమి
- చేపలకు చెడ్డ కాలం
- రైతుల్లో ఆందోళన
- నేటి నుంచి రోహిణికార్తె



కైకలూరు: ఆక్వా రంగాన్ని అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికి తోడు రోహిణికార్తెతో గురువారం నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. చేపలు శీతల జలచరాలు. వీటికి అనుకూల స్థాయి నీటి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెంటీగ్రేట్ నుంచి 30 డిగ్రీల సెంటీగ్రేట్ మధ్య ఉంటాయి. ఇటీవల జిల్లాలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెంటీగ్రేట్ వరకు పెరిగాయి. ఈ పరిణామం చేపల, రొయ్యల రైతులను కలవరపెడుతోంది. చెరువుల్లో నీరు ఆవిరవడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి ఆక్సిజన్ లేమి, నీటి కాలుష్యం, విషవాయువుల ఉత్పత్తి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

2.60 లక్షల ఎకరాల్లో సాగు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో చేపలు, 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి చెరువుల్లో ఆక్సిజన్ సమస్యత తలెత్తుతోంది. సేంద్రియ పదార్థాలు చెరువు అడుగు భాగానికి చేరి విషతుల్యమవుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. చేపల్లో శ్వాసక్రియ సమస్య ఏర్పడి ముట్టెలు పైకెత్తి మృత్యువాతపడుతున్నాయి. వేసవిలో మూడు అడుగుల కంటే నీటిమట్టం తక్కువ ఉన్న చెరువుల్లో చేపల మరణాలు అధికమవుతాయి.



సమ్మర్ కిల్

ఎండాకాలంలో వాతావరణంలో సంభవించే మార్పుల వల్ల చేపలు చనిపోవడాన్ని సమ్మర్ కిల్ అంటారు. వేసవిలో సూర్యరశ్మి వల్ల చెరువుపై భాగంలో రెండడుగుల మేర నీరు వేడెక్కుతోంది. వేడి నీరు తేలికగా ఉంటుంది. అడుగు భాగాన చల్లగా ఉన్న నీరు బరువుగా ఉంటుంది. సమ్మర్ కిల్‌కి దారితీసే ప్రధాన అంశం ఇదే. చెరువుల్లో భౌతిక, రసాయన గుణాలున్న నీటి ఉష్ణోగ్రత, ప్లాంక్టాన్, ఆక్సిజన్, ఉదజని సూచిక విలువలు, కార్బన్ డయాక్సైడ్, అమ్మోనియా వంటి హానికర వాయువులు వివిధ లోతులలో వివిధ స్థాయిల్లో ఉంటాయి. నీటి ఉపరితలం నుంచి అడుక్కు వెళ్లే కొలదీ నీటి ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయి తగ్గిపోతాయి. దీంతో చేపలు మృత్యువాత పడతాయి.

నీటి పరీక్షలు చేయించాలి

వేసవిలో ఉష్ణోగ్రతల ప్రభావం చేపల సాగుపై పడుతోంది. ప్రధానంగా ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమవుతోంది. రైతులు ఆక్సిజన్ మాత్రలను అందుబాటులో ఉంచుకోవాలి. నీటి పరీక్షలు తరచుగా చేయించాలి. పీహెచ్ విలువలు తెలుసుకోవాలి. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో మత్స్యశాఖ సహాయకులను నియమించింది. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.

– ఎం.భవిత, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి, కైకలూరు

వేసవి వ్యాధులతో జాగ్రత్త

వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగటంతో ఆక్సిజన్ సమస్య చెరువుల్లో కనిపిస్తోంది. దీంతో చేపలకు శంఖుజలగ, రెడ్ డిసీజ్, పేను వంటి వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రధానంగా కోళ్ల ఎరువులను వేసవిలో మానివేయాలి. రొయ్యల చెరువుల మాదిరిగా చేపల చెరువుల్లోనూ ఆక్సిజన్ ఏరియాటర్లను ఏర్పాటు చేసుకోవాలి.

– దండు రంగరాజు, ఆక్వారైతు, కైకలూరు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చెరువులో మూడు అడుగులు లోతులో నీరు తగ్గకుండా చేయాలి.
- చేపల చెరువులో ఆక్సిజన్ సమస్య పరిష్కారానికి తెల్లవారుజామున మూడు నుంచి ఆరు గంటల వరకు నీటిని కలయతిప్పుతూ ఉండాలి.
- చెరువుల్లో కూడా ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ఏరియాటర్లును ఉపయోగించాలి.
- జియోలైట్, కాల్షియం పెరాక్సైడ్, ఆక్సిజన్ డబ్లెట్లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలి.
- చెరువుల్లో మేతలను సగానికి తగ్గించుకోవాలి.
- చెరువుల్లో పాతనీటి స్థానంలో అవకాశాన్ని బట్టి కొత్త నీటిని నింపుకోవాలి.
- చెరువుపై పక్షులు ఎక్కువగా సంచరిస్తుంటే ఎక్కడైనా చేపల మరణించాయా అనే విషయాన్ని గమనించాలి.
- ఆక్సిజన్ సమస్యను అధికమించడానికి చెరువులో నీటిని యంత్రాల ద్వారా తిరిగే అదే చెరువులోకి నింపే పద్ధతిని అనుసరించవచ్చు.
- చెరువులో నీటి, మట్టి పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించాలి.

నమూనా రాకెట్ ప్రయోగాలు చేసిన విద్యార్థులు

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 16 నుంచి నిర్వహిస్తోన్న యువికా–2023 యంగ్‌సైంటిస్ట్ ప్రోగ్రాంలో భాగంగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ వ్యూ గ్యాలరీ ప్రాంతంలో బుధవారం విద్యార్థులతో నమూనా రాకెట్ ప్రయోగాలను చేయించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో సెంటర్లలోని 7 కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా 8, 9 తరగతులు చదువుతూ ఎంతో ప్రతిభ ఉన్న 353 మంది విద్యార్థులను దీనికి ఎంపిక చేశారు. ఇందులో షార్ కేంద్రానికి 56 మందిని పంపించారు. అంతరిక్ష ప్రయోగాలపై వారికి ఆసక్తిని పెంచేందుకు అవసరమైన కార్యక్రమాలన్నింటినీ నిర్వహించి మోడల్ రాకెట్లను ప్రయోగించే కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం చిన్న మోడల్ రాకెట్లను తయారు చేసి వాటిని ప్రయోగించి వారిని ఉత్సాహపరిచారు. షార్ కేంద్రంలోని ప్రయోగవేదికలు, లాంచింగ్ సౌకర్యాలపై షార్ ఇంజినీర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు.



లాంచ్ వ్యూ గ్యాలరీలో మోడల్ రాకెట్లను ఎగురవేస్తున్న విద్యార్థులు, షార్ ఇంజినీర్లు

ప్రాణాపాయంలో ప్రథమ చికిత్సతో రక్షణ

- విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ
- రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రాణాపాయంలో ఉన్నప్పుడు వారికి తక్షణమే అందించే ప్రథమ చికిత్సే వారి ప్రాణాలను నిలుపుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్(హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్)లో పనిచేసే మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)లకు ప్రథమ చికిత్సలో మెలకువలు, నైపుణ్యం పెంపొందించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కకాటు, పాము కాటుకు గురవుతుంటారు. అలాగే పురుగు మందు తాగిన వారికి, పురుగు మందులు పిచికారీ చేస్తూ దాని ప్రభావానికి గురైన వారికి, వడదెబ్బ, గుండెపోటు వంటి ఇతర ప్రాణాంతక సమయంలో వచ్చిన వారికి మెరుగైన చికిత్స పొందేలోపు అందించాల్సిన ప్రథమ చికిత్సపై నిపుణులైన వైద్యులు, నర్సింగ్ ట్యూటర్స్ అవగాహన కల్పించారు. ఎన్టీఆర్ జిల్లాలో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 257 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లు ఉన్నాయి. వాటిలో నర్సింగ్ బీఎస్సీ చేసిన వారు ఎంఎల్‌హెచ్‌పీలుగా పనిచేస్తున్నారు. వీరికి ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 40 మందిని ఎంపిక చేశారు. ఇలా ఎన్టీఆర్ జిల్లాలో పనిచేస్తున్న వారికి ఆరు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి మాచర్ల సుహాసిని మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

చల్ చల్ గుర్రం!

గుర్రం స్వారీపై యువత, చిన్నారుల ఆసక్తి

- వేసవి సెలవులు కావడంతో హార్స్ రైడింగ్‌పై దృష్టి
- సముద్ర తీర ప్రాంతాల్లో వెలుస్తున్న శిక్షణ కేంద్రాలు



గుర్రపు స్వారీలో శిక్షణ పొందుతున్న యువకులు

పిఠాపురం: గుర్రపు స్వారీ అనేది ఆటవిడుపు, సాహస క్రీడ. ప్రస్తుతం ఇది ట్రెండ్‌గా మారింది. యువతతో పాటు చిన్న పిల్లలు కూడా గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు హార్స్ రైడింగ్‌లో శిక్షణ ఇప్పించి.. వారు గుర్రాలపై స్వారీ చేస్తుంటే.. చూసి ముచ్చటపడుతున్నారు. యువత, చిన్నారుల తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా హార్స్ రైడింగ్ ట్రైనింగ్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 100 మంది 250 గుర్రాల వరకూ పెంచుతున్నారంటే.. గుర్రపు స్వారీపై యువత ఆసక్తి ఏంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాలు వెలిశాయి. గతంలో గుర్రపు స్వారీ నేర్చుకోవాలంటే పెద్ద పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఓ మోస్తరు పట్టణాల్లోనూ శిక్షణ కేంద్రాలు వెలుస్తున్నాయి. వేసవి కావడంతో యువతతో పాటు చిన్నారులు కూడా గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి మేలు

గుర్రపు స్వారీ అనేది పలు మానసిక, శారీరక సమస్యలకు సంజీవనిలా పనిచేస్తుంది. పోలియో, పక్షవాతం, మెదడు, వెన్నెముక సమస్యలు, వినికిడి లోపాలు, భావవ్యక్తీకరణ, స్థిమితం కోల్పోవడం వంటి వాటికి చక్కటి చికిత్సగా పనిచేస్తుంది. ముఖ్యంగా మానసిక వికాసం లోపించిన పిల్లలకు మంచి ఫలితాలనిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు గుర్రపు స్వారీ చేయడం వల్ల వారి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. గుర్రం కళ్లెం పట్టుకోవడం, నిటారుగా కూర్చోవడం, అశ్వాన్ని దూమికించడం, ఒకే లయలో ముందుకుసాగడం వంటి చర్యల వల్ల మెదడుకి, శరీరానికి మధ్య సమన్వయం ఏర్పడి మానసిక ఉత్తేజం కలుగుతుందని.. ఫలితంగా అనేక రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయని చెబుతున్నారు.

గుర్రపు స్వారీకి అనువైన ప్రాంతంగా తీరం

గుర్రపు స్వారీ అనేది సాహస క్రీడ. ప్రమాదాలకు ఎక్కువ అవకాశాలున్నాయి. అందుకే ఎలాంటి ప్రమాదాలు జరిగినా రైడర్‌కు ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. గట్టి నేలల్లో ప్రమాదాలకు ఎక్కువ అవకాశం ఉండటంతో ఇసుక నేలల్లోనే నేర్పాల్సి ఉంటుంది. దీని కోసం ప్రత్యేకంగా ఇసుకను తెచ్చి వేస్తుంటారు. అలాంటి పరిస్థితి లేకుండా తీర ప్రాంతాల్లో ఉన్న ఇసుక మేటలు గుర్రపు స్వారీలకు అనుకూలంగా ఉండటంతో కాకినాడ తీరం ప్రాంతంలో ఉన్న ఇసుక నేలల్లో గత నెల రోజులుగా గుర్రపు స్వారీ శిక్షణ ఇస్తున్నాము. రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున నేర్పుతున్నాము.

– కె.అనిల్‌రెడ్డి, గుర్రపు స్వారీ శిక్షకుడు, కాకినాడ



గుర్రంపై స్వారీ చేస్తున్న సీహెచ్ సమీక్ష

చాలా సరదాగా ఉంది..

మా నాన్న ఆడుకునేందుకు నాకు గుర్రపు బొమ్మ కొనిచ్చాడు. ఇది వద్దు.. నిజంగా గుర్రం మీద స్వారీ చేయాలని అడిగేవాడిని. అది ఇప్పుడు నిజమైంది. గుర్రంపై సవారీ చేయడం చాలా సరదాగా ఉంది. ముందు భయమేసినా రానురాను అలవాటైపోయింది. ఇప్పుడు ఏ భయం లేకుండా గుర్రంపై స్వారీ చేస్తున్నా.

– ఆరుష్‌వర్మ, కాకినాడ



చిన్ననాటి కల నేరవేరిందిలా..

ఎప్పటి నుంచో గుర్రపు స్వారీ చేయాలన్న కోరిక ఉండేది. శిక్షణ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటి వరకూ కుదరలేదు. కాకినాడ తీరంలో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఆ కోరిక ఇలా తీరింది. గుర్రపు స్వారీ చేయడం చాలా ఆనందంగా ఉంది. శిక్షణ పొందిన గుర్రాలు కావడంతో ఎలాంటి ప్రమాదం లేకుండా నేర్చుకుంటున్నాను.

– అభిషేక్, కాకినాడ

టీడీపీ నేత కుంచే నానిపై కిడ్నాప్ కేసు

- మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు ముఖ్య అనుచరుడు
- అప్పు కట్టడం లేదంటూ బాధితుడి కిడ్నాప్
- రెండు గంటల పాటు బంధించి హింస
- పరారీలో నిందితులు.. పోలీసుల గాలింపు



రాష్ట్ర మాజీ మంత్రి కొల్లు రవీంద్రతో కుంచే నాని (ఫైల్)

కోనేరుసెంటర్ (మచిలీపట్నం): తెలుగుదేశం పార్టీలో అతనో ముఖ్య నాయకుడు.. అంతకు మించి చెప్పాలంటే రాష్ట్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్రకు ముఖ్య అనుచరుడు.. గత ప్రభుత్వంలో వడ్డీ వ్యాపారం పేరుతో అనేక మందిని హింసించిన ఆ నాయకుడు ఆ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అదే పంథాను కొనసాగిస్తూ పేదల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాడు. వడ్డీలు కట్టలేని వారిని బంధించి బాదటంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నాడు.. గతంలో అనేక మంది అతని వడ్డీ వేధింపులకు బాధితులు కాగా ఇప్పుడు మరో బాధితుడు ఆ నాయకుడిపై కిడ్నాప్ కేసు పెట్టాడు. వివాల్లోకి వెళితే.. కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన టీడీపీ నేత కుంచే నాని వద్ద వర్రేగూడెంకు చెందిన ఎస్కే అమీన్ అలియాస్ మున్నా కుటుంబ సభ్యులు ఆర్థిక అవసరాల నిమిత్తం 2014లో రూ.4 లక్షల అప్పు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తూ వస్తున్నారు. ఇటీవల ఆర్థిక పరిస్థితులు అంతగా బాగోకపోవడంతో అమీన్ కుటుంబం కొన్ని నెలలుగా వడ్డీ చెలించడం లేదు. దీంతో ఆగ్రహానికి గురైన కుంచే నాని తాతా సురేష్ అనే వ్యక్తి సహాయంతో బుధవారం అమీన్ ఇంటికి వెళ్లి అందరూ చూస్తుండగా అతన్ని దుర్భాషలాడి బలవంతంగా బైక్ ఎక్కించుకుని బైపాస్‌రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీకి తీసుకువెళ్లాడు. అక్కడ ఓ ఇంట్లో అమీన్‌ను బంధించి అప్పు కట్టే వరకు వదిలేది లేదంటూ భీష్మించాడు. అతనిపై కర్రలతో దాడి చేశారు. జేబులో నగదు బలవంతంగా తీసుకుని సుమారు రెండు గంటల పాటు హింసించారు. అక్కడి నుంచి బయట పడిన అమీన్ నేరుగా ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కుంచే నాని, తాతా సురేష్‌పై ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కుంచే నాని, తాతా సురేష్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఫిరోజ్ తెలిపారు.కాగా విషయం తెలుసుకున్న ఇరువురూ నిందితులు పోలీసుల కంటపడకుండా తిరుగుతున్నారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి కుంచే నాని, సురేష్ కోసం గాలిస్తున్నట్లు సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

లోన్ యాప్ కేసులో ఇద్దరు విదేశీయులతో సహా ముగ్గురు అరెస్టు

సినీఫక్కీలో భారత్ రప్పించిన జిల్లా పోలీసులు



వివరాలు తెలుపుతున్న జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): లోన్ యాప్ ద్వారా రుణగ్రహీతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ మరణాలకు కారణమౌతున్న ఇద్దరు విదేశీయులను, తమిళనాడుకు చెందిన మరో వ్యక్తిని జిల్లా పోలీసులు చెన్నైలో అరెస్టు చేశారు. దీనికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి రాజమహేంద్రవరంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో మంగళారం వివరాలు వెల్లడించారు. ఈనెల ఆరో తేదీన లోన్‌యాప్ బారిన పడి కడియం భాస్కర్‌నగర్‌కు చెందిన హరికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అతని తండ్రి సురకాసుల శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో కొద్దిరోజుల క్రితం ఢిల్లీకి చెందిన హరిఓం, బెంగళూరుకు చెందిన మంజునాథ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో మలేషియాకు చెందిన అంతర్జాతీయ ముద్దాయిలున్నట్లు తేలింది. వీరిని మలేషియాకు చెందిన యంగ్ లుయ్ క్షింగ్, ఛూక్సై లున్, తమిళనాడుకు చెందిన త్యాగరాజన్ కాసేలుగా గుర్తించారు. ఆన్‌లైన్‌లో వీరి సహచరులుగా 20 రోజులు చాట్ చేశారు. పెద్ద బిజినెస్ వస్తుందని చెప్పారు. వారిని నమ్మించి భారత్‌కు రప్పించారు. ఎయిర్‌పోర్ట్‌లో వారితో చాటింగ్ చేసిన వ్యక్తి ఎదురుపడ్డాడు. పెద్ద బిజినెస్ ఇస్తున్న కారణంగా అతనికి వారు ఎయిర్‌పోర్ట్‌లోనే విదేశీమద్యం బాటిల్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. అదే సమయంలో అక్కడ మాటు వేసిన జిల్లా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి వెంటనే నాలుగు పాస్‌పోర్ట్‌లను, ఆరు సెల్‌ఫోన్లు, విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇంకా డబ్ల్యూరిచ్‌మోడ్ అనే మలేషియా వ్యక్తి ఉన్నట్లు సమాచారం. అదే విధంగా రాజమహేంద్రవరంలో జరిగిన లోన్‌యాప్ ఘటనలో దేశంలో ఉన్న యాప్ ఆపరేటింగ్ చేసే వారిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

సాక్షి
ఫ్యామిలీ
చెన్నై
గురువారం ॥ 25-5-2023





రోహిణి కార్తె

నేటి నుంచి రోహిణి కార్తె. రోళ్లు పగులుతాయని ప్రతీతి.
ఇంకో రెండు వారాలు ఉగ్ర ఉష్ణాన్ని ఎదుర్కొనక తప్పదు.
కాని ప్రతిదానికి ప్రకృతిలో విరుగుడు ఉంటుంది.
మార్కెట్‌ను ముంజెలు ముంచెత్తుతున్నాయి.
ఎండకు జవాబుగా తమను జుర్రుకోమంటున్నాయి.
పెద్దవాళ్లు వీటిని మర్చిపోయారు. పిల్లలు చులకనగా చూస్తున్నారు.
కాని ముంజె చేసే మేలు తల్లి కూడా చేయదు.
కుటుంబాన్ని కాపాడే శక్తి దీనికి ఉంది. అంతేనా?
ఈ ముంజెల చుట్టూ అందరికీ ఎన్నో జ్ఞాపకాలు.

చల్లగా తినండి ఎండను జయించండి

ఇప్పుడు కాదులెండి... ముప్పై నలభై ఏళ్ల కింద మంచి ఎండ పూట వీధుల్లో 'తాటి ముంజెలో తాటి ముంజెలో' అని అరుపు వినిపిస్తే వంట పనిలోనో, అన్నాలు అయ్యాక కునుకులోకి వెళ్లబోతో ఉన్న అమ్మ, నానమ్మ, ఇంటికి భోజనానికి వచ్చిన నాన్న... 'పిలువు... పిలువు' అని పిల్లల్ని పురమాయించేవారు. పిల్లలు పరిగెత్తుకొని బయటకు వెళితే ఎవరో ఒక గ్రామీణుడు కావడిబద్దకు చెరొకవైపు ముంజెలు కట్టిన లేత తాటాకు కట్టలతో కనిపించేవాడు. 12 తాటి ముంజెల కట్టది ఒక రేటు. 24 తాటి ముంజెల కట్టది ఒక రేటు. గీచి గీచి బేరం తెగ్గొట్టాక, ఇంట్లోకి తెచ్చి కట్ట విప్పితే అన్నీ లేతగా ఉంటే అదృష్టం. ముదురు ఎక్కువగా ఉండే నష్టం. అమ్మ తాటిముంజెల చెక్కు తీసి, స్టీలు గిన్నెలో వాటిలో నుంచి నీరు చిమ్ముతూ ఉండగా ముక్కలుగా కోసి, కొద్దిగా చెక్కెర జల్లి మూతేసి పెట్టి (ఇప్పుడు ఫ్రిజ్‌లో పెట్టి) 'నిద్ర పోయి లేచాక తిందాం' అని చెప్తే నిద్ర పడితే కదా. మధ్యాహ్నం కునుకు పూర్తి కాకముందే ఆ తాటి ముంజెల్ని గబగబా తింటూ ఆఖరున ఆ చెక్కెర నీరు తాగుతూ ఉంటే ఎంతో హాయి మరెంతో రుచి ఇంకెంతో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయేది.

★★★

పల్లెల్లో ఎక్కడ పడితే అక్కడ తాటి చెట్లు, వాటిక్కాసిన గెలలు దొరుకుతాయి. తాటిచెట్టు ఎక్కడం ఆర్ట్. రాకపోతే ఒళ్లు చెక్కుకుపోతుంది. ఎక్కగలిగినవాడు కొడవలి విసిరి గెల కిందకు తెస్తే అల్లరి పిల్లలు మూగి చెక్కిన తాటి కాయల్లో నుంచి తొంగి చూసే కన్నులను కుడివేలు బొటన వేలుతో జుర్రేసి మింగేసేవారు. ఒక్కొక్కరు ఐదు పది కాయలను కూడా జుర్రేసేవారు. ఇక ఎంత ఎండలో ఆడినా డీహైడ్రేషన్ అవడం అసాధ్యం. వడదెబ్బ అసంభవం. కడుపులో చేరిన లేత నీరు అలాంటిది.

★★★

పట్నాల్లో ఎడ్ల బండ్లలో తాటి గెలలు తెచ్చి రోడ్డుకు ఒకవైపున బండి ఆపి తాటికాయలను కొట్టి ఒక్కో కాయ ఇంత అని అమ్ముతూ ఉంటే పిల్లలు తెగమూగేవారు. పెద్దలు అక్కడిక్కడ తిని డిప్పల్ని పారేసేవారు. పిల్లలు ఆ ఖాళీ డిప్పల్లో కాస్త పెద్దవాటిని రెండు ఎంచుకుని ఒక పుల్లతో అనుసంధానించి తాడు కట్టి లాగుతూ తాటిబండి ఆట ఆడుకునేవారు. వేసవిని పంపిన భగవంతుడు తాటిచెట్టు చిటారుకొమ్మన తాటి గెలలను పెట్టి వాటిలో ముంజెలను పెట్టి ఆ ముంజెల్లో తియ్యటి నీరును పెట్టడమే దయకు సూచన. కరుణకు ఆనవాలు.



★★★

తాటి ముంజెలు పిల్లలు, పెద్దలు, గర్భిణులు, బాలింతలు అందరూ తినొచ్చు. తినాలి. వేసవిలో ఉష్ణం వల్ల ఆమ్ల, క్షార గుణాల్లో తేడా వచ్చి శరీరంలో విషకారకాలు ఉత్పన్నం అవుతాయి. వాటిని నిర్మూలం చేయాలంటే తాటి ముంజెలకు మించినవి లేవు. శరీరంలో కోల్పోయిన నీటిని ముంజెలు సమతులం చేస్తాయి. ఒంటికి చలువనిస్తాయి. కోవిడ్ అనంతర నీరసంలాంటి సమస్యలను, అలసటను తరిమికొట్టే శక్తి ముంజెలకు ఉంది. అవి మార్కెట్‌లో కనపడేనన్ని రోజులు తరచూ తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి తెచ్చుకోవచ్చు. లేత తాటిముంజెల్లో ఉన్న నీరు మినరల్ వాటర్‌తో సమానం. తాటి ముంజెలు జీర్ణ శక్తికి అద్భుతంగా తోడ్పడతాయి. కడుపు ఉబ్బరం, ఎసిడిటీ ఉన్నవారు ఉదయాన్నే గ్యాస్ నిండినట్టుగా భావించేవారు లేత ముంజెలు తింటే చాలా మంచిది. గర్భిణులు తింటే తల్లికి, లోపల ఉన్న బిడ్డకు మంచిది. ఈ విషయాన్ని తమిళనాడుకు చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనతో తేల్చారు.

★★★

రోహిణి కార్తెలో వడదెబ్బ తగలకుండా ముంజెలు కాపాడతాయి. వికారం ఉంటే పోగొడతాయి. తట్టు, పొంగులను నివారిస్తాయి. కాలేయాన్ని ఉత్సాహపరుస్తాయి. అధిక బరువు ఉన్నవారు వీటిని ఒక పూట ఆహారంగా తీసుకుంటే (వీటితో పాటు ఒక పండు తింటే) బరువు తగ్గుతారు. సీజన్‌లో వచ్చే ఫలాలు ఆ సీజన్‌లో వచ్చే సమస్యలను దూరం చేస్తాయని అందరికీ తెలుసు. వేసవిలో వచ్చే ముంజెలు వేసవి సమస్యలకు సమాధానం చెప్తాయి.

★★★

ముదురు తాటిముంజెలు తినకూడదు. పిల్లలకు పెట్టకూడదు. కడుపునొప్పి వస్తుంది. ఇప్పుడు మార్కెట్‌లో పాలిథిన్ కవర్లలో ముంజెలు అమ్ముతున్నారు. పిల్లలు పోజులకు పోయినా తప్పనిసరిగా తినిపించాలి. వీటిని ఇంగ్లిష్‌లో 'ఐస్ యాపిల్స్' అంటారని చెప్తే పేరు నచ్చయినా తింటారు.

చల్లగా తినండి. ఎండను జయించండి.

డాక్టరేట్ కలను 'సెల్ఫ్ హెల్ప్' నెరవేర్చింది

కుగ్రామం నుంచి ఈ కామర్స్ దాకా నారాయణమ్మ విజయగాథ

నారాయణమ్మ నీరగంటి... ఆంధ్రప్రదేశ్, సత్యసాయి జిల్లాలోని ముష్టి కోవెల అనే చిన్న గ్రామంలో అత్యంత సామాన్యమైన కుటుంబంలో పుట్టిన మహిళ. చదువంతా ప్రభుత్వ విద్యా వ్యవస్థలోనే. ఆమె ఈ రోజు ఒక 'ఈ కామర్స్' సంస్థను స్థాపించి తోటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి కావాలనే తన కలను నిజం చేసుకోవడానికి పీహెచ్‌డీలో చేరారు. త్వరలో పట్టానందుకోనున్న నారాయణమ్మ తన ఆకాంక్షల సుమహారాన్ని సాక్షితో పంచుకున్నారు.



డ్వాక్రా దారి చూపింది

''మా నాన్న రైతు. పిల్లల్ని బాగా చదివించాలనే కోరిక మాత్రం బలంగా ఉండేది. ఐదవ తరగతి వరకు మా ఊరి బడిలో చదివాను. ఆరు, ఏడు తరగతులకు ఉదయం ఐదు కిలోమీటర్లు, సాయంత్రం ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వచ్చింది. దాంతో అనంతపురంలో ఒక చిన్న గది అద్దెకు తీసుకుని నన్ను, మా అన్నను చదివించారాయన. అలా ఎనిమిదవ తరగతి నుంచి నేను ఇంటి పని, వంట పని చేసుకుంటూ చదువుకున్నాను. అనంతపూర్‌లో డిగ్రీ పూర్తయిన తర్వాత ఎంబీఏకి ఆళ్లగడ్డ వెళ్లాను. ఆ తర్వాత పెళ్లితో హైదరాబాద్ రావడం నా ఉస్మానియా కల నెరవేరడానికి మార్గం సుగమం చేసింది. అధ్యయనానికి విద్యాసంవత్సరంలో 'సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ అండ్ చాలెంజెస్' అంశాన్ని తీసుకున్నాను. 2010-11 నుంచి రంగారెడ్డి, సత్యసాయి జిల్లాల్లో డ్వాక్రా సంఘాలను అధ్యయనం చేశాను. మొత్తం ఐదు వందల గ్రూపుల కార్యకలాపాలను తెలుసుకున్న తర్వాత గ్రామీణ మహిళల్లో ఉన్న నైపుణ్యాలు, అవకాశాల మీద ఒక అవగాహన వచ్చింది. ఆర్థిక స్వావలంబనను, స్వయంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడాన్ని ఆస్వాదిస్తున్నారు. దాంతో వారిలో ఆత్మవిశ్వాసం కూడా మెరుగైంది. అవకాశాలు అందివస్తే ఇంకా ఏదో సాధించాలనే తపన కూడా కొందరిలో ఉంది. అలాంటి అభిరుచి ఉన్న వాళ్లకు వనరులు, ప్రభుత్వ అధికారుల సహకారం ఉంటే అద్భుతాలు చేయగలుగుతారు కూడా. ఇలాంటి సమన్వయం కొన్ని చోట్ల లేకపోవడం కూడా గమనించాను. మొత్తానికి మార్కెటింగ్ గురించిన ఆందోళన లేకపోతే ఉత్పత్తి విషయంలో శ్రమించడానికి వాళ్లు వెనుకాడరు. నా అధ్యయనం ఇలా సాగుతున్న సమయంలోనే కరోనా వచ్చింది.

కరోనా కొల్లగొట్టింది

కరోనా సమయంలో హోటళ్లతో సహా అన్నీ మూత పడడంతో ఉద్యోగాలు లేక ఏదో ఒక పని దొరికితే చాలన్నట్లు చాలా మంది కనిపించారు. శ్రమించే చేతులున్నాయి, ఆ ఉత్పత్తి అవసరమైన వ్యక్తులున్నారు. వాళ్ల మధ్య కరోనా కరాళ నృత్యం చేస్తోంది. అప్పుడు ఈ కామర్స్ రంగంలో ఓ ప్రయత్నం చేశాను. కర్పూరం తయారీదారుల నుంచి కర్పూరాన్ని డిజిటల్ మార్కెటింగ్ ద్వారా ఇంటింటికీ చేర్చడంలో విజయవంతమయ్యాను. మీషోలో సరదాగా మొదలు పెట్టిన రీ సేల్ అనుభవమూ తోడైంది. నా మార్కెట్‌ను విస్తరించడానికి శాన్విస్ స్టోర్, భవిత శ్రీ ట్రేడింగ్, ఫ్యాషన్, లేజీ షాపింగ్ వాణిజ్య వేదికలతో సెల్లర్‌గా అమెజాన్‌తో అనుసంధానమయ్యాను. ఆ అనుభవంతో గత ఏడాది నవంబర్‌లో మీథాట్ ఈ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సొంత కంపెనీ ప్రారంభించాను. ఏడాది కోటి రూపాయల టర్నోవర్‌కు చేరుతుందని అంచనా. ఏడాదికి నికర లాభం ఏడెనిమిది లక్షలుండవచ్చు.

ఎక్కడి ఆర్డర్‌కి అక్కడే పరిష్కారం

ఆహారం మీద ప్రత్యేక దృష్టి పెట్టాను. నగరాల్లో మహిళలందరూ ఏదో ఒక ఉద్యోగం, వ్యాపారాల్లో నిమగ్నమై ఉంటున్నారు. పిల్లలకు మన రుచులను ఇంట్లో చేసి పెట్టడం వాళ్లకు కష్టమే. అందుకే సౌత్ ఇండియన్ స్నాక్స్ హోమ్‌మేడ్‌వి అందిస్తున్నాను. నా నెట్‌వర్క్‌లో 30కి పైగా మహిళలున్నారు. ఒక ప్రదేశం నుంచి ఆర్డర్ రాగానే అదే ప్రదేశంలో ఉన్న మహిళకు ఫార్వర్డ్ చేస్తాను. మెటీరియల్ కొనుగోలు, ఆమె శ్రమకు వేతనం ఇస్తాను. ఆమె పిండివంటలు తయారు చేసి ప్యాక్ చేసి ఉంచుతుంది. మా కొరియర్ నెట్‌వర్క్ వాళ్లు ఆమె ఇంటికి వెళ్లి పార్సిల్‌ను కలెక్ట్ చేసుకుని కొరియర్ ఆర్డర్ ఇచ్చిన వినియోగదారులకు చేరుస్తారు. దాంతో పిండివంటలు తయారు చేసిన రోజే అందుతుండడంతో బాగా క్లిక్ అయింది.



గ్రామాలకు విస్తరించాలి

ఇప్పటి వరకు నా నెట్‌వర్క్ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అనంతపూర్, చిత్తూరు, గుంటూరు వంటి కొన్ని చోట్లలోనే ఉంది. ఇక గ్రామాల్లో ఉండే డ్వాక్రా మహిళలను అనుసంధానం చేయాలి. ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రాజెక్ట్ గ్రామాల్లో పెట్టాలనేది నా ఆలోచన. ఒక కుటుంబానికి అవసరమైన ప్రతి వస్తువూ నా ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్ మీద లభించేటట్లు పటిష్ఠం చేయాలి. అలాగే విదేశాలకు సీమంతం కిట్, ఒడిబియ్యం కిట్, గర్భిణి తినాల్సిన పిండివంటలను ఎగుమతి చేయాలి. ఈ సర్వీస్ ఈ కామర్స్‌లో లేదు. ఈ కామర్స్ వేదిక లైసెన్స్, ట్రేడ్‌మార్క్, కాపీ రైట్స్, పేటెంట్‌లు, ఫుడ్ లైసెన్స్, వెబ్‌సైట్ నిర్మాణం, ప్రమోషన్ కోసం మూడు లక్షల వరకు ఖర్చు చేశాను. ఇవన్నీ ఇందులోకి వచ్చిన తర్వాత నేర్చుకున్నాను. నా ఈ ప్రయత్నంలో గృహిణులు, ఒంటరి మహిళలు, అరవై నిండిన పెద్దవాళ్లు కూడా ఉపాధి పొందుతున్నారు.

ఉపాధినిస్తోంది

మూడేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత పీహెచ్‌డీ కోసం ఉద్యోగం మానుకున్నాను. ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరతానని అప్పుడనుకోలేదు. లెక్చరర్‌గా భర్త సంపాదనకు తోడు నేనూ ఉద్యోగం చేసుకుంటూ , ఇద్దరమ్మాయిలను పెంచుకుంటూ ప్రశాంతంగా ఉండవచ్చు. కానీ నేను చేసిన ఎంబీయే ఫైనాన్స్, సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల మీద పీహెచ్‌డీ నన్ను చిన్న పరిధిలో ఉంచడానికి ఇష్టపడలేదు. ఈ సాహసానికి ఒడిగట్టేలా ప్రోత్సహించాయి. మా గైడ్ శ్రీరాములు గారి పర్యవేక్షణలో నా పరిశోధన పూర్తయింది. డాక్టర్ నారాయణమ్మ అనే పేరు నా చిన్నప్పటి కల'' అన్నారు నారాయణమ్మ. కల నెరవేరుతున్న ఆనందం ఆమె కళ్లలో కనిపించింది, ఆ మాట చెప్తున్నప్పుడు ఆ స్వరంలో ఆనందం తొణికిసలాడింది.

– వాకా మంజులారెడ్డి

విభిన్న

పుష్ప విలాస శోభితం

తమను నిర్లక్ష్యంగా తొక్కుకుంటూ వెళ్లే పాదు కాళ్లపై...
'అక్కట!' అని ఆగ్రహం ప్రకటించాయి 'పుష్ప విలాపం' కావ్యంలోని పసి పుష్పాలు.
హేమలతా ప్రధాన్ చిత్రాలలో మాత్రం వర్ణశోభితమైన పుష్ప విలాసం కనిపిస్తుంది.
ఆ చిత్రాలు మనల్ని ప్రకృతి ప్రపంచానికి దగ్గర చేస్తాయి.
పర్యావరణ సంరక్షణపై దృష్టి పెట్టేలా చేస్తాయి....



హేమలతా ప్రధాన్

సిక్కిం–డార్జిలింగ్ హిమాలయ ప్రాంతంలో పూలసాగు, పండ్ల సాగు, కూరగాయల సాగులో ఆరితేరిన కుటుంబంలో పుట్టింది హేమలత ప్రధాన్. చిన్నప్పటి నుంచి మొక్కలు అంటే ఎంతో ఇష్టం. రెల్లీ నది సమీప అటవీ ప్రాంతంలో ఎన్నో మొక్కలు ఆమెకు నేస్తాలు.

మొక్కలపై ప్రేమతో తనదైన దారిని నిర్మించుకొని బొటానికల్ ఆర్టిస్ట్‌గా ఎదిగింది హేమలత.

హిమాలయ పర్వత ప్రాంతాలలోని అరుదైన మొక్కలు, పుష్పాలు హేమలత కుంచెలో కొత్త సొగసులు దిద్దుకుంటాయి. తన పెయింటింగ్‌తో తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది హేమలత. ఆమె గీసిన హిమాలయాల్లోని నెర్విల్లా ఆర్కిడ్ చిత్రం టోక్యోలో జరిగిన జపాన్ గ్రాండ్ ప్రిక్స్ ఆర్కిడ్ ఫెస్టివల్‌లో అవార్డ్ అందుకుంది. ఈ అంతర్జాతీయ స్థాయి అవార్డ్ తన ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. మరింత సాధన చేసేలా చేసింది.

హిమాలయ పుష్పాలపై ఆమె గీసిన ఎన్నో కలర్ పెయింటింగ్స్ లెక్కలేనన్ని బహుమతులు గెలుచుకున్నాయి. రాయల్ హార్టికల్చరల్ సొసైటీ (బ్రిటన్) బంగారు పతకం పొందిన తొలి భారతీయ మహిళా ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందింది హేమలత.

హేమలత గీసిన ఆర్కిడ్ చిత్రాలు భూటాన్ పోస్టేజ్ స్టాంప్‌లపై కొలువుదీరాయి. హిమాలయప్రాంతంలో మహిళా బొటానికల్ ఆర్టిస్ట్‌లు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఒకరు హేమలత. మరొకరు ఖట్మాండ్‌లోని నీరా జోషి.

ఆర్ట్ టీచర్‌గా కలిమ్‌పోంగ్ (పశ్చిమ బెంగాల్) జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలోని పిల్లలకు తన కళను దగ్గర చేస్తోంది హేమలత. కేవలం చిత్రకళకే పరిమితం కాకుండా హిమాలయాలలోని మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణ సంబంధిత విషయాలు కూడా వారికి విడమరచి చెబుతుంది.





పిల్లలకు ప్రకృతి కళను దగ్గర చేస్తూ...

గత సంవత్సరం హిమాలయన్ ట్రస్ట్ ఫర్ నేచురల్ హిస్టరీ ఆర్ట్(హెచ్‌టీఎన్‌హెచ్‌ఏ)కు శ్రీకారం చుట్టింది హేమలత. క్షేత్రస్థాయిలో చిత్రకళ, విద్య, పర్యావరణ స్పృహను మిళితం చేయాలనేది ఈ ట్రస్ట్ లక్ష్యం. గతంలో 'స్కూల్ ఆఫ్ నేచురల్ హిస్టరీ ఆర్ట్'ను ప్రారంభించిన హేమలత ఈ స్కూల్ ద్వారా చిత్రకళను, ప్రకృతిని మేళవించి ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది.

పెయింటింగ్స్, సెరమిక్స్, శిల్పాలు, టెక్స్‌టైల్స్, జువెలరీ డిజైన్‌ల ద్వారా ప్రకృతి ప్రపంచం అద్భుతాన్ని పిల్లలకు చేరువ చేయడంతో పాటు వారికి రకరకాల ఆర్టిస్టిక్ టెక్నిక్‌లను, స్టైల్స్‌ను నేర్పిస్తోంది.

'నా దృష్టిలో బొటానికల్ ఆర్ట్ అనేది కాన్వాస్‌పైకి పువ్వుల అందాన్ని తీసుకురావడం మాత్రమే కాదు. ఆర్ట్‌కు సైన్స్ కు మధ్య ఉండే దూరాన్ని దూరం చేయడం. బొటానికల్ ఆర్ట్ అనేది ప్రకృతి ప్రాముఖ్యత గురించి బలంగా చెప్పే సాధనం' అంటోంది హేమలతా ప్రధాన్.

సైబర్ టాక్

నకిలీ డీపీ ద్వారా మోసపోకండి

సురేష్ (పేరు మార్చడమైనది) ఫోన్ అదే పనిగా మోగుతుండటంతో కాల్ లిఫ్ట్ చేశాడు. కాలర్ చెప్పిన మాటలు వింటున్న సురేష్‌కి చెమటలు పట్టాయి. కంగారుతో 'అడిగినంత డబ్బు ఇస్తాను. ఆ ఫొటోను ఎక్కడా షేర్ చేయవద్ద'ని బతిమాలుకున్నాడు. జరిగిన సంఘటనను తన స్నేహితుడి దగ్గర చెప్పి బాధపడ్డాడు. ఫేక్ డీపీ స్కామర్ కారణంగా సురేష్ మోసపోయాడని ఫ్రెండ్‌కి అర్థం అయింది.

మన లేదా మన కుటుంబ సభ్యుల సోషల్ మీడియా ప్రొఫైల్ డీపీ తీసుకొని, మార్ఫింగ్ చేయడం, ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి డబ్బు డిమాండ్ చేస్తుంటారు స్కామర్లు. లేకపోతే ఆ ఫొటోని సోషల్ మీడియాలో షేర్ చేస్తానని, బంధుమిత్రులకు పంపుతానని బెదిరించడం మొదలుపెడతారు. దీంతో బాధితులు తమ పరువుకు సంబంధించిన విషయంగా భయపడి, దానిని అడ్డుకోవడానికి స్కామర్‌కు ఎంతో కొంత డబ్బు చెల్లిస్తుంటారు. మార్ఫింగ్ ప్రొఫైల్ పిక్చర్‌లతో దోపిడీ చేసే మోసగాళ్లు ఇటీవలి కాలంలో పెరగడం చూస్తుంటే ఈ విషయంలో ప్రతి యూజర్ తగిన జాగ్రత్తలపైనా తప్పక దృష్టి పెట్టాల్సిందే.

ప్రొఫైల్ ఫొటో

ఇది సామాజిక మాధ్యమాలలో మన గుర్తింపును సూచించే చిత్రం. వినియోగదారుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కంటెంట్‌ను పోస్ట్ చేసినప్పుడు, కామెంట్ లేదా పరస్పర చర్చ జరిపినప్పుడు వారి పేరు పక్కన కనిపించే ఫొటో ఇది.

నమ్మించి..

స్కామర్లు పెద్ద స్థాయి కంపెనీ సీఇవో లు లేదా ఉన్నతస్థాయి అధికారులను పోలి ఉండే డిస్‌ప్లే చిత్రాలను ఉపయోగించి నకిలీ వాట్సప్ ప్రొఫైల్స్‌ను సృష్టిస్తారు. ఆ తర్వాత స్కామర్ బాధితురాలితో సహా ఆ కంపెనీ ఉద్యోగులందరికీ మెసేజ్‌లు పంపుతారు. తనే కంపెనీ సీఈవో అని చెప్పుకుంటూ, సహోద్యోగులతో పంచుకోవడానికి గిఫ్ట్ వోచర్లను అందజేస్తారు. బాధితుడు, మెసేజ్ చట్టబద్ధమైనదని, తమ బాస్ నుండి వస్తున్నదని నమ్మి, వోచర్లను కొనుగోలు చేయవచ్చు. వాటిని సహోద్యోగులతో పంచుకోవచ్చు. స్కామర్ మాత్రం ఎక్కడా తన అడ్రస్ లేకుండా జాగ్రత్తపడతాడు.

మ్యాట్రిమోనియల్ స్కామ్‌లు

స్కామర్లు నకిలీ ప్రొఫైల్స్ సృష్టించడానికి మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లలో ఆకర్షణీయమైన వ్యక్తుల డీపీలను ఉపయోగిస్తారు. దీంతో కాబోయే వధూవరులు సంభాషణలలో పాల్గొంటారు. వారి నమ్మకాన్ని పొందుతారు. తరువాత ప్రయాణ ఖర్చు, వైద్య, అత్యవసర పరిస్థితులు లేదా కట్నం డిమాండ్లు వంటి వివిధ కారణాల కోసం డబ్బు అడుగుతారు. డబ్బు పొందాక స్కామర్ కనిపించడు.

లాటరీ స్కామ్‌లు

సోషల్ మీడియాలో నకిలీ ప్రొఫైల్స్‌ను సృష్టించడానికి ప్రసిద్ధ వ్యక్తులు లేదా సంపన్న వ్యక్తుల డీపీలను స్కామర్లు ఉపయోగిస్తారు. బాధితుడు లాటరీని లేదా బహుమతిని గెలుచుకున్నాడని, ఆ బహుమతి మొత్తాన్ని రిలీజ్ చేయడానికి వ్యక్తిగత సమాచారం, ఫీజులు లేదా టాక్స్ చెల్లించడానికి డబ్బు పంపమని అడుగుతారు. అసలు విషయం తెలియక బాధితులు బహుమతులు పొందకుండానే డబ్బును కోల్పోతున్నారు.

నిధుల సేకరణ స్కామ్‌లు

స్కామర్లు క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫారమ్‌లు లేదా సోషల్ మీడియాలో సానుభూతితో కూడిన ఫొటోలతో డీపీలు, ప్రొఫైల్‌లను సృష్టిస్తారు. వైద్య చికిత్స, విద్య లేదా సామాజిక కారణాల కోసం ఆర్థిక సహాయం అవసరమని అడుగుతారు. కానీ, అది నిజమై ఉండదు. డబ్బు తీసుకున్న తర్వాత స్కామర్ కనిపించరు.

పెట్టుబడుల స్కామ్‌లు

స్కామర్లు బాధితుల విశ్వసనీయతను పొందేందుకు సక్సెస్ సాధించిన పెట్టుబడిదారులు లేదా ఆర్థిక నిపుణుల డీపీలతో ప్రొఫైల్‌లను సృష్టిస్తారు. వారు వ్యక్తులను సంప్రదించి, అధిక రాబడుల వాగ్దానాలతో పెట్టుబడులను ఆహ్వానిస్తారు. అయితే, అవన్నీ మోసపూరితంగానే ఉంటాయి. బాధితులు మాత్రం తెలియక డబ్బు కోల్పోతారు.

రిపోర్ట్ లేదా బ్లాక్ చేయడానికి..

- ఫేస్‌బుక్ ప్రొఫైల్‌లోని మూడుచుక్కల మెనూ (...)పై క్లిక్ చేయండి. వచ్చిన సూచనలను అనుసరించండి.
- ఇన్‌స్టాగ్రామ్‌లో మీ డీపీ ఉన్న ఏదైనా ఖాతా ప్రొఫైల్‌కి వెళ్లి, కుడివైపున పై భాగంలో ఉన్న మూడు చుక్కల మెనూపై నొక్కి, రిపోర్ట్ ఆప్షన్‌ను ఎంచుకొని, సమస్యను నివేదించడానికి వచ్చిన సూచనలను ఫాలో అవ్వండి.
- ట్విటర్‌లో మీ డిస్ ప్లే ఫొటోని దుర్వినియోగం చేస్తున్న ఖాతా ప్రొఫైల్‌లోకి వెళ్లి, కుడివైపున పై భాగంలో ఉన్న మూడు చుక్కల మెనూని క్లిక్ చేసి, రిపోర్ట్ ఆప్షన్ ఎంచుకోండి. ఖాతా గురించి రిపోర్ట్ చేయడానికి వచ్చిన సూచనలను ఫాలో అవ్వండి.
- లింక్డ్ ఇన్‌లో ఇదే విధంగా చేయచ్చు
- వాట్సాప్‌లో మీ డీపీ మిస్‌యూజ్ చేస్తున్న వ్యక్తి చాట్‌ని ఓపెన్ చేసి, కుడివైపున పై భాగంలో ఉన్న మూడు చుక్కల మెనూని క్లిక్ చేసి, రిపోర్ట్ ఆప్షన్ ఎంచుకోండి. ఖాతా గురించి రిపోర్ట్ లేదా బ్లాక్ చేయడానికి వచ్చిన సూచనలను ఫాలో అవ్వండి.

డీపీల భద్రత

- గోప్యతా సెట్టింగ్‌లను సమీక్షించండి. మీరు అప్‌లోడ్ చేసే ఫొటోలు మీరు ఎంచుకున్న వ్యూవర్స్‌కి మాత్రమే కనిపించేలా సెట్టింగ్స్ ఎంచుకోండి.
- మీ డీపీకి వాటర్ మార్క్ జోడించండి. దీని వల్ల ఎవరైనా మీ ఫొటోని వారి సొంత ఫొటోగా మార్చడం కష్టం అవుతుంది.
- వ్యక్తిగత ఫొటోలను విరివిగా షేర్ చేయడం మానుకోండి. గోప్యతను పరిగణనలోకి తీసుకుని, మీ నిజమైన గుర్తింపును బహిర్గతం చేయడానికి లోగో లేదా గ్రాఫిక్ లేదా ఫన్నీ ఫొటోలను మీ ఫొటోకు బదులుగా ఉపయోగించండి.
- ఎవరైనా మీ డీపీని మీ అనుమతి లేకుండా ఉపయోగించిన సందర్భాలు మీకు కనిపిస్తే, దాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌కు రిపోర్ట్ చేయండి
- మీ డీపీని అప్‌డేట్ చేయండి. దీనివల్ల పాత ఫొటోలు వాడకుండా స్కామర్లను అడ్డుకోవచ్చు. ఇది డీపీని దుర్వినియోగం చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.





ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



అంకిత రైనా ఓటమి

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనాకు నిరాశ ఎదురైంది. పారిస్‌లో బుధవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 212వ ర్యాంకర్ అంకిత 6-7 (1/7), 1-6తో ప్రపంచ 145వ ర్యాంకర్ మొయుక ఉచిజిమా (జపాన్) చేతిలో ఓడిపోయింది. గంటా 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత రెండు డబుల్ ఫాల్ట్‌లతోపాటు 24 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన అంకిత ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

సాకేత్-యూకీ జోడీ పరాజయం

లియోన్-250 ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్ నుంచి సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ నిష్క్రమించింది. ఫ్రాన్స్‌లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్-యూకీ ద్వయం 1-6, 2-6తో మూడో సీడ్ మహుట్ (ఫ్రాన్స్)-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జంట చేతిలో ఓటమి చవిచూసింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాకేత్, యూకీలకు 5,220 యూరోల (రూ. 4 లక్షల 64 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



భారత్ 18 చైనీస్ తైపీ 0

సలాలా (ఒమన్): ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ భారీ విజయంతో బోణీ కొట్టింది. చైనీస్ తైపీతో బుధవారం జరిగిన పూల్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా గోల్స్ వర్షం కురిపించి 18-0తో గెలుపొందింది. భారత ఆటగాళ్ల ధాటికి చైనీస్ తైపీ ఆటగాళ్లు చేతులెత్తేశారు. భారత్ తరఫున అరైజీత్ సింగ్ హుండల్ (19వ, 19వ, 30వ, 59వ ని.లో) నాలుగు గోల్స్...



అమన్‌దీప్

అమన్‌దీప్ (38వ, 39వ, 41వ ని.లో) మూడు గోల్స్ సాధించారు. బాబీ సింగ్ ధామి (10వ, 46వ ని.లో), ఆదిత్య అర్జున్ లలాగే (37వ, 37వ ని.లో), కెప్టెన్ ఉత్తమ్ సింగ్ (10వ, 59వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. శ్రద్ధానంద్ తివారి (11వ ని.లో), అంగద్‌బీర్ సింగ్ (37వ ని.లో), ఆమీర్ అలీ (51వ ని.లో), బాబీ పూవణ్ణ చంద్ర (54వ ని.లో), యోగాంబర్ (60వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. ఈ టోర్నీ విజేత జూనియర్ ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది.

ముగిసిన భారత్ పోరు



మనిక

దర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్, భారత నంబర్‌వన్ మనిక బత్రా 11-6, 10-12, 9-11, 11-6, 11-13, 11-9, 3-11తో ప్రపంచ 13వ ర్యాంకర్ అడ్రియానా డియాజ్ (ప్యూర్టోరికో) చేతిలో పోరాడి ఓడిపోయింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆచంట శరత్ కమల్-సత్యన్ జ్ఞానశేఖరన్ (భారత్) ద్వయం 11-9, 8-11, 12-14, 10-12తో లియామ్ పిచ్‌ఫోర్డ్-పాల్ డ్రింక్‌హాల్ (ఇంగ్లండ్) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మనిక బత్రా-అర్చన కామత్ (భారత్) ద్వయం 8-11, 6-11, 7-11తో హినా హయాట-మిమా ఇటో (జపాన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

ముంబై ఆనందం 'ఆకాశ'మంత...

- క్వాలిఫయర్-2కు అర్హత సాధించిన రోహిత్ జట్టు
- ఎలిమినేటర్‌లో లక్నో చిత్తు
- 81 పరుగులతో ముంబై విజయం
- 5 పరుగులిచ్చి 5 వికెట్లు తీసిన ఆకాశ్ మధ్వాల్

ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ మరోసారి తమ అసలు స్థాయిని ప్రదర్శించింది. లీగ్ దశ చివర్లో కాస్త అదృష్టం కూడా కలిసొచ్చి ప్లే ఆఫ్స్‌కు చేరిన ముంబై తమ బలాన్ని ఎలిమినేటర్‌లో చూపించింది. సమష్టి బ్యాటింగ్ ప్రదర్శనతో గౌరవప్రదమైన స్కోరు సాధించిన టీమ్, ఆపై లక్నో సూపర్ జెయింట్స్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. పేసర్ ఆకాశ్ మధ్వాల్ అద్భుత బౌలింగ్‌కు తోడు టీమ్ మెరుపు ఫీల్డింగ్ ముంబైని రెండో క్వాలిఫయర్‌కు చేర్చాయి... ఉత్తరాఖండ్‌కు చెందిన ఆకాశ్ సూపర్ ఆటతో ఐపీఎల్‌లో తన ఉనికిని ప్రదర్శించాడు. కనీస ప్రదర్శన ఇవ్వలేని పేలవ బ్యాటింగ్‌తో లక్నో కుప్పకూలడంతో హోరాహోరీగా సాగుతుందనుకున్న మ్యాచ్ కాస్తా ఏకపక్షంగా మారిపోయింది. ఇక ఫైనల్ చేరేందుకు శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో రోహిత్ జట్టు క్వాలిఫయర్-2 సమరానికి సిద్ధం కాగా, వరుసగా రెండో సీజన్ లోనూ లక్నో నాలుగో స్థానానికే పరిమితమైంది.



స్టొయినిస్



ఆకాశ్ మధ్వాల్

చెన్నై: ముంబై ఇండియన్స్ మరో కీలక అడుగు వేసింది. ఎలిమినేటర్ దశను విజయవంతంగా అధిగమించి క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. బుధవారం జరిగిన పోరులో ముంబై 81 పరుగుల భారీ తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. కామెరాన్ గ్రీన్ (23 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (20 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం లక్నో 16.3 ఓవర్లలో 101 పరుగులకే ఆలౌటైంది. స్టొయినిస్ (27 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. కనీసం పూర్తి ఓవర్లు కూడా ఆడలేకపోయిన లక్నో 21 బంతుల ముందే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆకాశ్ మధ్వాల్ తన 3.3 ఓవర్ల కోటాలో 5 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం. ఐపీఎల్ టోర్నీ ప్లే ఆఫ్ మ్యాచ్‌లో 5 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా ఆకాశ్ నిలిచాడు.

కీలక భాగస్వామ్యం...

ఓపెనర్లు ఇషాన్ కిషన్ (15), రోహిత్ శర్మ (11) ముంబైకి ఆశించిన ఆరంభాన్ని అందించలేకపోయారు. 8 పరుగుల వ్యవధిలో వీరిద్దరు వెనుదిరిగారు. అయితే గ్రీన్, సూర్యకుమార్ భాగస్వామ్యంతో జట్టు కోలుకుంది. గ్రీన్ తాను ఎదుర్కొన్న తొలి 10 బంతుల్లోనే 6 ఫోర్లు కొట్టగా, సూర్య కూడా తన దైన శైలిలో వికెట్ వెనుక భాగంలో రెండు సిక్సర్లు బాది అలరించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 38 బంతుల్లోనే 66 పరుగులు జోడించారు. అయితే నవీన్ వేసిన 11వ ఓవర్ ఇన్నింగ్స్‌ను మలుపు తిప్పింది. ఈ ఓవర్లోనే సూర్య, గ్రీన్‌లను అతను అవుట్ చేశాడు. తర్వాతి నాలుగు ఓవర్లలో తడబడిన ముంబై 26 పరుగులే చేయగలిగింది. అయితే చివర్లో తిలక్ వర్మ (22 బంతుల్లో 26; 2 సిక్స్‌లు), నేహల్ వధేరా (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడి ముంబైకి మెరుగైన స్కోరు అందించారు. ఆఖరి 5 ఓవర్లలో జట్టు 51 పరుగులు సాధించింది.

టపటపా...

ఛేదనలో లక్నోకు ఏదీ కలిసి రాలేదు. రెండో ఓవర్లోనే ప్రేరక్ మన్కడ్ (3) వెనుదిరగ్గా, 'ఇంపాక్ట్'గా వచ్చిన కైల్ మేయర్స్ (18) పెద్దగా ప్రభావం చూపలేదు. మూడో స్థానంలో వచ్చిన కెప్టెన్ కృనాల్ పాండ్యా (8) కూడా విఫలమయ్యాడు. మరో ఎండ్‌లో స్టొయినిస్ మాత్రమే కాస్త ధాటిగా ఆడుతూ ఆశలు రేపాడు. కానీ ఆకాశ్ వరుస బంతుల్లో బదోని (1), పూరన్ (0)లను అవుట్ చేయడంతో స్కోరు 75/5కు చేరింది. 10 ఓవర్లలో 108 పరుగులు చేయాల్సిన కష్టసాధ్యమైన స్థితిలో స్టొయినిస్‌ను జట్టు నమ్ముకుంది. అయితే దీపక్ హుడా (15)తో సమన్వయ లోపంతో స్టొయినిస్ రనౌట్ కావడంతో జట్టు ఓటమి లాంఛనమే అయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) పూరన్ (బి) యశ్ 15; రోహిత్ (సి) బదాని (బి) నవీన్ 11; గ్రీన్ (బి) నవీన్ 41; సూర్యకుమార్ (సి) గౌతమ్ (బి) నవీన్ 33; తిలక్ వర్మ (సి) హుడా (బి) నవీన్ 26; డేవిడ్ (సి) హుడా (బి) యశ్ 13; వధేరా (సి) బిష్ణోయ్ (బి) యశ్ 23; జోర్డాన్ (సి) హుడా (బి) మొహసిన్ 4; షోకీన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 182.** **వికెట్ల పతనం:** 1-30, 2-38, 3-104, 4-105, 5-148, 6-159, 7-168, 8-182. **బౌలింగ్:** కృనాల్ 4-0-38-0, గౌతమ్ 1-0-8-0, నవీన్ ఉల్ హక్ 4-0-38-4, యశ్ ఠాకూర్ 4-0-34-3, మొహసిన్ 3-0-24-1, రవి బిష్ణోయ్ 4-0-30-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) గ్రీన్ (బి) జోర్డాన్ 18; ప్రేరక్ (సి) షోకీన్ (బి) ఆకాశ్ 3; కృనాల్ (సి) డేవిడ్ (బి) చావ్లా 8; స్టొయినిస్ (రనౌట్) 40; బదోని (బి) ఆకాశ్ 1; పూరన్ (సి) ఇషాన్ (బి) ఆకాశ్ 0; హుడా (రనౌట్) 15; గౌతమ్ (రనౌట్) 2; బిష్ణోయ్ (సి) జోర్డాన్ (బి) ఆకాశ్ 3; నవీన్ (నాటౌట్) 1; మొహసిన్ (బి) ఆకాశ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (16.3 ఓవర్లలో ఆలౌట్) 101.** **వికెట్ల పతనం:** 1-12, 2-23, 3-69, 4-74, 5-74, 6-89, 7-92, 8-100, 9-100, 10-101. **బౌలింగ్:** బెహ్రన్‌డార్ఫ్ 3-0-21-0, ఆకాశ్ 3.3-0-5-5, జోర్డాన్ 2-1-7-1, గ్రీన్ 3-0-15-0, షోకీన్ 1-0-18-0, చావ్లా 4-0-28-1.

'అంతా ధోని మాయ'

సునీల్ గావస్కర్

ఇంగ్లండ్ గడ్డపై నా తొలి టెస్టు సిరీస్ రోజుల్లోకి ఒక్కసారి వెళ్లి చూస్తే... చివరి టెస్టులో మా విజయలక్ష్యం 172 పరుగులు. దానిని అందుకుంటే ఇంగ్లండ్‌లో భారత్ మొదటిసారి టెస్టు సిరీస్ గెలుస్తుంది. నాలుగో రోజు ఆటను మెరుగైన స్థితిలో ముగించడంతో లక్ష్యం చేరేందుకు ఒక రోజంతా మా వద్ద మిగిలింది. అప్పుడు ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రే ఇల్లింగ్‌వర్త్ నా దృష్టిలో అత్యంత చురుకైన సారథి. ఒక్క సులువైన పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేయడంతో మా దృష్టిలో లక్ష్యం 572 పరుగులుగా కనిపించింది! చివరకు 75 ఓవర్లు ఆడి మేం మ్యాచ్ గెలవగలిగాం. చిదంబరం స్టేడియంలో ధోని కూడా తక్కువ లక్ష్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో చిరునవ్వులు చిందిస్తూనే గుజరాత్‌కు అదే తరహా భావన కల్పించాడు. అతని బౌలింగ్ మార్పులు, ఫీల్డింగ్ వ్యూహాలతో గుజరాత్ ఆటగాళ్లు కదల్లేకపోయారు. అలవోకగా లక్ష్యాలు ఛేదించే తమకు ఏం జరిగిందో అని వారు కూడా ఆశ్చర్యపోయి ఉండవచ్చు. అది అర్థమయ్యేసరికి వారికి ఓటమి ఖాయమైపోయింది. పిచ్ కాస్త నెమ్మదించి టర్న్‌కు అనుకూలించిందనేది వాస్తవమే అయినా దానిని ధోని సమర్థంగా వాడుకోవడమే చెప్పుకోదగ్గ అంశం. అంతకుముందు రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వే చెన్నైకి కావాల్సిన సరైన ఆరంభాన్ని అందిస్తే రాయుడు, జడేజా కలిసి స్కోరును 172 వరకు తీసుకెళ్లారు. ఆ తర్వాత ధోని గతంలో ఎన్నోసార్లు చేసినట్లుగానే మళ్లీ తన మాయ చూపించాడు. చెన్నై జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు.

లక్ష్య సేన్, ప్రణయ్ సంచలనం

- ప్రపంచ నాలుగో ర్యాంకర్, ఆరో ర్యాంకర్‌లపై విజయం
- ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు, శ్రీకాంత్



లక్ష్య సేన్



ప్రణయ్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ సంచలన విజయాలతో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 16-21, 21-14, 21-13తో ప్రపంచ ఆరో ర్యాంకర్ తియెన్ చెన్ చౌ (చైనీస్ తైపీ)పై... ప్రపంచ 23వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-10, 16-21, 21-9తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, మాజీ విశ్వవిజేత లో కీన్ యె (సింగపూర్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ (భారత్) 21-12, 21-16తో తొమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో పీవీ సింధు 21-13, 17-21, 21-18తో లైన్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై కష్టపడి విజయం సాధించింది. భారత్‌కే చెందిన అష్మిత 17-21, 7-21తో యు హాన్ (చైనా) చేతిలో, ఆకర్షి 17-21, 12-21తో అకానె యామగుచి (జపాన్) చేతిలో, మాళవిక బన్సోద్ 11-21 13-21తో జి యి వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు.

అర్జున్‌కు నాలుగో విజయం

షార్జా: షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నాలుగో విజయం సాధించాడు. వ్లాదిస్లావ్ కొవలెవ్ (రష్యా)తో బుధవారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో నల్లపావులతో అర్జున్ 35 ఎత్తుల్లో గెలుపొందాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత అర్జున్ 5.5 పాయింట్లతో మరో ఏడుగురితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు.

సినిమా

గమ్యం రాసేస్తాను



రవితేజ

''టైగర్ నాగేశ్వరరావు' సినిమా ఫస్ట్ లుక్‌ని ఇంత గ్రాండ్‌గా విడుదల చేసిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ చిత్రంతో రవితేజగారి ఫ్యాన్స్ ఆకలి కచ్చితంగా తీర్చుతాను. 'నువ్వు చెయ్ వంశీ.. నేను ఉన్నాను' అంటూ నన్ను ప్రోత్సహించిన ఆయనకు థ్యాంక్స్'' అని డైరెక్టర్ వంశీ అన్నారు. రవితేజ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 20న విడుదల కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్, కాన్సెప్ట్ వీడియోను రాజమహేంద్రవరంలో లాంచ్ చేశారు. టైగర్ నాగేశ్వర రావు ప్రపంచాన్ని ఐదు భాషల్లో ఐదుగురు స్టార్స్ పరిచయం చేశారు. తెలుగు వెర్షన్‌కి వెంకటేశ్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. జాన్ అబ్రహాం, శివ రాజ్‌కుమార్, కార్తీ, దుల్కర్ సల్మాన్‌లు హిందీ, కన్నడ, తమిళ్, మలయాళ భాషల్లో వాయిస్ ఓవర్ ఇచ్చారు. ''కొన్ని దారి రాస్తుంది.. మరికొన్ని నేను రాస్తాను. వాళ్ల కష్టాలు రాస్తూ ఉంటారు. నేను గమ్యం రాసేస్తాను. నా రెక్కలు మీరు కోసేసినా నేలపై ఉండి నింగిని రాసేస్తాను.. ఇదీ 'టైగర్ నాగేశ్వరరావు కథ'' అన్నారు అభిషేక్ అగర్వాల్.

ఊపిరి నువ్వే ఊరికి..

''తూరుపు పడమర ఏ దిక్కు పడవుర.. నువ్వే మాకు దిక్కు రా...', 'గోపురం గుడికి రా... అక్షరం బడికి రా.. ఊపిరి నువ్వే ఊరికి రా'' అంటూ సాగే పాట 'రంగబలి' చిత్రం నుంచి విడుదలైంది. నాగశౌర్య హీరోగా పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో యుక్తి తరేజ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. విలేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'తూరుపు పడమర..' లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. సంగీత దర్శకుడు సీహెచ్ పవన్ స్వరపరచిన ఈ పాటకు పవన్ బాసంశెట్టి, శ్రీ హర్ష సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. జానీ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. ఈ చిత్రానికి కెమెరా: దివాకర్ మణి.



నాగశౌర్య

కాంబినేషన్ రిపీట్

''నేనే రాజు నేనే మంత్రి' (2017) చిత్రం తర్వాత హీరో రానా, దర్శకుడు తేజ మరో సినిమా చేయనున్నారు. గోపీనాథ్ ఆచంట నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో ఓ మలయాళ నటుడు కీలక పాత్ర పోషిస్తారని తెలిసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... రానా హీరోగా తేజ దర్శకత్వంలో 'రాక్షసరాజు రావణాసురుడు' అనే మూవీ రానున్నట్లుగా గతంలో వార్తలు వచ్చాయి. మరి... ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ప్రకటించిన తాజా చిత్రం ఇదేనా? లేక వేరే సినిమానా? అనే విషయం తెలియాల్సి ఉంది.



రానా, తేజ

చలో మైసూర్



రామ్‌చరణ్

'గేమ్ చేంజర్' మూమెంట్స్ కోసం మైసూర్ వెళ్లనున్నారు రామ్ చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'గేమ్ చేంజర్'. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకాంత్, సునీల్, ఎస్‌జే సూర్య, జయరాం, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. ఇటీవల ఈ సినిమా భారీ క్లైమాక్స్ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరిగింది. కాగా 'గేమ్ చేంజర్' నెక్ట్స్ షెడ్యూల్ మైసూర్‌లో జరగనున్నట్లు తెలిసింది. జూన్ మొదటివారంలో రామ్‌చరణ్, శంకర్ అండ్ కో ఈ చిత్రంలోని కీలక సన్నివేశాల కోసం మైసూర్ ప్రయాణం కానున్నారని సమాచారం. దాదాపు పది రోజుల పాటు ఈ షూటింగ్ షెడ్యూల్ జరుగుతుందట. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

జపాన్‌లో మేజిక్ జరిగింది: రామ్‌చరణ్ భార్య ఉపాసన గర్భవతి అనే విషయం తెలిసిందే. ప్రస్తుతం తనకు ఏడో నెల అని శ్రీనగర్‌లో జరిగిన 'జీ 20' కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌చరణ్ అన్నారు. ఇదే వేదికపై జపాన్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, అది ఇప్పుడు ఇంకా స్పెషల్ అని, ఎందుకంటే జపాన్‌లోనే ఈ మేజిక్ (భార్య ప్రెగ్నెన్సీ గురించి) జరిగిందని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

తెలంగాణ నేపథ్యంలో...

'ఉయ్యాల జంపాల, మజ్ను' వంటి చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు విరించి వర్మ. తన మూడో చిత్రాన్ని నూతన నటీనటులతో తెరకెక్కిస్తున్నారాయన. ముదుగంటి క్రియేషన్స్‌పై ఈ సినిమా రూపొందుతోంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల ఆధారంగా నడిచే పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామా ఇది. 1980లో జరిగే ఒక పీరియాడిక్ కథగా రూపొందుతున్న ఈ సినిమా తెలంగాణ నేపథ్యంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. నటీనటుల వివరాలు, టైటిల్‌ని త్వరలో ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞానశేఖర్, సంగీతం: గోపీసుందర్.



విరించి వర్మ

థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా 2018 - హరీష్ శంకర్

''2018'లాంటి అద్భుతమైన సినిమాని థియేటర్స్‌లోనే చూడాలి. తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందని మాట ఇస్తున్నా'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ అన్నారు. టొవినో థామస్, కుంచక్కో బోబన్, వినీత్ శ్రీనివాసన్, ఆసిఫ్ అలీ, అపర్ణ బాలమురళి కీలక పాత్రల్లో నటించిన చిత్రం '2018'. జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వం వహించారు. వేణు కున్నప్పిలి, సీకే పద్మ కుమార్, ఆంటో జోసెఫ్ నిర్మించిన ఈ సినిమాను తెలుగులో కొన్ని ప్రధాన ఏరియాల్లో 'బన్నీ' వాసు ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జూడ్ ఆంటోనీ మాట్లాడుతూ–''కేరళలో 2018లో వచ్చిన వరద బాధితుల్లో నేనూ ఒక్కణ్ణి. ఈ కథని ప్రపంచానికి చెప్పాలనుకుని '2018' తీశాను. భాషతో సంబంధం లేకుండా అందరికీ ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు.



జూడ్ ఆంటోనీ, హరీష్ శంకర్, 'బన్నీ' వాసు

ప్రేమకు వేళాయె...



ఖుషీ కపూర్

ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్, శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ ప్రేమికులు కానున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే... దర్శక-నటుడు ప్రదీప్ రంగనాథన్ నటించి, స్వీయదర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'లవ్ టుడే' హిందీ రీమేక్‌లో ఈ ఇద్దరూ నటించనున్నారు. రూ. ఐదు కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం వంద కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ఈ సినిమా హిందీ రీమేక్ హక్కులను ఫ్యాంటమ్ స్టూడియోస్ దక్కించుకుంది. అప్పట్నుంచి 'లవ్ టుడే' హిందీ రీమేక్‌లో నటించనున్నారంటూ పలువురు హిందీ యువ హీరో హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా జునైద్ ఖాన్, ఖుషీ కపూర్ ఈ ప్రాజెక్ట్‌కి సైన్ చేశారని లేటెస్ట్ టాక్. దర్శకుడు అద్వైత్ చందన్ ఈ సినిమాను తెరకెక్కిస్తారట.

భార్యాభర్తల కథ

యుగ్ రామ్, వంశీ కోటు హీరోలుగా, స్పందన పల్లి హీరోయిన్‌గా రామ్ గన్ని దర్శకత్వం వహించిన చిత్రం 'ది ట్రయల్'. ఎస్ఎస్ ఫిల్మ్స్, కామన్ మేన్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై స్మృతి సాగి, శ్రీనివాస్ కె. నాయుడు నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ను 'పుష్ప' చిత్ర రచయిత శ్రీకాంత్ విస్సా, నటుడు, సంగీత దర్శకుడు రఘు కుంచె, 'పలాస' హీరో రక్షిత్ అట్లూరి విడుదల చేశారు. రామ్ గన్ని మాట్లాడుతూ– ''లేడీ ఓరియంటెడ్ కథతో రూపొందుతోన్న చిత్రం 'ది ట్రయల్'. ఓ మహిళ, ఆమె భర్త చుట్టూ ఈ కథ జరుగుతుంది'' అన్నారు. ''నటీనటులు, సాంకేతిక నిపుణులందరూ చాలా కష్టపడి ఈ మూవీ చేశాం'' అన్నారు యుగ్ రామ్. ''ది ట్రయల్' థ్రిల్లర్ సినిమా అయినా చాలా వినోదం ఉంటుంది'' అన్నారు స్పందన పల్లి. ''ఈ మూవీ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు సతీష్ వర్మ. ''సినిమాలపై ఉన్న ప్యాషన్‌తో ఎస్ఐ జాబ్‌ని వదులుకుని మరీ వచ్చి ఈ సినిమాని డైరెక్షన్ చేశారు రామ్ గన్నిగారు'' అన్నారు వంశీ కోటు. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహ నిర్మాతలు: సుదర్శన్ రెడ్డి, కంచరన జయలక్ష్మి.



వంశీ, స్పందన, యుగ్ రామ్

వినోదాల తారంగ



ఇమ్మార్టెల్, సుమన్

కట్ల ఇమ్మార్టెల్, కట్ల డాండి హీరోలుగా, పూజా నాగేశ్వరి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'తారంగ'. ఎస్. సంపత్ కుమార్ దర్శకత్వంలో శ్రీనివాస్ రెడ్డి కర్రి నిర్మించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సుమన్ మాట్లాడుతూ– ''తారంగ' సినిమా బాగా వచ్చింది. యూనిట్ కృషి వల్ల తక్కువ టైమ్‌లోనే పూర్తయింది'' అన్నారు. ''వినోదాత్మకంగా రూపొందించిన చిత్రమిది. జూలైలో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు శ్రీనివాస్ రెడ్డి కర్రి. ''మా సినిమా అన్నివర్గాలవారికి నచ్చేలా ఉంటుంది'' అన్నారు ఎస్. సంపత్ కుమార్.

అహల్య పాత్ర పెద్ద సవాల్ - గీతికా తివారి

''ఫలానా జానర్‌కు పరిమితం కాకుండా ఓ నటిగా డిఫరెంట్ సినిమాలు, పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు హీరోయిన్ గీతికా తివారి. దగ్గుబాటి అభిరామ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'అహింస'. ఈ చిత్రంలో గీతికా తివారి హీరోయిన్‌గా నటించారు. తేజ దర్శకత్వంలో పి. కిరణ్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో గీతికా తివారి మాట్లాడుతూ– ''మాది మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక యాక్టర్‌గా కొన్ని కమర్షియల్ యాడ్స్ చేశాను. ఆ తర్వాత సినిమాల్లోకి రావాలనుకున్నాను. తేజగారితో సినిమాలు చేసిన చాలామంది కొత్త నటీనటులు ఇండస్ట్రీలో సక్సెస్ అయ్యారు. ఇలా కొత్తవారిని పరిచయం చేయడంలో తేజగారిది లక్కీ హ్యాండ్. ఆయన సినిమా ద్వారా ఇప్పుడు నేను హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం అవుతుండటం చాలా సంతోషంగా ఉంది. 'అహింస'లో చేసిన అహల్య పాత్ర నాకు పెద్ద సవాల్ అనిపించింది. కొన్ని సన్నివేశాలకు ఎక్కువ టేక్స్ తీసుకున్నాను. కానీ సింగిల్ టేక్‌లో పూర్తి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి'' అని అన్నారు.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
208	63
61,774	18,285

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,446	▽	115
డోజోన్స్	32,805	▽	251
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,627	▽	136
డాక్స్	15,842	▽	311
షాంఘై	3,205	▽	41
నికాయ్	30,683	▽	275

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,680	△	338
బంగారం (99.5 స్వచ్ఛత)	60,437	△	337
వెండి (కిలో)	71,129	△	411

ఎల్‌ఐసీ లాభం హైజంప్



- క్యూ4లో రూ. 13,191 కోట్లు
- షేరుకి రూ. 3 తుది డివిడెండ్

న్యూఢిల్లీ: బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్‌ఐసీ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 5 రెట్లు జంప్‌చేసి రూ. 13,191 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 2,409 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,15,487 కోట్ల నుంచి రూ. 2,01,022 కోట్లకు క్షీణించింది. తొలి ఏడాది ప్రీమియం ఆదాయం సైతం రూ. 14,663 కోట్ల నుంచి రూ. 12,852 కోట్లకు నీరసించింది. అయితే రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ. 71,473 కోట్ల నుంచి రూ. 76,328 కోట్లకు వృద్ధి చూపింది. ఇక సింగిల్ ప్రీమియం ఆదాయం రూ. 58,251 కోట్ల నుంచి రూ. 43,252 కోట్లకు వెనకడుగు వేసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 3 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

పూర్తి ఏడాదికి...

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఎల్‌ఐసీ నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 35,997 కోట్లను తాకింది. 2021–22లో రూ. 4,125 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. గతేడాది ప్రభుత్వం ఐపీవో చేపట్టడం ద్వారా ఎల్‌ఐసీలో 3.5 శాతం వాటాను విక్రయించింది. 22.13 కోట్ల షేర్ల అమ్మకం ద్వారా రూ. 20,557 కోట్లు సమకూర్చుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 594 వద్ద ముగిసింది.

హిందాల్కో లాభం క్షీణత

- క్యూ4లో రూ. 2,411 కోట్లు

న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 37 శాతం క్షీణించి రూ. 2,411 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,860 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 56,057 కోట్ల నుంచి రూ. 56,209 కోట్లకు స్వల్పంగా పుంజుకుంది. మొత్తం వ్యయాలు సైతం రూ. 51,026 కోట్ల నుంచి రూ. 53,372 కోట్లకు పెరిగాయి. విద్యుత్, ఇంధన, ఇన్వెంటరీ వ్యయాలు, ఉద్యోగులకు లబ్ధి చేకూర్చే చర్యలు ఇందుకు కారణమయ్యాయి. విదేశీ అనుబంధ సంస్థ నోవెలిస్ నికర లాభం 7



శాతం నీరసించి 17.5 కోట్ల డాలర్లకు చేరింది. మొత్తం ఆదాయం 8 శాతం తగ్గి 4.4 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో 4.8 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధించింది. అల్యూమినియం సగటు ధరలతోపాటు, అమ్మకాలు తగ్గడం ప్రభావం చూపింది.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు బీఎస్‌ఈలో 0.8 శాతం క్షీణించి రూ. 407 వద్ద ముగిసింది.

3 రోజుల లాభాలకు బ్రేక్

- లాభాల స్వీకరణతో డీలా
- సెన్సెక్స్ 208 పాయింట్లు డౌన్
- 61,774 వద్ద ముగింపు
- నిఫ్టీ 63 పాయింట్లు క్షీణత



ముంబై: ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 208 పాయింట్లు క్షీణించి 61,774 వద్ద నిలిచింది. నిఫ్టీ 63 పాయింట్ల నష్టంతో 18,285 వద్ద ముగిసింది. మార్కెట్లు వరుసగా మూడు రోజులపాటు బలపడటంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు ఆసక్తి చూపినట్లు నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు మే నెల డెరివేటివ్ సిరీస్ ముగింపు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ గత సమావేశపు మినిట్స్ విడుదల నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలియజేశారు. వెరసి ఇంట్రాడేలో సెన్సెక్స్ 62,154 వద్ద గరిష్టాన్ని, 61,708 వద్ద కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 18,393–18,263 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. యూఎస్ రుణ పరిమితి పెంపు చర్చలు నిలిచిపోవడం సెంటిమెంటును దెబ్బతీసినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ నిపుణులు వినోద్ నాయిర్ పేర్కొన్నారు.

మెటల్, బ్యాంకింగ్ వీక్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్ 1.6 శాతం, బ్యాంకింగ్ 0.6% చొప్పున నీరసించగా.. కన్జూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, మీడియా, ఎఫ్‌ఎంసీజీ 1.4–0.5% మధ్య పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, జేఎస్‌డబ్ల్యూ, హిందాల్కో, బజాజ్ ఫిన్, బీపీసీఎల్, కొటక్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, ఆర్‌ఐఎల్, హెచ్‌యూఎల్ 1.3–0.5% క్షీణించాయి. కాగా, డాలరుతో మారకంలో రూపాయి 17 పైసలు పుంజుకుని 82.68 వద్ద ముగిసింది.

బంగారం పెరిగినా డాలరుకు ప్రాధాన్యం తగ్గదు..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బంగారం కొనుగోళ్లు భారీగా పెరిగితే డాలరు ప్రాధాన్యం కోల్పోతుందనుకోవడం సరైన అంచనా కాకపోవచ్చని ఆర్థిక నిపుణుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి తెలిపారు. డాలరు మారకం విలువ తగ్గినప్పుడల్లా బంగారం ధర పెరుగుతుందని, ఈ కారణంతో డాలరు పని ఇక అయిపోయిందనే పుకార్లు వినిపిస్తుంటాయని పేర్కొన్నారు. కానీ బలహీనపడిన ప్రతీసారీ అది పుంజుకుంటూనే ఉందని తెలిపారు. అత్యంత ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీతో పాటు అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవహారాల్లో అమెరికాకు ఉన్న ఆధిపత్యం కారణంగా ఆ దేశానికి ఆర్థిక సంక్షోభాలు తాత్కాలికమేనని, డాలరుకు ఉన్న ప్రాధాన్యతకు సవాళ్లు ఎదురైనా తాత్కాలికమేనని 75 ఏళ్ల చరిత్ర చెబుతోందని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. అనేక ఇతర కారణాల వల్ల బంగారానికి డిమాండు పెరిగేందుకు, ధర ఎగబాకేందుకు అవకాశాలున్నాయి గానీ డాలరు పతనం నిరంతరాయంగా జరగదని పలువురు ఆర్థికవేత్తలు ధీమా వ్యక్తం చేస్తున్నట్లు ఆయన వివరించారు.


సజావుగా రూ. 2వేల నోట్లు వెనక్కి..

- నిశితంగా ప్రక్రియ పర్యవేక్షణ
- ఆర్‌బీఐ గవర్నర్ దాస్ వెల్లడి
- ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని ఆశాభావం

న్యూఢిల్లీ: రూ. 2,000 నోటు ఉపసంహరణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియంతా సజావుగా పూర్తి కాగలదని ధీమా వ్యక్తం చేశారు. మార్పిడి, డిపాజిట్లకు తగినంత సమయం ఇచ్చినందున ఎక్కడా రద్దీ కనిపించడం లేదని పరిశ్రమల సమాఖ్య సీఐఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. రూ. 2వేల నోట్ల జీవితకాలం, వాటిని ప్రవేశపెట్టిన లక్ష్యం పూర్తయింది కాబట్టి ఉపసంహరిస్తున్నట్లు దాస్ వివరించారు. డెడ్‌లైన్ విధించడాన్ని సమర్థించుకుంటూ గడువంటూ లేకపోతే ఉపసంహరణ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించలేమని ఆయన పేర్కొన్నారు.

4.7 శాతం లోపునకు ద్రవ్యోల్బణం..

ద్రవ్యోల్బణం నెమ్మదించిందని, తదుపరి గణాంకాల్లో ఇది తాజాగా నమోదైన 4.7 శాతం కన్నా మరింత తక్కువగా ఉండవచ్చని దాస్ తెలిపారు. అలాగని, అలసత్వం ప్రదర్శించడానికి లేదని.. ద్రవ్యోల్బణంపై యుద్ధం కొనసాగించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కొన్నాళ్ల క్రితం ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతున్నట్లుగా అనిపించిన సమయంలో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముంచుకొచ్చి అంతర్జాతీయంగా మొత్తం పరిస్థితి అంతా



మారిపోయిందని దాస్ చెప్పారు. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణంపై పోరు కొనసాగుతుందని, ఎప్పటికప్పుడు మారే పరిస్థితులకు తగినట్లుగా ఆర్‌బీఐ స్పందిస్తుందని పేర్కొన్నారు. రేట్ల పెంపునకు విరామం ఇవ్వడమనేది క్షేత్ర స్థాయిలో పరిస్థితులను బట్టే ఉంటుంది తప్ప తన చేతుల్లో ఏమీ లేదని దాస్ చెప్పారు. స్థూలఆర్థిక పరిస్థితులు స్థిరపడుతుండటంతో వృద్ధి పుంజుకోవడానికి తోడ్పాటు లభిస్తోందని దాస్ వివరించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బాకీల సమస్య గణనీయంగా తగ్గిందన్నారు. బ్యాంకుల రుణ వితరణ పెరుగుతోందని చెప్పారు. భారత ఆర్థిక సుస్థిరతను కొనసాగించేందుకు ఆర్‌బీఐ సదా క్రియాశీలకంగా, అప్రమత్తంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

నగదు కొరత..

రూ. 2 వేల కరెన్సీ నోట్ల మార్పిడి రెండో రోజున కొన్ని బ్యాంకుల్లో నగదు నిల్వలు ఖాళీ అయిపోవడంతో తాత్కాలికంగా ప్రక్రియను ఆపివేయాల్సి వచ్చింది. తిరిగి కరెన్సీ చెస్ట్ నుంచి భర్తీ చేసేంత వరకూ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, మార్పిడి కోసం కరెన్సీ కొరత ఉందంటూ పెద్దగా ఫిర్యాదులేమీ రాలేదని వివిధ బ్యాంకుల సీనియర్ అధికారులు తెలిపారు. తమ శాఖలన్నింటికీ నిరంతరాయంగా రూ. 500, రూ. 200, రూ. 100 నోట్లను సరఫరా చేస్తూనే ఉన్నామని వివరించారు.

7 శాతం పైనే వృద్ధి..

గత ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగో త్రైమాసికాల్లో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్న నేపథ్యంలో వృద్ధి రేటు ముందుగా అంచనా వేసిన 7 శాతం కన్నా అధికంగానే ఉండవచ్చని దాస్ చెప్పారు. 2022–23కి సంబంధించిన ప్రొవిజనల్ అంచనాలు మే 31న వెలువడనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండవచ్చని ఆర్‌బీఐ అంచనా వేసినట్లు దాస్ వివరించారు. అంతర్జాతీయ సవాళ్లను భారత ఎకానమీ దీటుగా ఎదురు నిల్చిందని.. భౌగోళికరాజకీయ, అంతర్గత సమస్యలను అధిగమించేందుకు అవసరమైనంతగా విదేశీ మారక నిల్వలను సమకూర్చుకుందని శక్తికాంత దాస్ చెప్పారు.

భారత్‌లో అవకాశాలు అపారం

- ఇన్‌ఫ్రా, సెమీకండక్టర్, ఇంధన రంగాల్లో ఇన్వెస్ట్ చేయండి
- ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలకు పీఎం మోదీ పిలుపు



సిడ్నీ: భారత్‌లో డిజిటల్ ఇన్‌ఫ్రా, టెలికం, సెమీకండక్టర్లలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా అక్కడి ప్రముఖ కంపెనీల సీఈవోలతో ప్రధాని ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్‌లో అవకాశాల గురించి తెలియజేశారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఇన్‌ఫ్రా, ఐటీ, ఫిన్‌టెక్, టెలికం, సెమీకండక్టర్, అంతరిక్షం, పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ హైడ్రోజన్, విద్య, ఫార్మా, హెల్త్‌కేర్, వైద్య ఉపకరణాల తయారీ, మైనింగ్, టెక్స్‌టైల్, వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి తెలిపారు. భారతీయ కంపెనీలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. టెక్నాలజీ, నైపుణ్యాలు, శుద్ధ ఇంధనాల విషయంలో భారత కంపెనీలతో సహకారం ఇతోధికం చేసుకోవాలని కోరారు. నిబంధనల అమలును సులభతరం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పీఎల్‌ఐ ప్రోత్సాహకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను సరళతరం చేసినట్లు వివరించారు. హాన్‌కాక్ ప్రాస్పెక్టింగ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గినా రైన్‌హార్ట్, ఫార్టెస్క్యూ ఫ్యూచర్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఆండ్య్రూ ఫారెస్ట్, ఆస్ట్రేలియా సూపర్ సీఈవో పాల్ ష్రోడర్ ప్రధానితో సమావేశంలో పాల్గొన్నారు. 2000 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ వరకు ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు 1.07 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇరు దేశాలు మధ్యంతర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం తెలిసిందే. గతేడాది డిసెంబర్ 29 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భారత్‌కు ఆస్ట్రేలియా 13వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ పరీక్ష (ఏఎస్ఆర్‌బీ)-2023

న్యూఢిల్లీలో ఉన్న అగ్రికల్చరల్ సైంటిస్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. 2023 సంవత్సరానికి గాను అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ ద్వారా వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 260
» **విభాగాలు:** ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, యానిమల్ బయోటెక్నాలజీ, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ఎకనామిక్ బోటనీ, అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఫ్రూట్ సైన్స్, వెటర్నరీ పబ్లిక్ హెల్త్, ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిష్ ప్రాసెసింగ్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 21 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.57,700 నుంచి రూ.1,82,400 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.07.2023
» **దరఖాస్తులకు చివరితేది:** 26.07.2023.
» **పరీక్ష తేది:** అక్టోబర్/నవంబర్ 2023.
» **వెబ్‌సైట్:** www.asrb.org.in

ఐఐఎఫ్‌టీ, న్యూఢిల్లీలో ఎంఏ కోర్సులో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ).. 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఏ(ఎకనామిక్స్–స్పెషలైజేషన్ ఇన్ ట్రేడ్ అండ్ ఫైనాన్స్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** 50శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 45శాతం). వయసు: వయోపరిమితి నిబంధన లేదు.
» **ఎంపిక విధానం:** అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.06.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 24.06.2023.
» **ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ప్రారంభ తేది:** 10.07.2023
» **తరగతులు ప్రారంభతేది:** 16.08.2023.
» **వెబ్‌సైట్:** www.iift.ac.in

సశస్త్ర సీమా బల్‌లో 914 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

న్యూఢిల్లీలోని హోంమంత్రిత్వ శాఖకు చెందిన సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ).. హెడ్ కానిస్టేబుల్(గ్రూప్ సి నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 914
» **కేటగిరీల వారీగా ఖాళీలు:** హెడ్ కానిస్టేబుల్స్(ఎలక్ట్రీషియన్)–15, హెడ్ కానిస్టేబుల్స్(మెకానిక్–పురుషులు)–296, హెడ్ కానిస్టేబుల్స్(స్టీవార్డ్)–02, హెడ్ కానిస్టేబుల్స్(వెటర్నరీ)–23, హెడ్ కానిస్టేబుల్స్(కమ్యూనికేషన్)–578.
» **అర్హత:** పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** హెచ్‌సీ(మెకానిక్) పోస్టులకు 21 నుంచి 27 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, మెడికల్ టెస్ట్, డాక్యుమెంటేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.ssbrectt.gov.in

నిఫ్టెమ్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు

హర్యానాలో సోనిపట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్(నిఫ్టెమ్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **బీటెక్(ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్):** **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
» **అర్హత:** ఇంటర్మీడియట్(10+2)ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(మెయిన్స్)2023 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** సీఎస్ఏబీ నిర్వహించే సెంట్రల్ కౌన్సెలింగ్ ద్వారా ఎంపికచేస్తారు.
» **ఎంటెక్: విభాగాలు:** ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంబీఏ:** **కోర్సు వ్యవధి:** రెండేళ్లు. **విభాగాలు:** ఫుడ్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్/ఫైనాన్స్/ఇంటర్నేషనల్ బిజినెస్. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.
» **పీహెచ్‌డీ: విభాగాలు:** అగ్రికల్చర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, బేసిక్ అండ్ అప్లైడ్ సైన్సెస్, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
» **వెబ్‌సైట్:** www.niftem.ac.in

వినూత్న కెరీర్.. ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్!

హత్యలు, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు.. ఇలా నేరం ఏదైనా..క్రిమినల్స్‌ను గుర్తించడంలో ఫోరెన్సిక్ నిపుణుల నివేదికలు అత్యంత కీలకం! కానీ..దేశంలో ఫోరెన్సిక్ నిపుణుల కొరత అధికంగా ఉంది!! దీంతో ఫోరెన్సిక్ విభాగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు కేంద్ర హోంశాఖ పరిధిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటైంది. ఈ విద్యాసంస్థ అందించే కోర్సులు పూర్తిచేసుకుంటే.. ఫోరెన్సిక్ రంగంలో వినూత్న అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. తాజాగా.. 2023-24 ప్రవేశాలకు సంబంధించి ఎన్ఎఫ్ఏటీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో... ఎన్ఎఫ్ఎస్‌యూ అందించే కోర్సులు, క్యాంపస్‌లు, ఎంపిక ప్రక్రియ, ప్రవేశ పరీక్ష విధానం, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..

» నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ అడ్మిషన్ నోటిఫికేషన్
» ఫోరెన్సిక్ సైన్స్, క్రిమినాలజీ, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో కోర్సులు
» నేషనల్ ఫోరెన్సిక్ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఎఫ్ఏటీ) ద్వారా ప్రవేశాలు
» ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులతో ఉపాధి అవకాశాలకు మార్గం

ఫోరెన్సిక్ సైన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్రిమినాలజీ, సైకాలజీ, బిహేవియరల్ సైన్స్ తదితర విభాగాల్లో నిపుణులను తీర్చిదిద్దే ఉద్దేశంతో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ పలు కోర్సులు అందిస్తోంది. జాతీయ ప్రాధాన్యం గల సంస్థ(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) హోదా ఉన్న ఈ వర్సిటీలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. విస్తృత కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు.

9 క్యాంపస్‌లు.. 2,462 సీట్లు

మూడేళ్ల క్రితం ఏర్పాటైన ఎన్ఎఫ్ఎస్‌యూ.. ప్రస్తుతం తొమ్మిది(గుజరాత్, ఢిల్లీ, గోవా, త్రిపుర, భోపాల్, పుణె, గువహటి, మణిపూర్, ధర్వాడ్) క్యాంపస్‌ల ద్వారా పీహెచ్‌డీ, పీజీ, బీటెక్, బీఎస్సీ, బీఏ, ఎంబీఏ, లా, క్రిమినాలజీ, సైకాలజీ తదితర వినూత్న కోర్సులు అందిస్తోంది. ఇందులో పీహెచ్‌డీ మొదలు పీజీ డిప్లొమా వరకు.. పలు విభాగాల్లో 2,462 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఇంటిగ్రేటెడ్ కోర్సులు

ఎన్ఎఫ్ఎస్‌యూ..ఇంటిగ్రేటెడ్ కోర్సులు కూడా అందిస్తోంది. అయిదేళ్ల వ్యవధిలో.. బీఎస్సీ+ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్), బీటెక్+ఎంటెక్ సీఎస్ఈ(సైబర్ సెక్యూరిటీ), బీఏ+ఎంఏ(క్రిమినాలజీ), బీబీఏ+ఎంబీఏ(ఫోరెన్సిక్ ఆడిటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్), బీబీఏ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీఎస్‌సీ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్) కోర్సులను అందిస్తోంది. వీటికి ఇంటర్మీడియెట్ అర్హతగా నిర్దేశించారు. ఎల్ఎల్‌బీ కోర్సులకు సంబంధించి క్లాట్ ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశిస్తున్నారు.

కోర్సులు-అర్హతలు

- **ఎమ్మెస్సీ:** ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ బయోటెక్నాలజీ, మల్టీ మీడియా ఫోరెన్సిక్స్; ఎమ్మెస్సీ సైబర్ సెక్యూరిటీ, ఎమ్మెస్సీ–డిజిటల్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎమ్మెస్సీ హోంల్యాండ్ సెక్యూరిటీ, ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ(ఫోరెన్సిక్ ఫుడ్ అనాలిసిస్ స్పెషలైజేషన్), క్లినికల్ సైకాలజీ, న్యూరో సైకాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, టాక్సికాలజీ; ఎమ్మెస్సీ కెమిస్ట్రీ(ఫోరెన్సిక్ అనలిటికల్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్); ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్(ఎన్విరాన్‌మెంటల్ ఫోరెన్సిక్స్ స్పెషలైజేషన్); ఎమ్మెస్సీ ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్లు.
- **అర్హత:** ఆయా కోర్సులను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 55 లేదా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంఏ కోర్సులు:** మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం(ఫోరెన్సిక్ జర్నలిజం స్పెషలైజేషన్), పోలీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, క్రిమినాలజీ(ఫోరెన్సిక్ సైకాలజీ స్పెషలైజేషన్); **అర్హత:** 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- **ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు:** బీఎస్సీ+ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్; **అర్హత:** ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌లలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **బీటెక్+ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ): అర్హత:** ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్టులుగా చదవడంతోపాటు కెమిస్ట్రీ/బయాలజీ/ఇన్ఫర్మేషన్ ప్రాక్టీసెస్/బయోటెక్నాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/ బిజినెస్ స్టడీస్/ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సబ్జెక్ట్‌లతో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి.
- **బీఏ+ఎంఏ(క్రిమినాలజీ): అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **బీబీఏ+ఎంబీఏ(ఫోరెన్సిక్ ఆడిట్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్స్): అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **బీబీఏ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్),బీఎస్సీ+ఎల్ఎల్‌బీ(ఆనర్స్): అర్హత:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు క్లాట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంటెక్ ప్రోగ్రామ్‌లు:** ఎంటెక్(సైబర్ సెక్యూరిటీ), ఎంటెక్–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్(సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్); ఎంటెక్ సివిల్ ఇంజనీరింగ్(ఫోరెన్సిక్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్); ఎంటెక్ రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఎంటెక్–అప్లైడ్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.



- **అర్హత:** ఆయా కోర్సులను అనుసరించి బీటెక్(సీఎస్ఈ/ఐటీ/ఈసీఈ) లేదా ఎంసీఏ కోర్సుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులు:** ఎంబీఏ–ఫోరెన్సిక్ ఆడిటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్, ఎంబీఏ–బిజినెస్ అనలిటిక్స్, ఎంబీఏ–హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, అర్హత: 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంబీఏ సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్: అర్హత:** ఐటీ/కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో బీఎస్సీ లేదా సైబర్ ఫోరెన్సిక్/కంప్యూటర్ ఫోరెన్సిక్/సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టులతో బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.

ఫార్మసీ-పీజీ కోర్సులు

- ఎం.ఫార్మసీ(ఫోరెన్సిక్ ఫార్మసీ స్పెషలైజేషన్), ఎం.ఫార్మసీ(ఫార్మాస్యుటికల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్పెషలైజేషన్); అర్హత: 55 శాతం మార్కులతో బి-ఫార్మసీ ఉత్తీర్ణత ఉండాలి; -ఎమ్మెస్సీ ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ: అర్హత: సైన్స్/ఫార్మసీ/మెడిసిన్/ఇంజనీరింగ్‌లలో 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.

'లా' ప్రోగ్రామ్స్

- **ఎల్ఎల్ఎం(సైబర్ లా అండ్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్), ఎల్ఎల్ఎం(క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ అడ్మినిస్ట్రేషన్): అర్హత:** ఎల్ఎల్‌బీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు పీజీ-క్లాట్ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎల్ఎల్‌బీ(ఆనర్స్): అర్హత:** 45 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ఎన్ఎఫ్ఏటీ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత ఉండాలి.

ఇతర కోర్సులు

- **డిప్లొమా ఇన్ కెనైన్ సైన్సెస్: అర్హత:** డిప్లొమా ఇన్ పోలీస్ డాగ్ హ్యాండ్లింగ్ ఉత్తీర్ణత లేదా 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు డాగ్ హ్యాండ్లర్‌గా మూడేళ్ల అనుభవం ఉండాలి.
- **ఎం.ఫిల్(క్రిమినల్ సైకాలజీ): అర్హత:** సైకాలజీ స్పెషలైజేషన్‌తో ఎంఏ లేదా ఎమ్మెస్సీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **పీహెచ్‌డీ:** ఫోరెన్సిక్స్ అండ్ అల్లైడ్ సైన్సెస్.
- **వివిధ విభాగాల్లో పీజీ డిప్లొమా కోర్సులు: అర్హత:** ఆయా కోర్సులను అనుసరించి బ్యాచిలర్/పీజీ స్థాయిలో..బయాలజీ, బయో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ/ఫోరెన్సిక్ సైన్సెస్/మెడిసిన్/ఫార్మసీ/అగ్రికల్చర్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/కెమిస్ట్రీ /బీటెక్(సీఎస్ఈ/ఐటీ/ఈసీఈ)/ఆయుష్ కోర్సులలో 50 లేదా 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.

ఎన్ఎఫ్ఏటీ స్కోర్‌తో ప్రవేశం

- దాదాపు 60కిపైగా కోర్సులను అందిస్తున్న ఎన్ఎఫ్ఎస్‌యూ.. వీటిల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఎన్ఎఫ్ఏటీ నిర్వహిస్తోంది. వంద ప్రశ్నలతో వంద మార్కులకు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. పరీక్ష సమయం గంటన్నర.
- పీజీ డిప్లొమా కోర్సులకు నిర్దేశిత విద్యార్హతల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. ఈ కోర్సుల అభ్యర్థులు ఎన్ఎఫ్ఏటీకి హాజరవ్వాల్సిన అవసరం లేదు. ఎం.ఫిల్, పీహెచ్‌డీ కోర్సులకు ఎంట్రన్స్ టెస్ట్‌తో పాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు.

కొలువులు ఖాయం

- ఫోరెన్సిక్ కోర్సుల ఉత్తీర్ణులకు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్, ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్, ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్, ఫోరెన్సిక్ స్పీచ్ ఎక్స్‌పర్ట్, పాథాలజిస్ట్, ఫోరెన్సిక్ ఆడిటింగ్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.
- ప్రభుత్వ రంగంలో సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ఫింగర్ ప్రింట్ బ్యూరోలు, ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, సీబీఐ, ఐబీ వంటి ప్రభుత్వ శాఖల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.
- ప్రైవేట్ రంగంలో ఫార్మాస్యుటికల్ సంస్థలు, ఆస్పత్రులు, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. వీటితో పాటు విద్యా రంగంలోనూ అధ్యాపకులుగా కెరీర్ ప్రారంభించొచ్చు. • ఫోరెన్సిక్ విభాగంలో కొలువులు సొంతం చేసుకున్న వారికి నెలకు రూ.50 వేల వరకు వేతనం లభిస్తోంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మే 29, 2023
- **ఎన్ఎఫ్ఏటీ పరీక్ష తేదీ:** జూలై 1, 2 తేదీల్లో
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nfsu.ac.in, www.nta.ac.in

క్లుప్తంగా...

ఐసెట్‌కు 90.20 శాతం హాజరు

సాక్షి, అమరావతి/అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐసెట్-2023) ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్‌కు 90.20 శాతం హాజరు నమోదైంది. 49,162 మంది దరఖాస్తు చేసుకోగా 44,343 మంది పరీక్ష రాశారు. ఈ నెల 26న సాయంత్రం ప్రాథమిక 'కీ' విడుదల విడుదల చేస్తారు. కీ పై ఏపీ ఐసెట్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 28 సాయంత్రం 6 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 22 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.కాగా మొదటి రోజు మొత్తం 22 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమొదయ్యాయి.

ఉచిత విద్యకు 14,192 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి 14,192 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. చట్ట ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25% ప్రవేశాలు ఉచితంగా కల్పించాలి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2023-24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాలకు పాఠశాల విద్యాశాఖ ఎంపికలు చేపట్టింది. రెండు విడతల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారిలో అన్ని అర్హతలున్న 14,192 మందిని లాటరీ పద్ధతిలో ఒకటో తరగతి ప్రవేశాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు, వారికి కేటాయించిన పాఠశాలల వివరాలను డీఈవోలు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లకు అందజేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పి.సురేష్ కుమార్ తెలిపారు. కేటాయించిన పాఠశాల వివరాలను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా పంపించామన్నారు. ఎంపికైన వారు ఈ నెల 28లోగా కేటాయించిన పాఠశాలల్లో చేరాలని చెప్పారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు చర్యలు

సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రతి విద్యార్థిలోను తరగతిలో నైపుణ్యం, సామర్థ్యం పెంపొందేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని, అందుకనుగుణంగా శిక్షణ ఇవ్వాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు సూచించారు. 'నాణ్యమైన కార్యాచరణ ప్రణాళిక తయారీ' అంశంపై విజయవాడలో జరిగిన శిక్షణ సదస్సు బుధవారం ముగిసింది. జిల్లా రిసోర్స్ పర్సన్స్, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్సీఈఆర్టీ సిబ్బందికి యూనిసెఫ్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టం (సిప్స్), సేవ్ ది చిల్డ్రన్ భాగస్వామ్యంతో అభ్యసన అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ..ప్రభుత్వంఆధ్వర్యంలో నడుస్తోన్న పాఠశాలల్లో 6,7,8 తరగతుల విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు వారి సామర్థ్యాన్ని బట్టి పదాలస్థాయి, వాక్య నిర్మాణం, గణితం, సమాచార సామర్థ్యం పెంపు వంటి అంశాల్లో నాణ్యమైన శిక్షణ ఇవ్వాలన్నారు. అందుకోసం ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం 10 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేస్తామని చెప్పారు.

వైద్య, ఆరోగ్యశాఖలో బదిలీలకు మార్గదర్శకాలు

ఉత్తర్వులు జారీచేసిన ఆ శాఖ స్పెషల్ సీఎస్

సాక్షి అమరావతి: వైద్య, ఆరోగ్యశాఖలో సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అభ్యర్థన పూర్వక (వన్ రిక్వెస్ట్), పరిపాలన సౌలభ్యం కోసం మాత్రమే బదిలీలకు అనుమతిస్తారు. ఒకేచోట 2023 ఏప్రిల్ 30 నాటికి కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తిచేసిన వాళ్లు మాత్రమే రిక్వెస్ట్ బదిలీలకు అర్హులు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారిని సీనియార్టీ ప్రాతిపదికన బదిలీ చేస్తారు. క్యాడర్ స్ట్రెంత్‌లో 30 శాతానికి మించకుండా బదిలీలకు అనుమతిస్తారు. ఎంపీహెచ్ఏ (ఎఫ్), ఏఎన్ఎంలకు మాత్రం ఇటీవల జారీచేసిన జీవో నం.6 ప్రకారమే పరస్పర బదిలీలకు అనుమతిస్తారు. 40 శాతం వైకల్యం కలిగిన వారితోపాటు అంధులు, మానసిక వికలాంగులు, భార్యాభర్తలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు, కారుణ్య నియామకం కింద నియమితులైన వితంతువులకు ఈ సాధారణ బదిలీల్లో తొలి ప్రాధాన్యత ఇస్తారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో కనీసం రెండేళ్లు పనిచేసినవారికి ప్రాధాన్యతనిస్తారు. ఈ బదిలీల్లో నోటిఫైడ్ ఏజెన్సీ ప్రాంతాల్లో పేర్కొన్న ఖాళీల భర్తీకి తొలుత ప్రాధాన్యత ఇస్తారు. ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ప్రత్యేక గైడ్‌లైన్స్ జారీచేయనున్నారు. జూన్ 24వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలవరం తొలిదశ సవరించిన అంచనాలపై
నేడు ఢిల్లీలో కీలక భేటీ

- తొలిదశ పూర్తికి రూ.16,952.07 కోట్లతో సవరించిన వ్యయ ప్రతిపాదన పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- దీనిపై పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ సమీక్ష
- సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేసి కేంద్ర మంత్రిమండలికి పంపనున్న జల్‌శక్తి శాఖ
- కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేస్తే పోలవరానికి నిధుల విడుదలకు మార్గం సుగమం
- 2013-14 ధరల ప్రకారం నిధులు ఇస్తే పోలవరాన్ని పూర్తిచేస్తానని నాడు అంగీకరించిన చంద్రబాబు
- ఆ లెక్క ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.20,398.61 కోట్లే
- భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.33,168.23 కోట్లు అవసరం
- ఇప్పటికే పోలవరానికి రూ.20,949.49 కోట్లు వ్యయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేస్తూ పోలవరాన్ని పూర్తిచేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలిదశను పూర్తిచేయడానికి రూ.16,952.07 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం పంపిన సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలపై కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఢిల్లీలో గురువారం కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం, కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా తదితరులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. తొలిదశ సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేశాక.. ఆ ప్రతిపాదనను కేంద్ర మంత్రిమండలికి కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ పంపుతారు. దానిపై కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేస్తే పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్రమోదీతో సమావేశమైనప్పుడు అడ్‌హాక్‌గా రూ.పదివేల కోట్లు విడుదల చేసి, రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం లేకుండా చూడటం ద్వారా పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి రైతులకు ముందస్తు ఫలాలను అందించడానికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ.. సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రతిపాదన మేరకు పోలవరానికి నిధుల విడుదలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర జల్‌శక్తి శాఖను ఆదేశించారు. ఈ క్రమంలోనే పోలవరం తొలిదశ పూర్తి చేయడం ద్వారా ముందస్తు ఫలాలను రైతులకు అందించడంపై ఏప్రిల్ 10న రాష్ట్ర జలవనరుల శాఖ, పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి సమీక్ష సమావేశం నిర్వహించారు. కమీషన్ల కక్కుర్తితో, ప్రణాళికారాహిత్యంతో చంద్రబాబు చేపట్టిన పనుల వల్ల గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చటంతోపాటు 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో కొత్తగా 36 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడానికి అవసరమైన వ్యయంపై సవరించిన ప్రతిపాదనలనుపంపాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను ఆ సమావేశంలో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి ఆదేశించారు. ఆ మేరకు తొలిదశ పూర్తిచేయడానికి రూ.16,952.07 కోట్లతో సవరించిన వ్యయ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న పీపీఏకి పంపింది. ప్రాజెక్టును సమగ్రంగా పూర్తిచేయడం కోసం 2017-18 ధరల ప్రకారం సవరించిన అంచనా రూ.55,656.87 కోట్లను ఆమోదించి, నిధులు విడుదల చేయాలని కోరింది.

వెంటాడుతున్న చంద్రబాబు పాపాలు

- విభజన చట్టం ప్రకారం కేంద్రమే పోలవరాన్ని నిర్మించాలి. కానీ కమీషన్ల కక్కుర్తితో పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికే అప్పగించాలని కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. దీంతో కేంద్రం 2016 సెప్టెంబరు 7న పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. 2013-14 ధరల ప్రకారం.. 2014 ఏప్రిల్ 1 నాటికి నీటిపారుదల విభాగంలో మిగిలిన వ్యయాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని కేంద్రం పెట్టిన షరతుకు నాటి సీఎం చంద్రబాబు అంగీకరించారు.
- 2013-14 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్టు నీటిపారుదల విభాగం పనులకు అయ్యే వ్యయం రూ.20,398.61 కోట్లుగా సీడబ్ల్యూసీ ఖరారు చేసింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించకముందే రూ.4,730.71 కోట్లను పోలవరం పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసింది. దీన్ని మినహాయిస్తే రూ.15,667.90 కోట్లను మాత్రమే ఇస్తామని కేంద్రం తేల్చిచెప్పింది.
- భూసేకరణ చట్టం-2013 ప్రకారం పోలవరం భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.33,168.23 కోట్లు అవసరమైతే.. కేవలం రూ.20,398.61 కోట్లతోనే పోలవరాన్ని పూర్తిచేస్తానని చంద్రబాబు అంగీకరించడం ద్వారా ఆ ప్రాజెక్టుకు సమాధి కట్టారు.
- జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించకముందు రూ.4,730.71 కోట్లు, తర్వాత రూ.16,218.78 కోట్లు వెరసి.. రూ.20,949.49 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఖర్చుచేసింది. చంద్రబాబు అంగీకరించిన మేరకు 2013-14 ధరల ప్రకారం ప్రాజెక్టు నీటిపారుదల విభాగానికి అయ్యే రూ.20,398.61 కోట్ల కంటే రాష్ట్ర ప్రభుత్వం అధికంగా రూ.550.88 కోట్లు వ్యయం చేసింది. దీంతో ఇకపై పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు విడుదల చేయాలంటే సవరించిన అంచనా వ్యయాన్ని కేంద్ర మంత్రిమండలి ఆమోదించాలి.

పోలవరం తొలిదశ పూర్తికి అవసరమైన వ్యయం విభాగాల వారీగా..

విభాగం	సవరించిన అంచనా వ్యయం (రూ.కోట్లలో)
1. ప్రధాన డ్యామ్, కాలువల్లో మిగిలిన పనుల పూర్తికి	6,593.02
2. డయాఫ్రమ్ వాల్ పటిష్టీకరణ, అగాధాల పూడ్చివేతకు	2,020.05
3. ప్రాజెక్టు నిర్వహణ, అత్యవసర పనులకు	945.00
4. 41.15 కాంటూర్‌లో మిగిలిన నిర్వాసితులకు పునరావాసం కల్పనకు	2,177.00
5. 41.15 కాంటూర్‌లోకి కొత్తగా చేర్చిన 36 గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పనకు	5,127.00
6. ఎడమ కాలువలో కుమ్మరలోవ భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికి	90.00
మొత్తం	16,952.07

పూర్తిచేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు

కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు చేసిన పాపాలను సీఎం వైఎస్ జగన్ ప్రక్షాళన చేస్తూ.. ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టును వడివడిగా పూర్తిచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే పోలవరానికి నిధుల సమస్యను పరిష్కరించాలని ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లకు పలుమార్లు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.33,168.23 కోట్లు వ్యయమవుతుందని.. ఈ నేపథ్యంలో రూ.20,398.61 కోట్లతో ప్రాజెక్టు మొత్తాన్ని పూర్తిచేయడం అసాధ్యమని వివరించారు. ప్రాజెక్టును పూర్తిచేయాలంటే 2017-18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి.. ఆ మేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ వస్తున్నారు. వాటిపై స్పందించిన ప్రధాని నరేంద్రమోదీ రెండుదశల్లో పోలవరాన్ని పూర్తిచేసేందుకు నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర జల్‌శక్తి శాఖను ఆదేశించినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

వివేకాను హత్య చేసిన వాళ్లు బయట తిరుగుతున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

విమలమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. "వైఎస్ వివేకానందరెడ్డి అన్న మంచి పేరుతో బతికారు. ఆయన హత్య తర్వాత ఆ మంచితనానికే మచ్చ తెస్తున్నారు. ఇది చాలా అన్యాయంగా ఉంది. రాజకీయంగా కూడా ఎంత మంచిగా ఉన్నాడో అందరికీ తెలుసు. అనవసరంగా అవినాశ్‌ను లక్ష్యంగా చేసుకుని సీబీఐ ముందుకెళ్తోంది. ఇదెంతమాత్రమూ న్యాయం కాదు. దయజేసి గమనించండి. మీడియా వల్ల ప్రజలకు సరైన విషయాలు తెలియాలి. ఆ ఉద్దేశంతోనే మీడియా పనిచేయాలి. అదే బాగుంటుంది. న్యాయం ఆలస్యమైనా గెలుస్తుంది. దేవుడు ఎప్పుడూ అన్యాయం చేయడు. తల్లి ప్రార్థనలు దేవుడు ఆలకిస్తూనే ఉన్నాడు" అని విమలమ్మ వ్యాఖ్యానించారు. 'అత్తా! నేను ఏ తప్పు చేయలేదని, నేను దేవున్ని నమ్ముతున్నానని, నాకు న్యాయం జరుగుతుందని చాలా ధైర్యంగా అవినాశ్ నాతో ఆస్పత్రిలో చెప్పారు!' అని అన్నారు. తప్పు చేస్తే అది మొహంలో తెలిసిపోతుందని చెప్పారామె.

సునీత వెనక దుష్టశక్తులున్నాయి...

ఒకవైపు కూతురు లాంటి మేనకోడలు సునీత, మరోవైపు సోదరుడి కుమారుడు అవినాశ్ ఉన్నారని విమలమ్మ వ్యాఖ్యానించారు. "ఎవరు తప్పు? ఎవరు ఒప్పు? అనేది దేవుడికే తెలియాలి. అయితే అవినాశ్‌రెడ్డి మాత్రం ఏ తప్పూ చేయలేదనే నమ్మకం నాకుంది. తన తండ్రి హత్య వెనుక ఈ కుటుంబ సభ్యులు లేరని సునీతే గతంలో చెప్పింది. మళ్లీ ఇపుడు ఎందుకు మాట మారుస్తోందో తెలియడం లేదు. కానీ సునీత వెనుక దుష్టశక్తులు ప్రభావం చుపుతున్నాయని నాకు అనిపిస్తోంది. ఎందుకంటే నేను గతంలో ఆమెతో మాట్లాడాను. నువ్వు చేస్తున్నది తప్పని చెప్పా. నలుగురు వ్యక్తులు మేమే చంపామని చెబుతుంటే ఎందుకు ఏ తప్పూ చేయని వారిని టార్గెట్ చేశావని అడిగా. ఆధారాలు లేనప్పుడు అవినాశ్‌ను ఎందుకు లక్ష్యం చేశావని అడిగా. కానీ ఆమె మాట్లాడేందుకు ఇష్టపడలేదు. మనం దేవుని బిడ్డలం.. దేవుడే చూసుకుంటాడు. ఇలాంటివి చేయకమ్మా అని చెబితే సునీత వినలేదు" అని విమలమ్మ వివరించారు. ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ... "ఎలాంటి రుజువులూ లేనప్పుడు ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం సరైంది కాదు. పోనీ ఆధారాలు చూపించమంటే చూపించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. సున్నిత మనస్తత్వం ఉన్న అవినాశ్‌ను టార్గెట్ చేయడం అన్యాయం అనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. ఏ తప్పూ చేయని అన్న (వైఎస్ భాస్కర్‌రెడ్డి) జైలులో ఉన్నాడని, 72 ఏళ్ల ఆయనకు వెన్నెముక నొప్పి ఉన్నా కేసులు పెట్టారని, ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తన సోదరుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు తమ కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉండేవని, ఇప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశం అనంతరం మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రి ఎదుట ఎమ్మెల్యేలు, కార్యకర్తల నిరసన

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ వాస్తవాలు తేల్చాలని, బాధితులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కోరారు. బుధవారం వారు విశ్వభారతి ఆస్పత్రి ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఐదురోజులుగా వందల సంఖ్యలో కార్యకర్తలు ఆస్పత్రి ఎదుటే రాత్రింబవళ్లు ఉంటున్నారు. తల్లి అనారోగ్యంతో ఆమె బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌కు మద్దతుగా వారు అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా ఆస్పత్రికి వచ్చి శ్రీలక్ష్మిని పరామర్శించి వెళుతున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి శ్రీలక్ష్మిని పరామర్శించారు. తర్వాత ఆస్పత్రి ఎదుట వైఎస్ మదన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాచమల్లు, హఫీజ్‌ఖాన్, సుధాకర్, శంకరనారాయణ, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మేయర్ బీవై రామయ్య, కడప, కర్నూలు కార్పొరేటర్లు, మండలాధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. అవినాశ్‌కు అండగా కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట ప్రశాంతవాతావరణంలో బైఠాయించడం మినహా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకపోవటంతో బుధవారం పోలీసు బందోబస్తును తగ్గించారు.

అది 'కిడ్నాప్' కిందకు రాదు

- అత్తమామల నుంచి తండ్రి తన పిల్లలను తీసుకెళ్లడంపై హైకోర్టు
- మహ్మదీయ చట్ట ప్రకారం పిల్లలకు తండ్రే చట్టబద్ధ సంరక్షకుడు
- జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి తీర్పు



సాక్షి, అమరావతి: సున్నీ మహ్మదీయ చట్టం ప్రకారం పిల్లలకు తండ్రి చట్టబద్ధ సంరక్షకుడని.. అతను తన పిల్లలను అత్తమామల నుంచి తీసుకెళ్లడం 'కిడ్నాప్' కిందకు రాదని హైకోర్టు స్పష్టం చేసింది. చట్టబద్ధ సంరక్షులకుండే హక్కు కంటే తల్లి హక్కు ఉన్నతమైనదేమీ కాదని పేర్కొంది. అత్తమామల నుంచి పిల్లలను తీసుకెళ్లిన తండ్రిపై కిడ్నాప్ కేసు నమోదు చేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. తండ్రితో పాటు అతని వెంట వెళ్లిన వ్యక్తిపై అనంతపురం జిల్లా గుత్తి పోలీసులు నమోదు చేసిన కిడ్నాప్ కేసును కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఇటీవల తీర్పు వెలువరించారు. వివరాలు.. గుత్తిలోని జంగాల కాలనీలో తన తల్లిదండ్రుల వద్ద ఉన్న పిల్లలను తన భర్త, మరో వ్యక్తి కలిసి కిడ్నాప్ చేశారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలంటూ భర్త, అతని బంధువులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది బైరెడ్డి వరుణ్ వాదనలు వినిపిస్తూ.. సున్నీ మహ్మదీయ చట్టం ప్రకారం పిల్లలకు తండ్రే సహజ, చట్టబద్ధ సంరక్షకుడు అవుతారని తెలిపారు. సున్నీ చట్టం ప్రకారం కుమారుడికి 7 ఏళ్లు, షియా చట్టప్రకారం 2 ఏళ్లు వచ్చే వరకే ఆ పిల్లలను తల్లి తన సంరక్షణలో ఉంచుకోగలరని చెప్పారు. ఆ తర్వాత పిల్లలు తండ్రి సంరక్షణలోనే ఉండాలన్నారు. అందువల్ల కిడ్నాప్ కేసు చెల్లదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. మహ్మదీయ చట్టం ప్రకారం మైనర్ పిల్లలకు కొంత వయసు వచ్చే వరకే తల్లి సంరక్షురాలిగా ఉంటారని.. ఆ తర్వాత తండ్రే సహజ, చట్టబద్ధ సంరక్షకుడు అవుతారని పేర్కొన్నారు. నిర్దిష్ట వయసు దాటిన పిల్లలను తండ్రి తన సంరక్షణలోకి తీసుకోవడం కిడ్నాప్ కిందకు రాదన్నారు. కిడ్నాప్ కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

భైడెన్‌ను హత్య చేసి అధ్యక్షుడినవుతా!

- వైట్‌హౌస్ కంచెను ట్రక్కుతో ఢీకొట్టిన కందుల సాయివర్షిత్
- అమెరికాలో తెలుగు సంతతి యువకుడి అరెస్టు



ఈ ట్రక్కులోనే సాయివర్షిత్ వైట్‌హౌస్‌లోకి దూసుకొచ్చింది

వాషింగ్టన్: మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉందో లేదోగానీ అమెరికాలో తెలుగు సంతతి యువకుడు కందుల సాయివర్షిత్ ఏకంగా అధ్యక్షుడు జో బైడెన్ హత్యకు పన్నాగం పన్ని, తీవ్ర కలకలం సృష్టించాడు. బైడెన్‌ను హత్య చేసి, అధ్యక్ష పదవిని దక్కించుకోవడమే తన లక్ష్యమని అతడు చెప్పడంతో పోలీసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. సాయివర్షిత్ మాటల్లో నిజమెంత? అతడి వెనుక ఎవరున్నారు? అనేది తెలుసుకోవడానికి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్థానిక మీడియా కథనం ప్రకారం.. మిస్సోరీలోని చెస్టర్‌ఫీల్డ్‌లో నివసించే 19 ఏళ్ల సాయివర్షిత్ సోమవారం సెయింట్ లూయిస్ నుంచి విమానంలో రాజధాని వాషింగ్టన్ డీసీకి చేరుకున్నాడు. యూ-హాల్ అనే సంస్థ నుంచి భారీ ట్రక్కును అద్దెకు తీసుకున్నాడు. ట్రక్కును నడుపుతూ వైట్‌హౌస్ వద్దకు చేరుకుని, రాత్రి 10 గంటల సమయంలో వైట్‌హౌస్ తూర్పు వైపున సెక్యూరిటీ కంచెను రివర్స్‌లో రెండుసార్లు ఢీకొట్టాడు. ఈ కంచె వైట్‌హౌస్ గేటుకు సమీపంలోనే ఉంది. ట్రక్కు వేగం ధాటికి కంచె ధ్వంసమయ్యింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది సాయివర్షిత్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అడ్డొచ్చేవారిని చంపడమే లక్ష్యం

సాయివర్షిత్‌ను పోలీసులు విచారించగా..జో బైడెన్‌ను హతమార్చి, అమెరికా పాలనను తన చేతుల్లోకి తీసుకోవడానికి ఆరు నెలల క్రితమే ప్రణాళిక సిద్ధం చేశానని చెప్పాడు. తన మొత్తం ప్లాన్ 'గ్రీన్‌బుక్'లో ఉందని వెల్లడించాడు. తన మార్గానికి అడ్డొచ్చే వారిని చంపడమే తన లక్ష్యమని వివరించాడు. సాయివర్షిత్‌పై కేసు నమోదు చేయడంతోపాటు 1,000 డాలర్ల విలువైన అమెరికా ఆస్తిని(సెక్యూరిటీ కంచె) ధ్వంసం చేశాడని అభియోగం మోపారు.

కేతు విశ్వనాథరెడ్డికి కన్నీటి వీడ్కోలు




కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయం

ఎర్రగుంట్ల/కడప వైఎస్సార్ సర్కిల్: సాహితీ శిఖరం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (84)కి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని రంగసాయిపురంలో బుధవారం కుటుంబసభ్యులు, ఆప్తుల నడుమ అంత్యక్రియలు జరిగాయి. అంతకుముందు కడప నుంచి ఆయన భౌతిక కాయాన్ని ఇక్కడి స్వగృహానికి తీసుకొచ్చారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రనాథ్‌రెడ్డి, కార్మిక నాయకుడు ఎం.రమణారెడ్డి, టీడీపీ నాయకుడు లింగారెడ్డితో పాటు పలువురు రచయితలు, సాహితీవేత్తలు, నాయకులు పాల్గొన్నారు. కడప సింగపూర్ టౌన్ షిప్‌లో కేతు విశ్వనాథరెడ్డి భౌతిక కాయం వద్ద సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ నివాళులర్పించారు

నిధులు విడుదల చేసినా వక్రభాష్యాలా?

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్



బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని, గతంలో రావాల్సిన ఫైనాన్స్ డెఫిసిట్ బ్యాలెన్స్‌ను మంగళవారం విడుదల చేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ చెప్పారు. కాకినాడ జిల్లా కాకినాడలో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేస్తే.. ఇది గిట్టని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇస్తే బీజేపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత అకౌంట్‌లో డబ్బులేసినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్ట్ విషయంలో రాష్ట్రంలో నెగిటివ్‌గా ప్రచారం చేస్తున్నారన్నారు. సీబీఐ తనపని తాను చేసుకుని వెళుతుందన్నారు.

26న సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి 26న (శుక్రవారం) వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించాలని ప్రిన్సిపాళ్లను డీఎంఈ డాక్టర్ నరసింహం ఆదేశించారు. ప్రిన్సిపాళ్లే స్థానికంగా నోటిఫికేషన్ జారీ చేసి పోస్టులను భర్తీ చేసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలను పాటిస్తూ ఎంపిక చేపట్టాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు డీఎంఈ కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేస్తుందని పేర్కొన్నారు.

మహా కుంభాభిషేక తేదీలను ఖరారు చేయండి

దేవదాయ శాఖ, శ్రీశైలం దేవస్థానం ఈవోకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: శ్రీశైలం దేవస్థానంలో మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణకు వీలైనంత త్వరగా తేదీలను ఖరారు చేయాలని దేవదాయ శాఖ, దేవస్థానం ఈవోలను హైకోర్టు ఆదేశించింది. గరిష్టంగా 6 వారాల్లోగా శుభముహూర్తాలను ఖరారు చేయాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖశర్మలతో పాటు వీర శైవ ఆగమ, స్మార్త ఆగమ పండితులు, తదితరులను సంప్రదించాలని ఆదేశించింది. అలాగే గతంలో సంప్రదించిన వారి అభిప్రాయాలను కూడా తీసుకోవాలని సూచించింది. మహాకుంభాభిషేక కార్యక్రమాల్లో భక్తులు, ఆహ్వానితులు పాల్గొనేందుకు వీలుగా ఖరారు చేసిన ముహూర్తం వివరాలను ప్రజలకు తెలియజేస్తూ రాతపూర్వక ఉత్తర్వులు జారీ చేయాలని దేవదాయ శాఖ కమిషనర్, దేవస్థానం ఈవోలను హైకోర్టు ఆదేశించింది. ఖరారు చేసిన తేదీలను తదుపరి విచారణ సమయంలో తమ ముందుంచాలని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలు జరిపేలా దేవస్థానం అధికారులను ఆదేశించాలని కోరుతూ అఖిల భారత వీరశైవ ధార్మిక ఆగమ పరిషత్ చైర్మన్ సంగాల సాగర్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఎనిమిదో వింతలా ఉంది

గంగిరెడ్డి బెయిల్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో సీబీఐ

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఎనిమిదో వింతలా ఉన్నాయని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. జూలై 1న గంగిరెడ్డిని విడుదల చేయాలంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సంజయ్ జైన్ వాదనలు వినిపిస్తూ.. ఇలాంటి ఉత్తర్వులు ఎప్పుడూ వినలేదన్నారు. హైకోర్టు ఆదేశాల్లో చివరి పోర్షన్.. ఆర్డర్ మొత్తానికే హైలెట్ అని పేర్కొన్నారు. కౌంటర్ దాఖలు చేయడానికి ఒక రోజు సమయం ఇచ్చి.. తమ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టాలని కోరారు. తాము దాఖలు చేసిన ఎస్సెల్పీని కూడా జత చేసి వినాలని గంగిరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు సుప్రీంకోర్టును కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. రెండు పిటిషన్లను కలిపి శుక్రవారం విచారిస్తామని పేర్కొంది. పిటిషన్ కాపీలను ప్రతివాదులకు అందజేయాలని గంగిరెడ్డి తరఫు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది.

సవాంగ్‌తో కేరళ సర్వీస్ కమిషన్ సభ్యుల భేటీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అనుసరిస్తున్న ఉద్యోగుల నియామక పద్ధతులపై కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు అధ్యయనం చేశారు. కేరళ నుంచి వచ్చిన డాక్టర్ సీకే షాజీబ్, సి.జయచంద్రన్, కె.ప్రకాశన్, డాక్టర్ జిప్సన్ వి పాల్ బుధవారం ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్‌తో సమావేశమై చర్చించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943